
## గ్రేట్ నికోబార్ ప్రాజెక్టుకు ప్రభుత్వ క్లియరెన్స్



2

# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

హైదరాబాద్ - బుధవారం 10 జూన్ 2026 | సంపుటి: 10 | సంచిక: 155 | పేజీలు:12 | వెల రూ.5

## పాఠశాలల్లో మాంసాహారంపై నిషేధం



2

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA



### రికార్డు స్థాయిలో

## ధాన్యం కొనుగోలు

- రబీ సీజన్‌లో ధాన్యం కొనుగోళ్లలో దేశంలోనే తెలంగాణా అగ్రగామి
- కేంద్రం లక్ష్యాలను తగ్గించినా రైతుల కోసం రాష్ట్ర ప్రభుత్వం ముందడుగు
- నేతలు రైతులను తప్పుదోవ పట్టించే ప్రయత్నం బీజేపీ
- మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి

2

### ఇందిరమ్మ రాజ్యంతోనే..

# మహిళలకు గుర్తింపు



## కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యం

- మహిళా సంఘాలకు సోలార్ ప్లాంట్లు, పెట్రోల్ బంకుల నిర్వహణ
- ఉచిత బస్సు పథకంపై విమర్శలపై సీఎం ఆగ్రహం
- మహిళాశక్తి, స్వయం సహాయక బృందాలకు 553 ఆర్టీసీ బస్సులు పంపిణీ
- మహిళా శక్తి వారోత్సవాల ముగింపు సభలో సీఎం రేవంత్‌రెడ్డి

**హైదరాబాద్,9(మనం,ప్రత్యేక ప్రతినిధి):** మహిళాశక్తిని ప్రపంచానికి చాటిన ఘనత ఇందిరాగాంధీకి దక్కుతుందని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. స్వయం సహాయక బృందాలకు మంగళవారం 553 ఆర్టీసీ బస్సులు పంపిణీ చేసిన సీఎం జెండా ఊపి బస్సులను ప్రారంభించారు. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో మంగళవారం నిర్వహించిన 'మహిళా శక్తి వారోత్సవాల' ముగింపు సభలో ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో సీఎం ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ ఇందిరమ్మ రాజ్యంలోనే మహిళలకు గుర్తింపు ఉంటుందని అన్నారు.

మహిళలతో పెట్టుకున్న ఎవరైనా అధికారంలో ఉంటారా? అని ప్రశ్నించారు. మహిళలతో పెట్టుకున్నందుకే బీఆర్ఎస్ ప్రభుత్వం ఓడిపోయిందన్నారు. అందరికంటే ముందుంటామని మహిళలు నిరూపిస్తున్నారని, వ్యవసాయానికి ...మిగతా 2లో

### నాడు 'ఓట్ చోరీ'..

## నేడు 'సీటు చోరీ'

### మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణపై సీఎం రేవంత్ రెడ్డి ఫైర్

**హైదరాబాద్,జూన్ 9(మనం,ప్రత్యేక ప్రతినిధి):** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్‌ను కేంద్ర ఎన్నికల సంఘం తిరస్కరించడంపై సీఎం రేవంత్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఇదంతా బీజేపీ ఆడుతున్న రాజకీయ కుట్రలో భాగమేనని ఆయన ...మిగతా 2లో

## భావితరాలకు అనుగుణంగానే అడుగులు

- స్థిరమైన, పర్యావరణహిత పారిశ్రామికవృద్ధికి ప్రాధాన్యం
- పారిశ్రామికవేత్తలు పెట్టుబడిదారులు కాదు.. రాష్ట్ర ప్రగతిలో కీలక భాగస్వాములు
- 'ఎఫ్‌టీసీసీఐ ఎక్స్ లెన్స్ అవార్డ్స్ 2026' ప్రదానోత్సవంలో మంత్రి శ్రీధర్ బాబు



**హైదరాబాద్,జూన్ 09(మనం న్యూస్):** భావితరాల ఆకాంక్షలకు అనుగుణంగా తెలంగాణను దేశంలోని ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్ గా తీర్చిదిద్దేలా ప్రణాళికాబద్ధంగా అడుగులు వేస్తున్నామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. భవిష్యత్తు ...మిగతా 2లో

### పశ్చిమాసియా ఉద్రిక్తతలు

### కువైట్ పాలకులకు

## మోడీ ఫోన్



**ఢిల్లీ, జూన్ 9:** పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న వేళ ప్రధాని మోడీ కువైట్ పాలకులకు ఫోన్ చేశారు. కువైట్ యువరాజు (అమీర్) షేక్ మెషల్ అల్ అహ్మద్ అల్ జబీర్ ...మిగతా 2లో

# రోహింగ్యాల లెక్క చెప్పండి

### రాష్ట్రానికి కేంద్రం ఆదేశాలు

- హైదరాబాద్ రోహింగ్యాలపై నజర్
- డేటా సేకరణకు పోలీసుల కసరత్తు
- సహకరిస్తున్న స్థానికులపై ఆరా..!



**హైదరాబాద్,జూన్ 9 (మనం,ప్రత్యేక ప్రతినిధి) :** కేంద్ర నిఘా వర్గాల హెచ్చరికలలో రాష్ట్రంలో రోహింగ్యాల,బంగ్లాదేశ్‌కు చెందిన చొరబాటు దారులపై నిఘా సారిస్తున్నారు. రాష్ట్రంలోని జహీరాబాద్, భైంసా, నిజామాబాద్ తదితర ప్రాంతాలలో రోహింగ్యాలు ఎంతమంది ఉన్నారన్న కోణంలో పోలీసులు విచారణ చేపడుతున్నారు. ముఖ్యంగా హైదరాబాద్ పరిధిలోని అన్ని పోలీసు కమిషన రేట్లలో రోహింగ్యాల వివరాలను ఎస్‌బీ పోలీసులు సేకరిస్తున్నారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్ పరిసర ప్రాంతాలలో దాదాపు 6040 మంది రోహింగ్యాల ఉన్నట్లు ఇప్పటికే పోలీసులు గుర్తించారు. రాచకొండ కమిషనరేట్ పరిధిలో 5 వేల మంది రోహింగ్యాలు, హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో 1000, సైబ రాబాద్ కమిషనరేట్ పరిధిలో వందలాది మంది రోహింగ్యాలు ఉన్నట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది. ఇదే విషయాన్ని పోలీసులు కేంద్ర నిఘా ...మిగతా 2లో

### రాష్ట్రంలోకి ప్రవేశించిన

## నైరుతి రుతుపవనాలు

**హైదరాబాద్,జూన్ 09(మనం న్యూస్):** తెలంగాణ రాష్ట్రంలోకి నైరుతి రుతుపవనాలు సోమవారం ప్రవేశించాయి. నారాయణపేట, జోగులాంబ గద్వాల, నాగర్‌కర్నూల్ జిల్లాల మీదుగా ఇవి రాష్ట్రంలోకి ప్రవేశించినట్లు భారత వాతావరణ శాఖ అధికారికంగా ప్రకటించింది. దీంతో సుదీర్ఘకాలంగా కొనసాగుతున్న వేసవి తాపం నుంచి ప్రజలకు ఉపశమనం లభించనుంది.ఈ నెల 4వ తేదీన కేరళను తాకిన రుతుపవనాలు క్రమంగా

## అక్రమ 'దారుల్లో' అవినీతి భవనాలు

- ఆర్అండ్‌బి ఈఎన్‌సీ అక్రమాస్తులపై ఏసీబీ దాడులు
- 15 ప్రాంతాలలో ఏకకాలంలో తనికీలు
- సోదాలలో భారీ ఎత్తున నగదు,నగలు స్వాధీనం
- మోహన్ నాయక్‌పై అక్రమాస్తుల కేసు
- అక్రమార్కుడి అక్రమాస్తులు రూ. 100 కోట్లు



**హైదరాబాద్,జూన్ 9(మనం,ప్రత్యేక ప్రతినిధి):** ఆదాయానికి మించి ఆస్తుల ఆరోపణలతో రోడ్లు భవనాల శాఖ ఇంజనీర్ ఇన్ చీఫ్ మోహన్ నాయక్ నివాసంలో ఏసీబీ సోదాలు నిర్వహించింది. హైదరాబాద్‌తో పాటు నిజామాబాద్ ప్రాంతాల్లో మొత్తం 15 చోట్ల మంగళవారం ఏసీబీ బృందాలు తనిఖీలు చేపట్టాయి. ఏసీబీ అధికారులు బృందాలు హైదరాబాద్‌లోని మియాపూర్


తెలంగాణ ఆత్మగౌరవ గీతానికి 'చిరస్మరణీయ' నివాళి
మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ 7

మైనారిటీ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు
మంత్రి మహ్మద్ అజారుద్దీన్ 3

మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ భవన నిర్మాణానికి హైకోర్టు బ్రేక్ 2


### హెచ్-1బీపై లక్ష డాలర్ల

# ఫీజు కొట్టివేత

### భారతీయులకు ప్రయోజనమెంత..?

**వాషింగ్టన్, జూన్ 9:** విదేశీ వృత్తి నిపుణుల హెచ్1బీ వీసాలకు ట్రంప్ సర్కార్ విధించిన లక్ష డాలర్ల ఫీజు చట్టవిరుద్ధమంటూ అమెరికాలోని




బోస్టన్ ఫెడరల్ కోర్టు ఇచ్చిన తీర్పుతో అనేక కంపెనీలకు ఊరట లభించినట్లయ్యింది. దీనిపై ప్రవాస భారతీయ సంఘాలు, డెమోక్రాట్లతో పాటు ట్రంప్ సొంత పార్టీ అయిన రిపబ్లికన్ నేతలూ హర్షం వ్యక్తం చేస్తున్నారు. మరి ఈ పరిణామాలు వీసాల జారీపై ఎలాంటి ప్రభావం చూపిస్తాయి..? ఈ తీర్పుతో భారతీయులకు ప్రయోజనం ఎంత?

అమెరికా హెచ్-1బీ అనేది.. నాన్ ఇమిగ్రెంట్ వీసా. ప్రధానంగా ప్రత్యేక వృత్తుల్లో సాంకేతిక నైపుణ్యమున్న విదేశీయులను ఉద్యోగాల్లో నియమించుకోవటానికి యూఎస్ కంపెనీలను ఇది అనుమతిస్తుంది. అగ్రరాజ్యం ఏటా 65వేల మందికి ఈ వీసాలను జారీ చేస్తుంది. వీటితో పాటు అక్కడే మాస్టర్స్ చేసిన మరో 20వేల మందికి ఇవ్వాలనే నిబంధన ఉంది. అంటే మొత్తంగా ఏటా 85వేల హెచ్-1బీ వీసాలు జారీ అవుతుంటాయి. ఈ వీసాలు పొందినవారిలో దాదాపు 70శాతం మంది భారతీయులే ...మిగతా 2లో

## ఒంటరిగా మిగిలిపోతావు జాగ్రత్త..

- నెతన్యాహుకు ట్రంప్ వార్నింగ్..!

**వాషింగ్టన్, జూన్ 9:** ఇరాన్ విషయంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుల మధ్య భేదాభిప్రాయాలు తలెత్తినట్లు తెలుస్తోంది. ఇరాన్- ఇజ్రాయెల్ మధ్య సోమవారం పరస్పర దాడులు జరిగిన సంగతి తెలిసిందే. ఆ సమయంలో దాడులు ఆపాలంటూ నెతన్యాహుకు ట్రంప్ గట్టిగా వార్నింగ్ ఇచ్చారు. ట్రంప్ స్వయంగా ఈ విషయాన్ని మీడియాకు చెప్పడం గమనార్హం.



బీరుట్లోని హెజ్బొల్లా స్థావరాలే లక్ష్యంగా ఇజ్రాయెల్ దాడి చేయడంపై ఇరాన్ ఆగ్రహం వ్యక్తంచేసింది. దీంతో టెల్‌అవీవ్పై టెహ్రాన్ క్షిపణుల వర్షం కురిపించింది. ఈక్రమంలో ఇరుదేశాల మధ్య భీకర పోరు కొనసాగింది. ఇంతలో ట్రంప్ కలుగజేసుకొని.. ప్రతీకార దాడులు చేయొద్దని నెతన్యాహును కోరారు. ఆ సమయంలో 'బీబీ.. మీరు జాగ్రత్తగా ఉండండి' అని తాను నెతన్యాహుతో అన్నట్లు ట్రంప్ పేర్కొన్నారు. ఇరాన్‌పై సైనిక చర్యను తిరిగి ప్రారంభిస్తే.. ఇజ్రాయెల్ ఏకాకిగా మిగిలిపోవాల్సి వస్తుందని హెచ్చరించినట్లు తెలిపారు. ఈక్రమంలో ఘర్షణలు తిరిగి మొదలైతే.. ఇరాన్‌తో దౌత్య ఒప్పందం కుదుర్చుకోవాలనే తన ప్రయత్నాలకు అవి ఆటంకం కలిగిస్తాయని ఆయన ఆందోళన వ్యక్తంచేశారు. దాడుల నేపథ్యంలో నెతన్యాహుపై ఒత్తిడి తేవాలని పలు దేశాలు తనను కోరినట్లు ట్రంప్ తెలిపారు. దీంతో ఇజ్రాయెల్ ప్రతిదాడులను పరిమితం చేసేందుకు తాను ప్రయత్నించినట్లు వెల్లడించారు.

ట్రంప్‌తో ఫోన్ కాల్లో.. ఇరాన్ నుంచి మరిన్ని దాడులు జరగవని హామీ ఇస్తే తప్ప, తాము వెనక్కి తగ్గమని నెతన్యాహు స్పష్టంచేసినట్లు తెలుస్తోంది. ఇజ్రాయెల్ దాడులు ఆపేస్తే.. తాము ఘర్షణకు దిగమని ఇరాన్ అధికారులు మధ్యవర్తుల ద్వారా సంకేతాలు ఇచ్చారు. దీంతో ఇరుదేశాల మధ్య పోరుకు బ్రేక్ పడింది. ఇక, సోమవారం జరిగిన పోరులో అమెరికా సైన్యం పాల్గొనలేదు. అయినప్పటికీ.. ఇరాన్ నుంచి వస్తున్న క్షిపణులను అడ్డుకోవడంలో ఇజ్రాయెల్ బలగాలకు సాయం అందించినట్లు యూఎస్ రక్షణ ...మిగతా 2లో



### పీవోకేలో ఘర్షణలు..

## 30 మంది మృతి!

**ఇస్లామాబాద్, జూన్ 9:** పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్‌లో పలుచోట్ల ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పాకిస్థాన్ భద్రతా దళాలు, నిరసనకారులకు మధ్య జరిగిన ఘర్షణల్లో దాదాపు 30 మంది ప్రాణాలు కోల్పోయినట్లు తెలుస్తోంది. వీరిలో పలువురు భద్రతా సిబ్బంది ఉన్నట్లు సమాచారం. ముజఫరాబాద్, రావల్‌కోట్‌లో చోటుచేసుకున్న హింసాత్మక ఘటనల్లో మొత్తంగా 200 మందికిపైగా గాయపడినట్లు వార్తా కథనాలు వెల్లడిస్తున్నాయి. పీవోకేలో తాజా పరిణామాలపై పాకిస్థాన్ మానవ హక్కుల కమిషన్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. పీవోకేలో జులై 27న అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ క్రమంలో స్థానిక చట్టసభలో శరణార్థుల కోసం కేటాయించిన 12 సీట్లను రద్దు చేయాలని కొంతకాలంగా డిమాండ్ చేస్తోన్న జాయింట్ ఆవామీ యాక్షన్ కమిటీ.. జూన్ 9న నిరసనలకు పిలుపునిచ్చింది. రావల్‌కోట్ ప్రాంతంలో రెండు రోజుల క్రితం భద్రతా దళాలు జరిపిన కాల్పుల్లో ఓ వ్యాపారి ప్రాణాలు కోల్పోయారు. మృతదేహాన్ని తీసుకెళ్లేందుకు వచ్చిన జేఏఏసీ నిరసన కారులు స్థానిక ఆసుపత్రి మార్చురీ ముందు భారీ సంఖ్యలో గుమిగూడారు.

# రూ.13వేల కోట్లతో.. గ్రేట్ నికోబార్ ప్రాజెక్టుకు ప్రభుత్వ క్లియరెన్స్

**అండమాన్, జూన్ 9:** గ్రేట్ నికోబార్ ఎయిర్‌పోర్ట్‌కు కేంద్రం అనుమతులు ఇచ్చింది. రూ.13వేల కోట్లతో పౌర-సైనిక విమానాశ్రయాన్ని నిర్మించనుంది. ఐఎన్ఎస్ బాజ్ వద్ద ఇప్పటికే ఉన్న నావికాదళ విమానాశ్రయాన్ని విస్తరించే ఆలోచనను పక్కనపెట్టింది. పర్యావరణపరంగా వైవిధ్యమైన ద్వీపంలో రూ.81వేల కోట్లతో ప్రకటించిన గ్రేట్ నికోబార్ ఐలాండ్ డెవలప్మెంట్ ప్రాజెక్ట్ ఇప్పటికే రాజకీయ దుమారం రేపుతోంది. ఈక్రమంలోనే ప్రభుత్వం నుంచి అనుమతులు రావడం గమనార్హం.

పౌర, సైనిక అవసరాలు తీరేలా గలాథియా బే సమీపంలోని చింగెన్ వద్ద ఈ ఎయిర్పోర్టు నిర్మించనున్నట్లు తెలుస్తోంది. భౌగోళిక పరిమితుల వల్ల ఇప్పటికే ఉన్న ఐఎన్ఎస్ బాజ్ ఎయిర్స్టేషన్ వద్ద రన్వేను విస్తరించేందుకు దీర్ఘకాలికంగా ఉన్న ప్రణాళికను పక్కనపెట్టాల్సి వచ్చింది. రానున్న ఐదేళ్లలో దీని నిర్మాణం పూర్తికావొచ్చని సమాచారం. నికోబార్ దీవి మలక్కా జలసంధికి అతిసమీపంలో ఉండటంతో జీఎన్ఐ ప్రాజెక్టు వ్యూహాత్మక ప్రాధాన్యం సంతరించుకుందని రక్షణరంగ వర్గాలు వివరించాయి. జలసంధికి సమీపంలోనే యుద్ధ నౌకలు, వైమానిక సదుపాయాలు ఉండటం నిఘాకు ఎంతో కీలకం కానున్నాయి. చైనాకు 80 శాతం చమురు, 70 శాతం సహజవాయువు మలక్కా జలసంధి మీదుగా రవాణా అవుతుందని వెల్లడించాయి. రూ.81వేల కోట్ల గ్రేట్ నికోబార్ ఐలాండ్ డెవలప్మెంట్ ప్రాజెక్ట్ కింద తలపెట్టిన మౌలిక సదుపాయాల్లో ఎయిర్పోర్ట్ ఒకటి. అండమాన్ నికోబార్ ఐలాండ్‌ను ఆర్థిక, వ్యూహాత్మక హబ్‌గా మార్చే లక్ష్యంతో కేంద్రం ఈ ప్రాజెక్ట్‌ను ముందుకుతీసుకువచ్చింది. ఈ ప్రాజెక్టును విపక్షాలు విమర్శిస్తున్నాయి. ఇది దేశ సహజ, గిరిజన వారసత్వ సంపదకు వ్యతిరేకంగా ఉందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపిస్తున్నారు. ఈ ప్రాజెక్టు వల్ల 160 చదరపు కిలోమీటర్ల మేర లక్షల చెట్లను నరికివేయాల్సి వస్తుందని, ఇది అభివృద్ధి అనే ముసుగులో జరుగుతున్న విధ్వంసమని మండిపడ్డారు.

## పాఠశాలల్లో మాంసాహారంపై నిషేధం

**గోల్పారా, జూన్ 9:** అస్సాంలోని గోల్పారా జిల్లా విద్యాశాఖ అధికారులు విద్యార్థులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఇకపై పాఠశాలలకు మాంసాహార పదార్థాలు తీసుకురావద్దని గోల్పారా జిల్లా ప్రభుత్వ పాఠశాల ఇన్స్పెక్టర్ కార్యాలయం విద్యార్థులకు సూచించింది. ఇటీవల కృష్ణాయిలోని స్కూల్లో కొందరు విద్యార్థులు బీఫ్ తిన్నట్లు వచ్చిన ఆరోపణల నేపథ్యంలో ఈ ఆదేశాలు జారీ చేసింది. అయితే ఇందులో నుంచి గుడ్లను మినహాయిస్తున్నట్లు తెలిపింది. మధ్యాహ్న భోజనం లేదా విరామం సమయంలో విద్యార్థులు పాఠశాల ప్రాంగణాన్ని విడిచి వెళ్లడాన్ని కూడా నిషేధించింది.

### పశ్చిమాసియా ఉద్రిక్తతలు

# కువైట్ పాలకులకు మోడీ ఫోన్

(మొదటి పేజీ తరువాయి)

అల్ సబాతో ఫోన్లో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆ దేశంపై ఇరాన్ చేసిన దాడులను ఖండించారు. అక్కడి భారతీయుల క్షేమ సమాచారం గురించి ఆరా తీశారు. ఆ ప్రాంతంలో శాంతి పునరుద్ధరణ కోసం దౌత్య పరిష్కారాలు కనుగొనాలని మోదీ పిలుపునిచ్చారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు పెరగడంపై మోదీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారని.. కువైట్ సార్వభౌమాధికారం, ప్రాదేశిక సమగ్రతపై జరుగుతున్న దాడులను భారత్ తీవ్రంగా ఖండిస్తోందని ప్రధానమంత్రి కార్యాలయం ఎక్స్‌లో పోస్ట్ చేసింది. ఇటీవల కువైట్, బహ్రెయిన్లోని పలు ప్రాంతాలపై ఇరాన్ డ్రోన్ దాడులకు పాల్పడింది. కువైట్ అంతర్జాతీయ విమానాశ్రయంపై టెహ్రాన్ చేసిన దాడిలో ఓ భారతీయుడు ప్రాణాలు కోల్పోగా పదుల సంఖ్యలో ప్రయాణికులు, సిబ్బంది గాయపడ్డారు. మార్చిలోనూ కువైట్‌లోని ఓ విద్యుత్ నీటి శుద్ధి కర్మాగారంపై జరిగిన డ్రోన్ దాడిలో ఓ భారతీయుడు ప్రాణాలు కోల్పోయాడు.

# అక్రమ 'దారుల్లో' అవినీతి భవనాలు

(మొదటి పేజీ తరువాయి)

వసంత విహార్‌లోని ఈఎన్‌సీ నివాసం, కార్యాలయం, నిజామాబాద్ ఆయన బంధువుల ఇళ్లలో ఏకకాలంలో దాడులు నిర్వహించారు. కాగా మోహన్ నాయక్ నివాసంలో ఇప్పటి వరకు రూ.65 లక్షల నగదు, 10 గ్రాముల చొప్పున బరువున్న 15 బంగారు బిస్కెట్లు, బంగారం, వెండి సామాగ్రిని ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వీటితో పాటు హైదరాబాద్, నిజామాబాద్‌లలో ఖాళీ స్థలాలు, ఆస్తులకు సంబంధించిన పత్రాలను ఇప్పటి వరకు ఏసీబీ అధికారులు గుర్తించారు. మొత్తం ఆస్తుల విలువ వందల కోట్ల రూపాయలు ఉంటుందని ఏసీబీ అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రభుత్వం నుంచి వచ్చే కాంట్రాక్టులను తన స్నేహితులు, బంధువులకే ఇచ్చారనే ఆరోపణలపై ఈఎన్‌సీ అక్రమాస్తులపై ఏసీబీ ప్రత్యేక దృష్టి సారించింది. దీంతో మోహన్ నాయక్ ఆదాయానికి మించిన ఆస్తుల ఆరోపణల మేరకు ఆయన నివాసం, కార్యాలయాల్లో ఏసీబీ బృందాలు సోదాలు నిర్వహించాయని ఏసీబీ జాయింట్ డైరెక్టర్ ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు. హైదరాబాద్‌తోపాటు నిజామాబాద్‌లోనూ తనిఖీలు చేపట్టి నగదు, బంగారం, బంగారం బిస్కెట్‌లు సీజ్ చేసినట్లు వెల్లడించారు. ఖరీదైన ఆస్తుల పత్రాలు కూడా గుర్తించామని తెలిపారు. మోహన్ నాయక్ రోడ్ల నిర్మాణాలకు సంబంధించిన టెండర్ల కేటాయింపుల్లో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినట్లు గతం లోనే పలు ఆరోపణలు వచ్చిన విషయం విదితమే. ముఖ్యంగా కాంట్రాక్టర్లకు టెండర్లు కేటాయించే ప్రక్రియలో భారీ ఎత్తున అక్రమాలకు పాల్పడినట్లు వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా ఏసీబీ దాడులు నిర్వహించినట్లు సమాచారం. ఇదిలావుండగా ఈఎన్‌సీ అక్రమాస్తులపై బుధవారం సైతం సోదాలు చేపట్టే అవకాశాలున్నాయని ఏసీబీ వర్గాలు చెబుతున్నాయి.

# రాష్ట్రంలోకి ప్రవేశించిన నైరుతి రుతుపవనాలు

(మొదటి పేజీ తరువాయి)

కదులుతూ కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాలను దాటి తెలంగాణలోకి ప్రవేశించాయి. ప్రస్తుతం వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉండటంతో రానున్న రెండు, మూడు రోజుల్లో తెలంగాణలోని మరిన్ని ప్రాంతాలతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌లోని ఇతర ప్రాంతాలకు ఇవి విస్తరిస్తాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.హైదరాబాద్ వాతావరణ కేంద్రం అంచనాల ప్రకారం, ఈనెల 11-12 తేదీల మధ్య రుతుపవనాలు గ్రేటర్ హైదరాబాద్ ప్రాంతాన్ని తాకే అవకాశం ఉందని,15 నుంచి 18వ తేదీలోగా రాష్ట్రంలోని మధ్య, ఉత్తర తెలంగాణ జిల్లాలకు ఇవి పూర్తిగా విస్తరిస్తాయని వాతవరణ శాఖ అధికారులు భావిస్తున్నారు.మరోవైపు, రుతుపవనాల రాకతో రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ వెల్లడించింది. 8, 9 తేదీల్లో వికారాబాద్, సంగారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో అక్కడక్కడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో గంటకు 40-50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీయడంతో పాటు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడొచ్చని వాతవరణ శాఖ సూచించింది. రుతుపవనాల ఆగమనంతో రైతులు ఖరీఫ్ సాగు పనులకు సిద్ధమవుతున్నారు.

### ఇందిరమ్మ రాజ్యంతోనే..

# మహిళలకు గుర్తింపు

(మొదటి పేజీ తరువాయి)

ప్రాణవాయువు ఆడబిడ్డలని, ఆడబిడ్డ పుడితే మహాలక్ష్మి వచ్చిందని సంతోషపడే సంస్కృతి మనదని కొనియాడారు. మహిళలను స్ఫూర్తిగా తీసుకొని పరిపాలన చేస్తున్నామన్నారు. అమెరికాలో మహిళలకు ఓటు హక్కు వచ్చేందుకు వందల ఏళ్లు పట్టిందని, భారతదేశానికి స్వాతంత్ర్యం రాగానే మహిళలకు ఓటు హక్కు ఇచ్చిన ఘనత నెహ్రూకి దక్కుతుందని తెలిపారు. దేశానికి తొలి మహిళా రాష్ట్రపతిని అందించిన ఘనత కాంగ్రెస్ పార్టీదేని గుర్తు చేశారు. బీజేపీ పార్టీ అధ్యక్ష పదవిని ఒక్కసారైనా మహిళలకు ఇచ్చారా? అని సీఎం ప్రశ్నించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం తొలి ఐదేళ్లలో ఒక్క మహిళకూ మంత్రి పదవి ఇవ్వలేదని, తమ ప్రభుత్వంలో ఇద్దరు మహిళలకు మంత్రి పదవులు ఇచ్చామని చెప్పుకొచ్చారు. స్థానిక ఎన్నికల్లో మహిళలకు రాజీవ్‌గాంధీ రిజర్వేషన్లు ఇచ్చారని, చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లకు 2013లోసోనియాగాంధీ బిల్లు ప్రవేశపెట్టారని గుర్తు చేశారు. రాష్ట్రంలో 2034 వరకు మీ ఆశీర్వాదంతో ఈ ప్రభుత్వాన్ని నడిపిస్తామని, వెయ్యి కాదు 3 వేల ఆర్టీసీ బస్సులు తీసుకొస్తామన్నారు. ఇందిరమ్మ ఇల్లు ఆడబిడ్డల పేరు మీదే ఇచ్చామని, పట్టణ ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇల్లు నిర్మించి మహిళల పేరుమీదే ఇస్తామని హామీ ఇచ్చారు. ఎవరు అడ్డం వచ్చినా ఆర్టీసీ బస్సుతో తొక్కించండని, మహిళలను అభివృద్ధిలో సగం వ్యాపారంలో సగం చేశామని సీఎం అన్నారు. రిలయన్స్‌తో పోటీ పడి పెట్రోల్ బంక్‌లను తెలంగాణ ఆడబిడ్డలు నడిపిస్తున్నారని, అంబానీ, అదానీతో పోటీ పడి ఆడబిడ్డలు విద్యుత్ ఉత్పత్తి చేసున్నారని కొనియాడారు. రాష్ట్రంలో కోటి మంది అడబిడ్డలను కోటీశ్వరులను చేయాలని ఈ ప్రభుత్వం కంకణం కట్టుకుందన్నారు. గత ప్రభుత్వం మహిళలకు ఇవ్వాల్సిన రూ.4వేల కోట్ల సున్నా వడ్డీ నగదును చెల్లించలేదని, మహిళల ఉచిత ప్రయాణం కోసం ఆర్టీసీకి రూ.10,500 కోట్లు చెల్లించామని సీఎం స్పష్టం చేశారు. ఆడబిడ్డలు ఉచితంగా బస్సులో పక్క ఊరు వెళ్లి చదువుకుంటున్నారని, ఫ్రీ బస్సు వల్ల స్కూళ్లల్లో ఆడపిల్లల డ్రాపవుట్లు తగ్గాయని తెలిపారు. అంబానీ, అదానీలకు పోటీగా పెట్రోల్ బంక్లు, సోలార్ విద్యుత్‌ను రాష్ట్ర మహిళలు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. త్వరలోనే జిల్లా మహిళా శక్తి భవనాలు నిర్మిస్తామని, హైటెక్సిటీ పక్కన రూ. వెయ్యి కోట్ల భూమిని మహిళా సంఘాలకు ఇచ్చామని వెల్లడించారు. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలని 2013లోనే సోనియా గాంధీ పార్లమెంట్‌లో బిల్లు పెట్టారని, రాబోయే రోజుల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలలో మహిళలు ప్రధాన పాత్ర పోషించబోతున్నారని తెలిపారు. ఇదే సమయంలో విపక్షాలపై విమర్శలు గుప్పిస్తూ.. గత ప్రభుత్వం మొదటి ఐదేళ్లు ఒక్క మహిళకు కూడా మంత్రిగా అవకాశం కల్పించలేదని, కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ ఏనాడూ తమ పార్టీ అధ్యక్షుడిగా మహిళను నియమించలేదని ఎద్దేవా చేశారు. గత ప్రభుత్వం మహిళా సంఘాలకు ఇవ్వాల్సిన సున్నా వడ్డీ రుణాలను కూడా ఎగ్గొట్టిందని, కానీ తమ ప్రజా ప్రభుత్వం రాగానే ఆ బకాయిలను మంజూరు చేసిందని సీఎం తెలిపారు. తాము ప్రవేశపెట్టిన మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణ పథకంపై కొందరు కడుపు నిండా విషం నింపుకుని, కళ్లల్లో నిప్పులు పోసుకుంటూ రద్దు చేయాలని రోడ్డెక్కారని మండిపడ్డారు. ఎవరు ఎన్ని కుట్రలు చేసినా వెనక్కి తగ్గకుండా ఉచిత బస్సు సౌకర్యాన్ని కొనసాగిస్తున్నామని, దీనివల్ల వేలాది మంది ఆడబిడ్డలు ఉన్నత చదువులు చదువుకోగలుగుతున్నారని చెప్పారు. మహిళా సంఘాల కోసం 553 సరికొత్త బస్సులను ప్రారంభించగానే వరుణదేవుడు కరుణించి వర్షాలు కురిపించాడంటూ సీఎం ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. మహిళలు తయారు చేసిన ఉత్పత్తులను అమెజాన్, ఫ్లిప్‌కార్డ్ వంటి ఈ-కామర్స్ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా ఆన్‌లైన్‌లో విక్రయించేలా గ్లోబల్ మార్కెట్ సౌకర్యం కల్పిస్తున్నట్లు ప్రకటించారు. తెలంగాణ ఆర్థిక ప్రగతి ఆడబిడ్డల చేతిలోనే ఉందని విశ్వసిస్తూ, రాష్ట్రంలోని స్వయం సహాయక సంఘాల సభ్యుల సంఖ్యను కోటి మందికి చేర్చడమే తమ లక్ష్యమని సీఎం పునరుద్ఘాటించారు. ఈ వేదికగా తెలంగాణ ఆడబిడ్డలకు మాట ఇస్తున్నా.. రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేసే పూర్తి బాధ్యత నాది అని రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. భవిష్యత్తులో మహిళా సంఘాలకు వెయ్యి కాదు.. ఏకంగా 3 వేల బస్సులు కొనిచ్చి వారిని యజమానులను చేస్తామన్నారు.

## మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ భవన నిర్మాణానికి హైకోర్టు బ్రేక్

**హైదరాబాద్,జూన్ 9(మనం,ప్రత్యేక ప్రతినిధి) :** మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ నూతన కార్యాలయ భవన నిర్మాణానికి బ్రేక్ పడింది. మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ నూతన కార్యాలయ భవనానికి 2026, జూన్ 7న సీఎం రేవంత్ రెడ్డి భూమిపూజ చేసి శంకుస్థాపన చేసిన విషయం తెలిసిందే. ఈ భవనాన్ని ఉప్పల్ బగాయత్ లేఅవుట్ వద్ద దాదాపు 10 ఎకరాల స్థలంలో రూ.98 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్నారు. మల్కాజిగిరి కార్పొరేషన్ భవన నిర్మాణం కోసం ప్రభుత్వం చేపట్టిన భూ రిజంప్షన్ చర్యలను సవాల్ చేస్తూ తెలంగాణ హైకోర్టులో దాఖలైన ఐదు రిట్ పిటిషన్‌లపై మంగళవారం జస్టిస్ బి. విజయ్‌సేన్ రెడ్డి విచారణ చేపట్టి రార్పొరేషన్ భవన నిర్మాణ పనులను ఆపాలని ఆదేశాలు జారీ చేశారు.

### హెచ్-1బీపై లక్ష డాలర్ల

# ఫీజు కొట్టివేత

(మొదటి పేజీ తరువాయి)

ఉంటున్నారు. ఆ తర్వాత చైనా రెండో స్థానంలో ఉంది. సాధారణంగా వీసాల కోసం అయ్యే ఖర్చును కంపెనీలు భరిస్తాయి. గతంలో ఇందుకోసం 2 వేల నుంచి 5 వేల డాలర్ల వరకూ ఖర్చు కాగా.. గతేడాది సెప్టెంబరులో ఈ వీసా ఫీజును ట్రంప్ సర్కార్ ఏకంగా లక్ష డాలర్లకు పెంచేసింది. విదేశీ ఉద్యోగులపై ఆధారపడకుండా కంపెనీలు అమెరికన్లను నియమించుకోవాలనే ఉద్దేశంతో ఈ ఫీజును పెంచారు. దీంతో భారతీయులపై పెను ప్రభావమే పడింది. ఈ స్థాయిలో ఫీజును భరించలేక చాలా కంపెనీలు హెచ్-1బీ నియామకాలను తగ్గించాయి. ఈ ఫీజును సవాల్ చేస్తూ పలు న్యాయస్థానాల్లో పిటిషన్లు దాఖలయ్యాయి.

ఈ క్రమంలోనే హెచ్-1బీ వీసా ఫీజులపై విచారణ జరిపిన బోస్టన్లోని ఫెడరల్ కోర్టు.. అమెరికా కాంగ్రెస్ ఆమోదం తెలపనందున దానిని చట్టవిరుద్ధ పన్నుగా పరిగణిస్తున్నామని స్పష్టం చేసింది. ఈ ఫీజు చెల్లబోదంటూ కీలక తీర్పు వెలువరించింది. దీంతో అమెరికా కంపెనీలపై తక్షణ ఆర్థికభారం తగ్గినట్లయ్యింది. అయితే, తీర్పు నేపథ్యంలో ఈ ఫీజును పూర్తిగా ఎత్తివేస్తారా? అంటే కాదనే సమాధానమే వినిపిస్తోంది. బోస్టన్ కోర్టు తీర్పును ఉన్నత న్యాయస్థానాల్లో అప్పీల్ చేస్తామని వైట్‌హౌస్ వర్గాలు సూచనప్రాయంగా వెల్లడించాయి. అదే జరిగితే.. మరికొన్ని నెలల పాటు ఈ అంశం న్యాయస్థానాల్లో మగ్గనుంది. గతంలో కింది కోర్టు ఇచ్చిన తీర్పును ట్రంప్ సర్కారు అప్పీల్ చేసి గెలిచిన సందర్భాలూ ఉన్నాయి. దీన్నిబట్టి చూస్తే.. ఫీజు భారం నుంచి కంపెనీలకు పూర్తి మినహాయింపు దక్కనట్టే..!

ఈ తీర్పు వల్ల ఏటా ఇచ్చే హెచ్-1బీ కోటాలో ఎలాంటి మార్పు ఉండదు. వీసా వస్తుందన్న గ్యారెంటీ కూడా లేదు. కాకపోతే.. ప్రస్తుతానికి ఫీజు భారం తగ్గడంతో ఈ అవకాశాన్ని అమెరికా కంపెనీలు సద్వినియోగం చేసుకోవచ్చు. ఇప్పటికే వృత్తి నిపుణుల కొరతతో సతమతమవుతున్న కంపెనీలు.. మళ్లీ విదేశీ ఉద్యోగుల నియామకాలు పెంచుకునే వీలుంది. సాధారణంగా వీరిలో అత్యధిక అవకాశాలు భారతీయులకే దక్కుతాయి కాబట్టి.. మనవాళ్లకు కొంతమేర ఉపశమనం లభించినట్లేనని వృత్తి నిపుణులు భావిస్తున్నారు.

# ఒంటరిగా మిగిలిపోతావు జాగ్రత్త..

(మొదటి పేజీ తరువాయి)

అధికారులు తెలిపారు. ఈ మొత్తం వ్యవహారంపై అమెరికాలోని ఇజ్రాయెల్ రాయబారి యెచియెల్ లీటర్ స్పందించారు. ఇరువురి నేతల మధ్య సంభాషణలు బాగా జరిగాయనీ.. కానీ కొన్ని పత్రికలు దీన్ని తప్పుదోవ పట్టిస్తున్నాయనీ ఆరోపించారు. 'వారి మధ్య దాదాపు 40 ఏళ్ల నాటి స్నేహం ఉంది. కొన్నిసార్లు ప్రేమికుల మధ్య చిన్ని చిన్న గొడవలు జరుగుతాయి. అప్పుడప్పుడు సంభాషణలు ఉద్రిక్తతలుగా మారొచ్చు' అని మీడియాతో అన్నారు. ట్రంప్ అభ్యర్థన మేరకు సైనిక చర్య విషయంలో నెతన్యాహు తగ్గారన్నారు. అయితే దాడులకు ప్రతిస్పందన కచ్చితంగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ విషయం ట్రంప్‌నకు కూడా తెలుసన్నారు.

# కాంగోలో ఎబోలా 101 మంది మృతి

**కాంగో, జూన్ 9:** మధ్య ఆఫ్రికా దేశం కాంగోలో ఎబోలా వైరస్ విజృంభిస్తోంది. ఈ వైరస్ కారణంగా ఇక్కడ ఇప్పటివరకు 100 మందికి పైగా ప్రాణాలు కోల్పోవడం ఆందోళనను రేకెత్తిస్తోంది. ఈ మేరకు కాంగో ఆరోగ్యశాఖ అధికారులు ఓ ప్రకటనను విడుదల చేశారు.

ఆ ప్రకటన ప్రకారం.. కాంగోలో ఇప్పటివరకు 550కి పైగా ఎబోలా కేసులు నిర్ధరణ అయ్యాయి. వారిలో 101 మంది ప్రాణాలు కోల్పోగా.. 19 మంది కోలుకున్నారు. మరో 309 మంది ఎబోలా అనుమానితులు ఐసోలేషన్‌లో ఉన్నారు. ఆదివారం ఒక్కరోజే ఇటురి, నార్త్ కిపులలో 35 కొత్త కేసులు నమోదవగా, మరో 10 మంది మృత్యువాత పడ్డారు. ప్రస్తుతం వైరస్ తీవ్రత పెరుగుతోందని, కొన్నిరోజుల తర్వాత తీవ్రత తగ్గే అవకాశం ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. వ్యాధి నిర్ధరణ.. వైరస్కు సరైన టీకా, చికిత్స లేకపోవడం సవాళ్లుగా మారాయని తెలిపారు. కేసుల సంఖ్య ఇంకా ఎక్కువగానే ఉండొచ్చని భావిస్తున్నారు. ఈనేపథ్యంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ హెచ్చరికలు జారీ చేసింది. ప్రాంతీయంగా ఈ వ్యాధి మరింత వ్యాపించే ప్రమాదం ఉందని పేర్కొంది. ఇక, ఉగాండాలో 19 ఎబోలా కేసులు నిర్ధరణ అయ్యాయి. కాగా.. రెండు మరణాలు చోటుచేసుకున్నాయి.

# రోహింగ్యాల లెక్క చెప్పండి

(మొదటి పేజీ తరువాయి)

వర్గాలకు నివేదిక సమర్పించినట్లు సమాచారం. గత 15 సంవత్సరాలుగా రోహింగ్యాలు దేశం లోని ఇతర నగరాలతో పాటు హైదరాబాద్‌కు పెద్ద సంఖ్యలో ఖ్యాలా వలసవచ్చినట్లు పోలీసులు గుర్తించారు. ప్రధానంగా శివార్లతో పాటు పాతబస్తీలోని బహదూర్పురా, కంచన్‌బాగ్ , చాంద్రాయణగుట్ట పోలీస్టేషన్ల పరిధిలో వీరు నివసిస్తున్నారని పోలీసులు వివరిస్తున్నారు. అయితే రోహింగ్యా శరణార్థుల ముసుగులో అసాంఘిక శక్తులు, ఉగ్రవాదులు సైతం దేశంలోకి చొరబడతారని కేంద్ర నిఘా వర్గాలు పలుమార్లు హెచ్చరికలు చేసిన విషయం విదితమే.

హైదరాబాద్ నగరంలో ఉంటున్న రోహింగ్యాల్లో గుర్తింపు కార్డులు ఉన్న వారు ఎంతమంది ఉన్నారు? ఎలాంటి అనుమతుల లేకుండా ఎంతమంది ఉన్నారన్న విష యాలను నిగ్గు తేల్చేందుకు పోలీసులు సన్నద్ధమౌతున్నారు. రోహింగ్యాల ఆడిటింగ్ యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలనిపోలీసుశాఖ నిర్ణయించినట్లు తెలుస్తోంది. ప్రత్యేక డేటాబేస్ ఏర్పాటురోహింగ్యాలను లెక్కింపు తక్షణం చేపట్టాలని నిర్ణయిం చడంతో పాటు ఆ బాధ్యతలను ఎస్బీ అధికారులకు అప్పగించినట్లు తెలియవచ్చింది. ఈక్రమంలో ఎస్‌బీ స్పెషల్ టీమ్స్ ప్రతి ఒక్క రోహింగ్యాకు సంబంధించిన వివరాలు సేకరించనున్నారు. రాష్ట్రంలో రోహింగ్యాల లెక్కతేల్చేందుకు స్థానిక పోలీసుల సహకారంతో ఎస్‌బీ పోలీసులు మూడు కమిషనరేట్ పరిధిలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించనున్నారు. రోహింగ్యాల పేర్లు, శాశ్వత, తాత్కాలిక చిరునామాలు, ఫొటో లతో పాటు బయోమెట్రిక్ వివరాలు సేకరించనున్నట్లు సమాచారం.

అక్రమంగా చొరబడిన రోహింగ్యాల వివరాలన్నింటినీ క్రోడీకరిస్తూ స్పెషల్ బ్రాంచ్‌లో ప్రత్యేక డేటాబేస్ ఏర్పాటు చేయనున్నట్లు పోలీసులు చెబుతున్నారు.ఆధార్, రేషన్ కార్డులుహైదరాబాద్ నగరంలోకి అక్రమంగా చొరబడుతున్న రోహింగ్యాలకు సహకరిస్తున్న ఏజెంట్లపైనా ఎస్బీ అధికారులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయనున్నారు. హైదరాబాద్ నగరంలో దాదాపు 6040 మంది రోహింగ్యాల వద్ద ఆధార్ కార్డు, ఓటర్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్‌లు ఉన్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. గతంలో పోలీసులు నిర్వహించిన తనిఖీల లో రోహింగ్యాల వద్ద ఇండియన్ పాస్ పోర్టులు, రేషన్ కార్డులు, బ్యాంకు అకౌంట్లు లభ్యమైన విషయం విదితమే. ఇది లావుండగా కొందరు రోహింగ్యాలు ఇళ్లకు, వాహనాలకు సంబంధించి బ్యాంకు రుణాలు సైతం తీసుకున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. అలాగే రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు కూడా పొందుతున్నట్లు పోలీసులు నిర్ధారిం చార్నది సమాచారం. ఈమేరకు రోహి రోహింగ్యాల లెక్కలు తేల్చి వారి కదలికలపై నిఘా సారించేందుకు పోలీసులు సమాయత్తమౌతున్నారు.

హైదరాబాద్ పరిసర ప్రాంతాలలో తలదాచుకున్న రోహింగ్యాలు అదును చూసి పంజా విసురుతారని కేంద్ర నిఘా వర్గాలు పదేపదే హెచ్చరికలు జారీ చేయడంతో రాష్ట్ర పోలీ సులు వీరి కదలికలపై నిఘా సారిస్తున్నారు. ముఖ్యంగా మయన్మార్, బంగ్లదేశ్ నుంచి వలస వస్తున్న రోహింగ్యా లతో దేశ భద్రతకు ముప్పు ఉందని కేంద్ర నిఘా వర్గాల హెచ్చరికల నేపథ్యంలో రాచకొండ, హైదరాబాద్, సైబరాబాద్ పరిధిలో నివాముంటున్న రోహింగ్యాల లెక్క మరోసారి తేల్చేందుకు నగర నగర పోలీసుల సిద్ధమయ్యారు. ఈక్రమంలో రాష్ట్ర పోలీసు ఉన్నతాధికారులు నగరంలో నివసిస్తున్న రోహింగ్యాలు ఎంతమందో లెక్కించాలని మూడు కమిష నరేట్ల పోలీసులకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో స్పెషల్ బ్రాంచ్ అధికారులు ఈ ప్రక్రియ ప్రారంభించి అనతికాలంలో నివేదిక ఇవ్వాలని కోరినట్లు పోలీసులు చెబుతున్నారు. కాగా అయితే నగరంలో నివసిస్తున్న రోహింగ్యాల్లో కొందరు అనుమతి పొందిన శరణార్థులూ ఉన్నారని, వీరికి ఐక్య రాజ్య సమితి గుర్తింపు కార్డులు జారీ చేయడంతో పూర్తి వివరాలు అందుబాటులో ఉన్నట్లు పోలీసుల విచారణలో తేలింది. ఏలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా నివసిస్తున్న వారితోనే ముప్పు ఉంటుందని పోలీసులు అనుమానిస్తున్నారు.

# రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోలు

**హైదరాబాద్, జూన్ 9(మనం న్యూస్) :** తెలంగాణ రాష్ట్రంలో రికార్డు స్థాయిలో ధాన్యం ఉత్పత్తి జరుగుతుండగా, కేంద్ర ప్రభుత్వం మాత్రం రాష్ట్రానికి కేటాయించే ధాన్యం సేకరణ లక్ష్యాలను క్రమంగా తగ్గిస్తూ రైతులకు అన్యాయం చేస్తోందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి మండిపడ్డారు.మంగళవారం సచివాలయంలో సహచర మంత్రులు వాకిటి శ్రీహరి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, లోక్‌సభ సభ్యులు రఘువీరారెడ్డి, ఎమ్మెల్సీ శంకర్ నాయక్, ఎమ్మెల్యే లక్ష్మీకాంతరావు, కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్ రెడ్డిలతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ విజయవంతంగా సాగుతుంటే బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు ఉద్దేశపూర్వకంగా రైతుల్లో గందరగోళం సృష్టించే ప్రయత్నం చేస్తున్నాయని ఆయన ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాల్సిన బీజేపీ నాయకులు కొనుగోలు కేంద్రాల యాత్రల పేరుతో రాష్ట్ర ప్రభుత్వాన్ని విమర్శించడం హాస్యాస్పదమని ఎద్దేవా చేశారు.

తెలంగాణలో ధాన్యం ఉత్పత్తి గణనీయంగా పెరుగుతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి కేటాయించిన ధాన్యం సేకరణ లక్ష్యాన్ని పెంచాలని ముఖ్యమంత్రి తాను పలుమార్లు కేంద్ర ప్రభుత్వాన్ని, కేంద్ర ఆహార శాఖను, భారత ఆహార సంస్థ అధికారులను కోరిన,రాష్ట్ర రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ధాన్యం సేకరణ లక్ష్యాన్ని పెంచాలని పదేపదే విజ్ఞప్తి చేసినప్పటికీ కేంద్ర ప్రభుత్వం పట్టించుకోలేదని ఆయన మండిపడ్డారు.

కేంద్రం నిర్లక్ష్యం కారణంగా రైతులు నష్టపోకూడదనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం సాహసోపేత నిర్ణయం తీసుకుని కేంద్రం నిర్దేశించిన లక్ష్యాలకు మించి భారీ స్థాయిలో ధాన్యం కొనుగోలు చేసిందని తెలిపారు.కేంద్ర ప్రభుత్వం కేవలం 52 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్య సేకరణ లక్ష్యాన్ని మాత్రమే నిర్దేశించినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం రైతులను ఆదుకునేందుకు ఇప్పటివరకు 75 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి చరిత్ర సృష్టించిందన్నారు.పొరుగు రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ 25.03 లక్షల టన్నులు కొనుగోలు చేస్తే తెలంగాణ 75 లక్షల టన్నులు కొనుగోలు చేసి దాదాపు మూడు రెట్లు అధికంగా సేకరించిందన్నారు.రబీ ధాన్యం కొనుగోళ్లలో దేశంలో నంబర్-1 రాష్ట్రంగా తెలంగాణ నిలవడం రైతుల కృషి, ప్రభుత్వ సమర్థ ప్రణాళికల ఫలితమని మంత్రి పేర్కొన్నారు.

తెలంగాణ ప్రభుత్వం 147 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి రాష్ట్ర చరిత్రలోనే కాకుండా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ చరిత్రలోనూ అత్యున్నత రికార్డు నమోదు చేసిందన్నారు.ఇప్పటి వరకు 295 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్య ఉత్పత్తిలో 147 లక్షల మెట్రిక్ టన్నులను కొనుగోలు చేసి రైతులకు రూ.35,077 కోట్ల కనీస మద్దతు ధర చెల్లించామని తెలిపారు. 25.20 లక్షల రైతు లావాదేవీలు విజయవంతంగా పూర్తయ్యాయని వివరించారు. తెలంగాణలో రబీ ధాన్యం ఉత్పత్తి 28 శాతం పెరిగినప్పటికీ కేంద్ర ప్రభుత్వం కొనుగోలు లక్ష్యాన్ని 79 లక్షల టన్నుల నుంచి 52 లక్షల టన్నులకు తగ్గించిందని మంత్రి విమర్శించారు.

ఈ నిర్ణయం వల్ల రైతులు నష్టపోకుండా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వం గత రెండు సంవత్సరాల్లో అదనంగా 57 లక్షల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి రూ.16,645 కోట్ల మద్దతు ధర చెల్లించిందన్నారు.కొనుగోళ్ల కోసం మొత్తం 20.86 కోట్ల గన్నీ సంచులను సిద్ధం చేశామని, వాటిలో 18.75 కోట్ల సంచులను వినియోగించినప్పటికీ ప్రస్తుతం 2.11 కోట్ల సంచులు నిల్వలో ఉన్నాయని తెలిపారు. రాష్ట్రంలో గన్నీ సంచుల కొరత లేదని మంత్రి స్పష్టం చేశారు.

# భావితరాలకు అనుగుణంగానే అడుగులు

(మొదటి పేజీ తరువాయి)

కోసం ఎదురు చూడకుండా, దాన్ని నిర్మించేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామన్నారు. ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్(ఎఫ్ టీసీసీఐ) ఆధ్వర్యంలో మంగళవారం జూబ్లీహిల్స్ లోని జేఆర్సీ కన్వెన్షన్ సెంటర్ లో నిర్వహించిన 'ఎఫ్‌టీసీసీఐ ఎక్స్ లెన్స్ అవార్డ్స్ 2026' ప్రదానోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... ఐటీ, లైఫ్ సైన్సెస్ నుంచి మ్యానుఫ్యాక్చరింగ్, డీప్-టెక్ వరకు తెలంగాణను దేశంలోనే అత్యంత ఆకర్షణీయమైన వృద్ధి కేంద్రంగా తీర్చిదిద్దేందుకు తీసుకుంటున్న చర్యలను వివరించారు. పరిశ్రమ 4.0 విప్లవంలో భాగంగా దూసుకొస్తున్న ఆటోమేషన్, డీప్-టెక్ సవాళ్లను ఎదుర్కొనేలా రాష్ట్రంలో కాంప్రహెన్సివ్ ఎకోసిస్టమ్‌ను అభివృద్ధి చేస్తున్నామన్నారు. అదే సమయంలో... భవిష్యత్తు తరాలకు మేలు జరిగేలా స్థిరమైన, పర్యావరణహిత పారిశ్రామిక వృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామని తెలిపారు. రాబోయే రోజుల్లో పారిశ్రామికాభివృద్ధి అనేది కేవలం భూమి, మూలధనంపైనే కాకుండా... మేధో సంపత్తి, నాలెడ్జ్ ఎకానమీ ఆధారంగానే సాధ్యమవుతుందని మంత్రి పేర్కోన్నారు. అందుకు... పరిశ్రమల అవసరాలకు, విద్యాసంస్థల శిక్షణకు మధ్య ఉన్న స్కిల్ గ్యాప్ ను పూడ్చాల్సిన అవసరముందన్నారు. ఆ దిశగానే రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణను స్కిల్ క్యాపిటల్ గా మార్చాలనే సంకల్పంతో 'యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ'కి శ్రీకారం చుట్టిందని వెల్లడించారు.

రాష్ట్రానికి కొత్త పెట్టుబడులను తీసుకొచ్చి... ఇక్కడి యువతకు ఉపాధి అవకాశాలను కల్పించాలనే లక్ష్యంతోనే





ముందుకెళ్తున్నామని,పారిశ్రామికాభివృద్ధిని కేవలం హైదరాబాద్ కే పరిమితం చేయకుండా... రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు విస్తరిస్తున్నామన్నారు. రాష్ట్రంలోని ఎంఎస్ఎంఈలను మరింత ప్రోత్సహించేందుకు దేశంలోనే తొలిసారిగాప్రత్యేక 'ఎంఎస్ఎంఈ పాలసీ'ని తీసుకొచ్చామని,పారిశ్రామికవేత్తలకు 2017 నుంచి చెల్లించాల్సిన పెండింగ్ సబ్సిడీలను దశలవారీగా చెల్లిస్తున్నామన్నారు. అన్ని వర్గాల అభిప్రాయాలను పరిగణలోనికి తీసుకునే కనీస వేతనాలను నిర్ణయించి,పారిశ్రామికవేత్తలను మేం కేవలం పెట్టుబడిదారులుగా మాత్రమేచూడటం లేదని... రాష్ట్ర ప్రగతిలో కీలక భాగస్వాములుగా భావిస్తున్నామని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధికి పారిశ్రామికవేత్తలిచ్చే సలహాలు, సూచనలనుస్వీకరించేందుకు సిద్ధంగా ఉన్నామని, సరికొత్త ఆవిష్కరణలతో ముందుకొచ్చే పారిశ్రామికవేత్తలు, ఆవిష్కర్తలకు అన్ని రకాలుగా అండగా ఉంటామని శ్రీధర్ బాబు భరోసానిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ టీసీసీఐ ప్రతినిధులు రవి కుమార్, కేకే మహేశ్వరీ, శ్రీనివాస్ గరిమెల్లా, భాస్కర్ రెడ్డి, అనిల్ అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.

### నాడు 'ఓట్ చోరీ'..

# నేడు 'సీటు చోరీ'

(మొదటి పేజీ తరువాయి)

మండిపడ్డారు. ఢిల్లీలోని ఈసీ కార్యాలయం వద్ద కాంగ్రెస్ నేతలను అడ్డుకోవడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ తన నైజాన్ని మరోసారి బయటపెట్టుకుందని విమర్శించారు. గతంలో ఓట్ చోరీ, ఎస్ఐఆర్ అవకతవకలకు పాల్పడిన బీజేపీ.. ఇప్పుడు ఏకంగా 'సీట్ చోరీ'కి తెరలేపిందని సెటైర్లు వేశారు. ప్రజాస్వామ్యబద్ధంగా గెలవలేక, ఇలాంటి దొడ్డిదారి కుట్రలతో ప్రతిపక్షాల సీట్లను దక్కించుకోవాలని చూస్తోందని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు.

తెలంగాణలో కేసులు లేవు..:

తెలంగాణలో ఉన్న పెండింగ్ కేసును అఫిడవిట్‌లో దాచారంటూ బీజేపీ చేసిన ఆరోపణలను సీఎం రేవంత్ రెడ్డి పూర్తిగా తోసిపుచ్చారు. తెలంగాణలో మీనాక్షి నటరాజన్‌పై ఎలాంటి క్రిమినల్ కేసులు లేవని ఆయన స్పష్టం చేశారు. కేవలం సాంకేతిక కారణాలను సాకుగా చూపి, కావాలనే ఆమె నామినేషన్‌ను రిజెక్ట్ చేయించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం కార్యాలయానికి కాంగ్రెస్ ముఖ్యనేతలు ఫిర్యాదు చేయడానికి వెళ్తే, లోపలికి రానివ్వకుండా గేట్లకు తాళాలు వేసి అడ్డుకోవడంపై సీఎం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రధాన ప్రతిపక్ష నేతలను ఈసీని కలవకుండా అడ్డుకోవడం దారుణమని, ఇది ప్రజల గొంతును నొక్కేయడమేనని అన్నారు. భారత ప్రజాస్వామ్యానికి ఇది అత్యంత చీకటి రోజు అంటూ రేవంత్ రెడ్డి తీవ్ర స్థాయిలో ఆరోపణలు చేశారు. మీనాక్షి నటరాజన్‌కు జరిగిన అన్యాయంపై తాము కోర్టుకు వెళ్తామని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

# మైనారిటీ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు

## ఉపాధి, నైపుణ్యాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది : మైనారిటీల సంక్షేమ శాఖ మంత్రి మహ్మద్ అజారుద్దీన్




హైదరాబాద్,జూన్ 09(మనం న్యూస్): తెలంగాణ ప్రభుత్వ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మైనారిటీల సంక్షేమ శాఖ,తెలంగాణ మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్ నాంపల్లిలోని రెడ్ రోజ్ ప్యాలెస్‌లో మంగళవారం మెగా జాబ్ మేళా ఘనంగా ప్రారంభమైంది.ఈ మెగా జాబ్ మేళాను హైదరాబాద్ ఇన్చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్, మైనారిటీల సంక్షేమ శాఖ మంత్రి మహ్మద్ అజారుద్దీన్ ప్రారంభించారు.

ఈ సందర్భంగా మంత్రి మహ్మద్ అజారుద్దీన్ మాట్లాడుతూ, మెగా జాబ్ మేళా విజయవంతంగా నిర్వహించేందుకు కృషి చేసిన టీజీఎంఎఫ్సీ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్‌తో పాటు అన్ని విభాగాల అధికారులకు, భాగస్వామ్య సంస్థలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గత పదేళ్లలో అమలుకాని అనేక కార్యక్రమాలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో గత రెండేళ్లలో వేగంగా అమలవుతున్నాయని మంత్రి పేర్కొన్నారు. మైనారిటీ వర్గాల అభ్యున్నతి, సాధికారత కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం దాదాపు లక్ష ఉద్యోగ అవకాశాల కల్పన దిశగా కృషి చేస్తోందని, మైనారిటీల సంక్షేమ శాఖ,మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ సమన్వయంతో మైనారిటీ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

**మైనారిటీ యువత ఉపాధికి ప్రభుత్వ కట్టుబాటు:**

ముస్లింలు, క్రైస్తవులు, సిక్కులు, బౌద్ధులు, జైనులు తదితర అన్ని మైనారిటీ వర్గాల యువతకు సమాన అవకాశాలు కల్పించడం ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు.జాబ్ మేళా ఉద్దేశ్యం కేవలం ఆఫర్ లెటర్లు అందించడం మాత్రమే కాదని, ప్రతి అభ్యర్థి ఉద్యోగంలో చేరే వరకు పూర్తి స్థాయిలో పర్యవేక్షణ కొనసాగుతుందని,యువతకు ఉపాధి కల్పించడం మా బాధ్యత, మా వాగ్దానం అని మంత్రి పేర్కొన్నారు.భవిష్యత్తులో నిజామాబాద్‌తో పాటు తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఇలాంటి మెగా జాబ్ మేళాలను నిర్వహించి మరింత మంది యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని మంత్రి స్పష్టం చేశారు.

**నైపుణ్యాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి:**

యువత విద్యపై దృష్టి పెట్టడంతో పాటు నైపుణ్యాలను పెంపొందించుకోవాలని మంత్రి సూచించారు. తెలంగాణ మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా నిర్వహిస్తున్న వివిధ స్కిల్ డెవలప్మెంట్ శిక్షణా కార్యక్రమాల్లో యువత పాల్గొనాలని పిలుపునిచ్చారు. టీజీఎంఎఫ్సీ ద్వారా అనేక నైపుణ్యాభివృద్ధి శిక్షణా కార్యక్రమాలు నిర్వహించబడుతున్నాయని, యువత ఈ అవకాశాలను వినియోగించుకుని తమ ప్రతిభను పెంపొందించుకొని మంచి ఉద్యోగాలను సాధించాలని మంత్రి అన్నారు. మైనారిటీల సంక్షేమ శాఖ,తెలంగాణ మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా మైనారిటీ యువతకు ఉపాధి, నైపుణ్యాభివృద్ధి, స్వయం ఉపాధి అవకాశాల కల్పనకు తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, ప్రభుత్వ సలహాదారు మహ్మద్ అలీ షబ్బీర్, తెలంగాణ మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, మైనారిటీ గురుకులాల వైస్ చైర్మన్ ఫహీముద్దీన్ ఖురేషీ, మైనారిటీల సంక్షేమ శాఖ కార్యదర్శి బి. షఫీఉల్లా, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహిర్ బిన్ హందాన్ తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

# మొహర్రం ఊరేగింపునకు విస్తృత ఏర్పాట్లు

- రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్



హైదరాబాద్, జూన్ 09(మనం న్యూస్): ఈనెల 16న జరగనున్న మొహర్రం ఉరేగింపు కార్యక్రమాలకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తుందని రాష్ట్ర రవాణా, బి.సి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. మొహర్రం పవిత్ర మాసం ఏర్పాట్లపై మంగళవారం రాష్ట్ర సచివాలయంలో మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి మహమ్మద్ అజారుద్దీన్, ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీ తో కలిసి వివిధ శాఖల అధికారులు, ముస్లిం మత పెద్దలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. మొహర్రం కార్యక్రమాలు నిర్వహించే ఆశుర్ ఖానాల వద్ద పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేయాలని,ఆశుర్ ఖానాల పరిసర ప్రాంతాలలో పెండింగ్ లో ఉన్న డ్రైనేజ్, రోడ్ల మరమ్మత్తు పనులను వెంటనే పూర్తి చేయాలని, అన్ని చోట్ల హైమాస్ట్ లైట్లను ఏర్పాట్లు చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. మొహర్రం ఊరేగింపు సందర్భంగా ట్రాఫిక్ కు అంతరాయం కలగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని పోలీస్ ఉన్నతాధికారులను ఆదేశించారు. ప్రధాన ఊరేగింపు ప్రారంభం కానున్న బీబీ-కా-ఆలం పరిసరాల ప్రాంతంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని మంత్రి అధికారులను అదేశించారు.ఆశుర్ ఖానాలకు వచ్చే వారికి ఇబ్బందులు కలగకుండా అన్ని మౌలిక వసతులు కల్పించాలని ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీ సూచించారు. వైద్య శిబిరాలు, అంబులెన్స్ లను కూడా అందుబాటులో ఉంచాలని అన్నారు. ఈ సమావేశంలో రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, మైనారిటీ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ ఇనిస్టిట్యూషన్ సొసైటీ వైస్ ఛైర్మన్ ఫహీం కురేషి, చార్మినార్, బహదూర్‌పురా, యాకత్ పురా, నాంపల్లి, కార్వాన్, మల్కాజిగిరి ఎమ్మెల్యేలు, మీర్ జుల్ఫెకర్ అలీ, మహమ్మద్ ముబీన్, జాఫర్ హుస్సేన్, మాజిద్ హుస్సేన్, కౌసర్ మొహియుద్దీన్, మర్రి రాజశేఖర్ రెడ్డి, ఎమ్మెల్సీలు మీర్జా రియాజ్ ఉల్ హసన్ ఎఫెండి, మీర్జా రహ్మత్ బేగ్, వక్ఫ్ బోర్డు చైర్మన్, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబైదుల్లా కొత్వాల్, హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ ఎండీ అశోక్ రెడ్డి, మైనారిటీ సంక్షేమ శాఖ కార్యదర్శి షఫీఉల్లా, వక్ఫ్ బోర్డు అధికారులు పాల్గొన్నారు.

# వేతన జీవులకు ఐటీఆర్ దాఖలుకుజులై 31 చివరి తేదీ

## కొత్త, పాత పన్ను విధానాల్లో నచ్చినదాన్ని ఎంచుకునే వెసులుబాటు




హైదరాబాద్, మనం ప్రతినిధి : 2025-26 ఆర్థిక సంవత్సరానికి (2026-27 అసెస్మెంట్ ఇయర్) సంబంధించిన ఆదాయ పన్ను రిటర్నుల (ఐటీఆర్) ఫైలింగ్ ప్రక్రియ వేగవంతమైంది. 2025 ఏప్రిల్ 1 నుంచి 2026 మార్చి 31 మధ్య ఆర్జించిన ఆదాయానికి పన్ను చెల్లింపుదారులు రిటర్నులు దాఖలు చేయాల్సి ఉంటుంది. గడువులోగా ఈ ప్రక్రియను పూర్తి చేయడం ద్వారా జరిమానాలను నివారించడంతో పాటు, రిఫండ్లను సకాలంలో పొందవచ్చు. ఇందుకు అవసరమైన పత్రాలను సిద్ధం చేసుకోవాలని, కొత్త నిబంధనలను అర్థం చేసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. గడువు తేదీలోగా రిటర్నులు దాఖలు చేయలేకపోయిన వారు, 2026 డిసెంబర్ 31లోపు ఆలస్య రుసుముతో 'బిలేటెడ్ రిటర్న్' ఫైల్ చేయవచ్చు. అయితే, ఇలా చేయడం వల్ల కొన్ని పన్ను ప్రయోజనాలను కోల్పోయే ప్రమాదం ఉంది.

**కొత్త, పాత పన్ను విధానాలు.. ఏది మేలు?..**

ఈసారి కూడా కొత్త పన్ను విధానమే డీఫాల్టా కొనసాగుతోంది. ఇందులో తక్కువ శ్లాబ్ రేట్లు, వేతన జీవులకు రూ. 75,000 వరకు స్టాండర్డ్ డిడక్షన్ వంటి ప్రయోజనాలు ఉన్నాయి. కొన్ని షరతులకు లోబడి రూ. 12 లక్షల వరకు ఆదాయంపై పన్ను మినహాయింపు పొందే అవకాశం ఉంది. మరోవైపు, పాత పన్ను విధానంలో సెక్షన్ 80ఇ, గృహ రుణంపై వడ్డీ, ఆరోగ్య బీమా ప్రీమియం వంటి సంప్రదాయ మినహాయింపులు క్లెయిమ్ చేసుకోవచ్చు. రిటర్నులు దాఖలు చేసే సమయంలో, తమ ఆదాయం, పెట్టుబడుల ఆధారంగా రెండు విధానాల్లోనూ పన్ను లెక్కించుకుని, ఏది ఎక్కువ ప్రయోజనకరమో దానినే ఎంచుకోవడం ఉత్తమం అని ఐటి నిపుణులు చెప్తున్నారు.

**అవసరమైన పత్రాలు.. ముఖ్యమైన జాగ్రత్తలు..**

ఐటీఆర్ ఫైల్ చేసే ముందు కొన్ని ముఖ్యమైన పత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలి. యజమాని జారీ చేసే ఫారం 16 (సాధారణంగా జూన్ 15 నాటికి అందుబాటులోకి వస్తుంది), ఫారం 26అఖ, వార్షిక సమాచార నివేదిక, జీతం స్లిప్పులు, బ్యాంకు వడ్డీ సర్టిఫికెట్లు, క్యాపిటల్ గెయిన్స్ స్టేట్‌మెంట్లు, గృహ రుణం, పెట్టుబడుల రుజువులు వంటివి ఇందులో ముఖ్యమైనవి. ఫైల్ చేసే ముందు అఇఖ, ఫారం 26అఖ లలోని ఆదాయ, టీడీఎస్ వివరాలను సరిచూసుకోవడం తప్పనిసరి. ఏవైనా వ్యత్యాసాలు ఉంటే ఆదాయ పన్ను శాఖ నుంచి నోటీసులు వచ్చే అవకాశం ఉంటుంది.

**ఐటీఆర్ ఫారాలు.. కొత్త మార్పులు**

ఐటీఆర్-1 (సహజ్): రూ. 50 లక్షల లోపు జీతం, ఒకటి లేదా రెండు గృహాల ద్వారా ఆదాయం, వడ్డీ ఆదాయం, పరిమిత దీర్ఘకాలిక మూలధన లాభాలు (సెక్షన్ 112అ కింద రూ. 1.25 లక్షల వరకు) ఉన్న నివాస భారతీయులకు ఇది సరిపోతుంది. ఐటీఆర్-2: క్యాపిటల్ గెయిన్స్, ఒకటి కంటే ఎక్కువ ఆస్తులు, విదేశీ ఆస్తులు, వ్యాపారం లేదా వృత్తి ద్వారా ఆదాయం లేని వ్యక్తులు/హిందూ అవిభక్త కుటుంబాలు ఈ ఫారం ఉపయోగించాలి. ఐటీఆర్-3, ఐటీఆర్-4: వ్యాపారం లేదా వృత్తి ద్వారా ఆదాయం ఉన్నవారి కోసం ఈ ఫారాలు రూపొందించారు. ఇటీవలి కాలంలో ఐటీఆర్ ఫారాల్లో క్యాపిటల్ గెయిన్స్ రిపోర్టింగ్ కోసం అదనపు షెడ్యూళ్లను చేర్చారు. అలాగే క్రిప్టో, ఇతర వర్చువల్ డిజిటల్ అసెట్స్ ద్వారా వచ్చిన లాభాలను కచ్చితంగా ప్రకటించాల్సి ఉంటుంది.

**టీడీఎస్, రిఫండ్లు..**

జీతం, వడ్డీ లేదా ఇతర చెల్లింపులపై మినహాయించిన మూలం వద్ద పన్ను కోత (టీడీఎస్)ను ఐటీఆర్ ఫైలింగ్ ద్వారా క్లెయిమ్ చేసుకోవచ్చు. చెల్లించాల్సిన పన్ను కంటే టీడీఎస్ ఎక్కువగా ఉంటే, ఆ అదనపు మొత్తాన్ని ఆదాయ పన్ను శాఖ రిఫండ్‌గ చెల్లిస్తుంది. కచ్చితమైన వివరాలతో రిటర్నులు దాఖలు చేసి, ఇ-వెరిఫై చేస్తే రిఫండ్ ప్రక్రియ వేగంగా పూర్తవుతుంది. కేవలం పన్ను చెల్లింపులకే కాకుండా, రుణాలు, వీసాల వంటి ఆర్థిక అవసరాలకు కూడా ఐటీఆర్ ఫైలింగ్ రుజువుగా పనిచేస్తుంది. సంక్లిష్టమైన లావాదేవీలు ఉన్నవారు నిపుణుల సలహా తీసుకోవాలని సూచిస్తున్నారు.

# నైపుణ్యాల పెంపుకు మెడికవర్ హాస్పిటల్స్-డాక్టిన్ అకాడమీ భాగస్వామ్యం




హైదరాబాద్,జూన్ 09 (మనం న్యూస్): ఆరోగ్య సంరక్షణ రంగంలో నైపుణ్యం కలిగిన మానవ వనరుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ, మెడికవర్ హాస్పిటల్స్,డాక్టిన్ అకాడమీ మధ్య కీలకమైన అవగాహన ఒప్పందం కుదిరింది. ఆరోగ్య విద్య, క్లినికల్ నైపుణ్యాల అభివృద్ధి, వృత్తిపరమైన శిక్షణ మరియు అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణమైన ఆరోగ్య సేవలను మరింత బలోపేతం చేయడమే ఈ భాగస్వామ్య ప్రధాన ఉద్దేశ్యం.ఈ ఒప్పందం ద్వారా ప్రాక్టీసింగ్ నర్సులు, అనుబంధ ఆరోగ్య నిపుణులు, టెక్నీషియన్లు,వైద్య సిబ్బందికి ప్రత్యేక అకడమిక్ కార్యక్రమాలు, నిర్వహించనున్నారు.ఆరోగ్య రంగంలో రోజురోజుకూ చోటుచేసుకుంటున్న సాంకేతిక పురోగతి, ఆధునిక వైద్య విధానాలు,కొత్త ఆరోగ్య సవాళ్ల నేపథ్యంలో వైద్య నిపుణులు తమ జ్ఞానం, నైపుణ్యాలను నిరంతరం నవీకరించుకోవాల్సిన అవసరం ఉందని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ అవసరాన్ని దృష్టిలో ఉంచుకుని అనుభవజ్ఞులైన వైద్య నిపుణులు, రంగ నిపుణుల ఆధ్వర్యంలో అత్యున్నత ప్రమాణాలతో కూడిన శిక్షణా కార్యక్రమాలను అందించనున్నట్లు వారు తెలిపారు.

**వృత్తిపరమైన ఎదుగుదల:**

ఈ భాగస్వామ్యం ద్వారా లైసెన్స్ పొందిన నర్సులు,అనుబంధ ఆరోగ్య నిపుణుల వృత్తిపరమైన ఎదుగుదల, క్లినికల్ సామర్థ్యాల పెంపుపైప్రత్యేక దృష్టి సారించనున్నారు. దీని ఫలితంగా వారు ఉన్నత స్థాయి బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించడంతో పాటు దేశీయ, అంతర్జాతీయ ఆరోగ్య రంగాల్లో మెరుగైన ఉపాధి అవకాశాలను పొందగలరని పేర్కొన్నారు.అత్యవసర వైద్యం , క్రిటికల్ కేర్, నర్సింగ్ ఎక్సలెన్స్, పేషెంట్ సేఫ్టీ, హెల్త్‌కేర్ క్వాలిటీ, నాయకత్వ నైపుణ్యాలు, ఆరోగ్య సాంకేతికత,ప్రత్యేక వైద్య సేవలకు సంబంధించిన పలు అధునాతన శిక్షణా కార్యక్రమాలు ఈ ఒప్పందం కింద నిర్వహించబడనున్నాయి. ఈ కార్యక్రమాలు ఆరోగ్య సంరక్షణ సిబ్బందిలోజీవితాంత విద్య సంస్కృతిని పెంపొందించడంతో పాటు వారి వృత్తిపరమైన సామర్థ్యాలను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లనున్నాయి. ఈ అవగాహన ఒప్పంద కార్యక్రమంలో మెడికవర్ హాస్పిటల్స్ రీజినల్ మెడికల్ హెడ్ డా. శ్రీవాస్తవ, మెడికల్ సూపరింటెండెంట్ డా. కిషోర్, డాక్టిన్ అకాడమీ ప్రతినిధి శ్రీ హర్ష్, రీజినల్ హెడ్ - ఎమర్జెన్సీ మెడిసిన్ డా. నయన్,సెంటర్ హెడ్ డా. స్వరూప్‌లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

# 'నాకు ఆ రైతు భరోసా వద్దు?'

## అది పేదలసొమ్ము.. వారికే దక్కాలి?

- రైతు భరోసాపై జస్టిస్ బి. సుదర్శన్ రెడ్డి

హైదరాబాద్, మనం ప్రతినిధి : సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ బి. సుదర్శన్ రెడ్డి.. రైతులు, వ్యవసాయం, కౌలు రైతులను ఉద్దేశించి.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాల గురించి కీలక వ్యాఖ్యలు చేశారు. తనకు రైతు భరోసా డబ్బులు జమ చేయవద్దంటూ.. అధికారుల చుట్టూ 2 నెలల పాటు తిరిగినట్లు చెప్పారు. తనకు పెన్షన్ వస్తుందని, ఇన్కం ట్యాక్స్ కూడా కడతానని.. అలాంటి తనకు రైతు భరోసా డబ్బులు ఎందుకు అంటూ ప్రశ్నించారు. రాష్ట్రంలో కౌలు రైతుల పరిస్థితి దారుణంగా ఉందని.. వారి పట్ల ప్రభుత్వం దయచూపాలని జస్టిస్ బీ సుదర్శన్ రెడ్డి సూచించారు. పంట పండించే రైతుకు మాత్రమే.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే పథకాలు, ఫలాలు అందాలని హితవు పలికారు. భూమి ఉన్న ప్రతీ వ్యక్తికి కాకుండా.. పేద, కౌలు రైతుల సమస్యలపై దృష్టి పెట్టాలని సూచించారు. ఈ క్రమంలోనే నిజంగా భూమిని సాగు చేసి.. పంట పండించే రైతులకు మాత్రమే.. వ్యవసాయ సబ్సిడీలు, ఎరువులు, రుణాలు, ఇన్సూరెన్స్ సౌకర్యం, మద్దతు ధర వంటి సౌకర్యాలను కల్పించాలని జస్టిస్ బి సుదర్శన్ రెడ్డి ప్రభుత్వాలకు కీలక సూచన చేశారు.

తాజాగా.. కౌలు రైతుల సమస్యలపై హైదరాబాద్‌లో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న జస్టిస్ బి సుదర్శన్ రెడ్డి.. రైతులు, వ్యవసాయంపై కీలక ప్రసంగం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో కౌలు రైతుల పరిస్థితి చాలా అధ్వానంగా ఉందని గుర్తు చేసిన ఆయన.. ఈ సమస్యపై రేవంత్ రెడ్డి ప్రభుత్వం దృష్టి సారించాలని పేర్కొన్నారు. తాను సుప్రీంకోర్టు జడ్జిగా పనిచేసి రిటైర్ అయ్యానని.. తనకు ప్రతీ నెల పెన్షన్ వస్తుందని గుర్తు చేశారు. అంతేకాకుండా.. తాను సంపాదించిన ఆదాయానికి ఇన్కమ్ ట్యాక్స్ కూడా చెల్లిస్తానని.. తాను నివాసించేందుకు ఇల్లు కూడా ఉందని.. అయినప్పటికీ తనకు రైతు భరోసా పథకం కింద డబ్బులు వచ్చేవని గుర్తు చేసిన ఆయన ... ఆ డబ్బులు తనకు వద్దని, వాటిని వదిలించుకునేందుకు సంబంధిత అధికారుల చుట్టూ తిరిగినట్లు వెల్లడించారు. ఒక పక్క రైతు భరోసా డబ్బులు రాలేదని? ఎందరో రైతులు వాపోతుంటే?... తనకు అవసరం లేకున్న కూడా రైతు భరోసా డబ్బులు ఎందుకు ఇస్తున్నారని ఎదురు ప్రశ్నించగా?...అధికారులు తలలు పట్టుకున్నారని, రూల్స్ అలాగే ఉన్నాయని.. తామేమీ చేయలేమని అధికారులు చెప్పగా... వారిపై తానూ తీవ్ర ఒత్తిడి తీసుకురావడంతో.. ఎలాగోలా తన పేరును రైతు భరోసా లబ్ధిదారుల జాబితాలో నుంచి తీసేయించుకున్నట్లు ఆయన చెప్పారు.

ఈ సందర్భంగా గతంలో తెలంగాణ పీసీసీ అధ్యక్షుడిగా పనిచేసిన రేవంత్ రెడ్డి.. కౌలు రైతులకు ఇచ్చిన హామీతో పాటు వరంగల్ డిక్లరేషన్‌ను అమలు చేయాలని సుదర్శన్ రెడ్డి డిమాండ్ చేశారు. రికార్డుల్లో కాలం నంబర్ 16 గతంలో అమల్లో ఉందని.. అయితే తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కాగానే ఆ కాలం నంబర్ 16ను తొలగించారని పేర్కొన్న ఆయన.. దాన్ని తిరిగి పునరుద్దరించాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో కౌలు రైతుల సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి పెట్టాలని జస్టిస్ సుదర్శన్ రెడ్డి సూచించారు.

# సింగరేణిలో బొగ్గు నిల్వలు ఎన్ని?

## ఎంత ఉన్నయ్? ఎక్కడ ఉన్నాయో? చూపిస్తారా?

## సింగరేణిని ప్రభుత్వమే దోచుకుంటొంది?

## మంత్రి శ్రీధర్‌బాబుకు బీఆర్ఎస్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ సవాల్

హైదరాబాద్, మనం ప్రతినిధి : సింగరేణి సంస్థ విషయంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నేత, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మండిపడ్డారు. సింగరేణి సంస్థను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానిది అని ఆయన స్పష్టం చేశారు. కానీ, ఆ సంస్థను ప్రభుత్వమే దోచుకుంటుందని విమర్శించారు. ఈ మేరకు మంగళవారం తెలంగాణ భవన్‌లో ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మాట్లాడుతూ.. జూన్ 5న 26 లక్షల 28 వేల మెట్రిక్ టన్నులు బొగ్గు ఉందని సింగరేణి అధికారులు వెల్లడించారని ఆయన వివరించారు. సింగరేణిలో బొగ్గు నిల్వలు ఉన్నాయని మంత్రి శ్రీధర్ బాబు చెబుతున్నారని, ఎక్కడ ఎన్ని బొగ్గు నిల్వలు ఉన్నాయో? వాటిని చూపించాలని మంత్రి శ్రీధర్ బాబును.. గంగుల కమలాకర్ డిమాండ్ చేశారు. 3 లక్షలకు పైగా బొగ్గు నిల్వ ఉందన్నారని ఆయన గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో తాను, మంత్రి శ్రీధర్ బాబు.. ఇద్దరమే అక్కడికి వెళ్తామన్నారు. బొగ్గు నిల్వ లేకపోతే తప్పు చేశామని ప్రభుత్వం ఒప్పుకోవాలని డిమాండ్ చేశారు. గతంలో ఏ ముఖ్యమంత్రి కూడా సింగరేణి విషయంలో జోక్యం చేసుకోలేదని గుర్తు చేశారు. సీఎంగా రేవంత్ రెడ్డి బాధ్యతలు చేపట్టిన తర్వాత సింగరేణిలో ఆయన వేలు పెట్టారని స్పష్టం చేశారు. రెండు, మూడు నెలల నుంచి జీతాలు ఇవ్వలేని పరిస్థితి సింగరేణిలో నెలకొందన్నారు. దీనిపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఎందుకు మాట్లాడలేదని ఆయన సూటిగా ప్రశ్నించారు.

అయితే, సింగరేణిలో 26 లక్షల మెట్రిక్ టన్నుల బొగ్గుపై సీబీసీఐడీతో విచారణ జరిపేలా ఆదేశించాలని ప్రభుత్వాన్ని కమలాకర్ డిమాండ్ చేశారు. రూ.4 వేల కోట్ల ఓడీ (ఓవర్ డ్రాఫ్ట్) ఎందుకు తీసుకున్నారో చెప్పాలని ప్రభుత్వాన్ని ఆయన ప్రశ్నించారు. దీనిపై కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డితోపాటు బండి సంజయ్ కూడా బాధ్యత వహించాల్సి ఉందన్నారు. గతంలో సింగరేణిలో 20 వేల ఉద్యోగాలు ఉండే.. కేసీఆర్ ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత కారుణ్య నియామకాలు కింద 16 వేల మందికి ఉద్యోగాలు ఇచ్చారని వివరించారు. దీంతో ఆ సంస్థలోని 36 వేల మంది ఉద్యోగులు నష్టపోయే పరిస్థితి ఉందన్నారు. బొగ్గు లేకుండా ఎందుకు ఆదాయపు పన్ను కట్టారో చెప్పాలంటూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను గంగుల కమలాకర్ డిమాండ్ చేశారు.

# జీతాలు రాక.. అంగన్‌వాడీల ఆవేదన

## సీఎం రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీశ్ ఫైర్..

హైదరాబాద్, మనం ప్రతినిధి : తెలంగాణలో అంగన్‌వాడీలకు.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జీతాలు చెల్లించడం లేదంటూ మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు విమర్శించారు. అధికారంలోకి వచ్చిన దగ్గరనుంచి మహిళలను కోటీశ్వరులుగా చేస్తామని రేవంత్ మభ్యపెడుతున్నారని ఆగ్రహించారు. అంగన్‌వాడీలకు ముందు జీతాలు చెల్లించి మహిళలపై ముఖ్యమంత్రికి ఉన్న గౌరవాన్ని నిరూపించుకోవాలన్నారు. రెండు నెలలుగా జీతాలు అందక 62 వేల మంది అంగన్‌వాడీలు తీవ్రమైన కష్టాలు పడుతున్నారని మాజీ మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు.

**ఎమ్మెల్యే హరీశ్ రావు ఎక్స్ పోస్టు..**

రెండు నెలలుగా జీతాలు రాకపోవడంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న వేల మంది అంగన్‌వాడీ సోదరీమణుల కష్టాలు మీకు కనిపించడం లేదా?. నెలల తరబడి జీతాలు ఇవ్వకుండా వేధిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి తప్పకుండా వారి ఉసురు తగులుతుంది. సాటి మహిళల కన్నీటి గోసను మహిళా మంత్రిగా ఉన్న సీతక్క అర్థం చేసుకోకపోవడం శోచనీయం. 2014 నాటికి అంగన్వాడీ టీచర్లకు కేవలం రూ.4,200, వారి సహాయకులకు రూ.2,200 వేతనం లభించేది. కానీ, బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక అంగన్‌వాడీ టీచర్ల జీతాన్ని రూ.13,650కు, మినీ అంగన్‌వాడీ టీచర్ల జీతాన్ని రూ.7,800కు, అంగన్‌వాడీ హెల్పర్ల వేతనాన్ని రూ.7,800కు పెంచి దేశంలోనే అత్యధికంగా చెల్లించారు. అభయహస్తం పేరిట ఇచ్చిన ఎన్నికల మేనిఫెస్టోలో అంగన్‌వాడీ టీచర్ల వేతనాన్ని రూ.18వేలకు పెంచుతామని, ఈపీఎఫ్ పరిధిలోకి తీసుకువచ్చి ఉద్యోగ భద్రత కల్పిస్తామని కాంగ్రెస్ ప్రకటించింది. అంగన్‌వాడీలపై పోలీసులను ప్రయోగించి దుర్మార్గమైన చరిత్రను కాంగ్రెస్ మూటకట్టుకున్న ఈ ప్రభుత్వం ఇప్పటికైనా కళ్లు తెరవాలన్నారు. వారికి రావాల్సిన వేతనాలను తక్షణమే చెల్లించాలని బీఆర్ఎస్ పార్టీ తరపునా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# భారత్‌తో మైత్రీ బంధం.. ఇజ్రాయెల్‌లో శివాజీ విగ్రహం!



ముంబయి, జూన్ 9: ఇజ్రాయెల్‌లో ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని నెలకొల్పనున్నట్లు ముంబయిలోని ఆ దేశ కాన్సులేట్ జనరల్ యానివ్ రేవచ్ వెల్లడించారు. ఆయన పోరాట స్ఫూర్తి, వీరత్వం, కృషి పట్ల ఇజ్రాయెలీలకు అవగాహన కల్పించడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. రెండు దేశాల మధ్య సాంస్కృతిక బంధాలను మరింత బలోపేతం చేసేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. శివాజీ రాజ్యాభిషేక దినోత్సవం సందర్భంగా ఈ నిర్ణయాన్ని ప్రకటించారు. ఇజ్రాయెల్‌లోని పెద్ద నగరంలో ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నామన్నారు.

''భారత్‌లో ఛత్రపతి శివాజీ మహారాజ్‌ను అమితంగా ఆరాధిస్తారు. ప్రజలపై ఆయన ప్రభావం చాలా ఉంది.శివాజీ పోరాట స్ఫూర్తికి తగినట్లుగా ఆయన స్మారక చిహ్నాన్ని స్థాపించాలనుకుంటున్నాం. ముంబయిలో తయారుచేయించి ఇజ్రాయెల్లో స్థాపిస్తాం. ఇది ఓ ప్రాజెక్టు మాత్రమే కాదు. ఇజ్రాయెల్ ప్రజలు, భారతీయులతో మమేకమయ్యేందుకు ఓ అవకాశం'' అని యానివ్ అన్నారు. శివాజీ విగ్రహ ఏర్పాటు గురించి ప్రతిపాదనలకు మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ సానుకూలంగా స్పందించారు

## అలవాట్లు - పొరబాట్లు

అలవాటులోనూ పొరబాటుగా
పొరబాటే అలవాటైపోయాక
జీవిత గమనంలో మరో గమ్యం
శూన్యమై పరిణమిస్తుంది
ఆ శూన్యంలో మరో ప్రగతి
కనుమరుగై పోతుంది
వ్యసనాల దారుల్లో
మనిషి ప్రయాణం సాగిపోయాక
మనసు మైదానంపై ఒక నిర్లిప్తత
పడగలు విప్పి ఆడుతుంది

ఒక అభివృద్ధి మౌనం దాల్చుతుంది
మద్యం మత్తులో ఒక యువత
అదుపు తప్పి చితికిలపడ్డాక
భవిష్యత్తు శిథిలమైనట్టు కానొస్తుంది
డ్రగ్స్ మోజులో మత్తు
తలకెక్కి మదంతో ఎగసిపడ్డాక
జీవిత గమ్యం దారి తప్పుతుంది
అలవాట్లు గ్రహపాట్లుగా మారితే
మనుగడ ప్రశ్నార్థకమౌతుంది
అత్యాశ విషపు కోరల కింద
మనిషి నలిగిపోయి మరణించాక
ధర్మం ఒంటి పాదంతో పరిగెడుతూ
ఎక్కడో ఒకచోట కూలబడుతుంది
అలవాటు మంచిదైతే ప్రయోజనం
దురలవాట్లు ధరికొస్తే నిష్ప్రయోజనం

దారితప్పే యువత భవితలో
చెదిరిపోతున్న మూలలెన్నో
చెదరగొడుతున్న ప్రయోజనాలెన్నో
ఒక్కసారి అలవాటు ప్రకారం
గీత దాటిన వ్యసనం పైకెగిసాక
ప్రతి అడుగులోను ఓటమి
చిరకాలం అడ్డు పడుతూ వుంటది

**- నరెద్దుల రాజారెడ్డి**
**9666016636**

## కుత..కుత...

సవాలక్ష సమస్యలు
సవాలు విసురుతూ
సుడిగుండంలో పడేసేందుకు
సామాన్యుని పైకి సవారి చేస్తున్నవి

ధరల సూచి తారాజువ్వలా
ఆకాశం వైపు దూసుకుపోతున్నది
స్తబ్దుగా సగటు జీవి ఏం పాలుపోక
దిగాలుగా నేల చూపులే చూస్తున్నడు

భద్ర జీవులు భ్రమలు తొలిగాక
బ్రతుకు భారంగా ఈడుస్తున్నారు
పరీక్షలు ప్రహసనంగా మారి
పసి హృదయాలను బలిగొంటున్నవి
పైసా పైసా లెక్క చూసే మాకు
పెట్రోల్ లెక్కలు ఎంతకు తేలుకున్నవి

మాటల సెగ తగిలి
ఉక్క పోత తట్టుకోలేక
గుంపులు గుంపులుగా బొద్దింకలు
ఢిల్లీ వైపు దండు కడుతున్నవి
గ్రీష్మంలో ఎండల కంటే ఎక్కువ
ద్రవ్యోల్బణ భారంతో మనసు
కుత..కుత... ఉడుకుతున్నది

**- డా.ఎడ్ల కల్లేశ్**
**9866765126**

# పౌర హక్కుల బాలగోపాల్



పౌరహక్కుల ఉద్యమానికి అంతర్జాతీయ ఖ్యాతి తెచ్చిపెట్టిన ఘనత బాలగోపాల్ కే దక్కుతుంది. కందాళ్ళ పార్ధనాథ శర్మ మరియు రాళ్ళపల్లి నాగమణి దంపతులకు బాలగోపాల్ 1952, జూన్ 10న బళ్ళారి, కర్ణాటకలో జన్మించాడు. ఆయన సోదరులలో ఒకరైన అనంత భారత సైన్యంలో డాక్టర్. మాతామహుడు.. ప్రముఖ సాహితీవేత్త రాళ్లపల్లి అనంత కృష్ణశర్మ.

తిరుపతిలో ఎస్వీ ఆర్ట్స్ కళాశాలలో డిగ్రీ, వరంగల్ ఆర్ఈసీ నుంచి గణితంలో పీహెచ్‌డి.. 1980లో కాకతీయ విశ్వ విద్యాలయంలో గణిత అధ్యాకుడిగా ఉద్యోగం, 1985లో ఉద్యోగానికి రాజీనామా..అప్పటి నుంచి హక్కుల ఉద్యమానికే పూర్తిగా అంకితం అయ్యాడు. మూడు దశాబ్దాలుగా అవిశ్రాంత కృషి సలిపిన ప్రముఖ హక్కుల నేత, న్యాయవాది, హేతువాది మేధావి. హైదరాబాద్ లోని గుడిమల్కాపూర్ ప్రియా కాలనీలో నివసించాడు. ఆయన భార్య వసంత లక్ష్మి ప్రముఖ పాత్రికేయురాలు. మానవ విలువల కోసం పోరుసల్పుతు, ఆదివాసీ ఉద్యమం నుంచి విప్లవోద్యమం వరకు, పౌరహక్కుల ఉద్యమం నుంచి మానవ హక్కులు ఉద్యమం వరకు, కూలీ పోరాటం నుంచి భూపోరాటం వరకు అన్నిరకాల ఉద్యమాలతో పెనవేసుకు పోయిన నాయకుడాయన. ఎక్కడ అన్యాయం, వివక్ష, అణిచివేత, అసమానతలు కనిపించినా నిష్కర్షగా, నిక్కచ్చిగా, నిర్భయంగా పోరాడాడు.

ఈ క్రమంలో వచ్చిన బెదిరింపుల్ని ఏనాడూ లెక్కచేయలేదు. ఆయనపై ఎన్నోసార్లు భౌతిక దాడులు జరిగినా రెట్టించిన ఉత్సాహంతో పనిచేశాడు. బూటకపు ఎన్‌కౌంటర్లను వెలుగు లోకి తేవడంతో పోలీసులు ఆయనపై నక్సలైట్‌గా ముద్ర వేశారు. కొత్తగూడెంలో ఓసారి ఆయనపై దాడికి పాల్పడిన పోలీసులు చనిపోయాడని భావించి, మురికి కాల్వలో పడేసి వెళ్లగా పీడీఎస్‌యూ కార్యకర్తలు ఆయన్ను కాపాడారు. ఆయన మానవ హక్కుల ఉద్యమంతో పూర్తిగా సంబంధం కలిగి ఉన్న తరువాత చాలా కాలం తరువాత న్యాయవాదిగా మారాడు.

బాలగోపాల్ 1983 మరియు 1997 మధ్య ఆంధ్రప్రదేశ్ సివిల్ లిబర్టీస్ కమిటీ (ఎపిసిఎల్సి) ప్రధాన కార్యదర్శిగా పనిచేశాడు. ఎపిసిఎల్సిలో అభిప్రాయ భేదాల తరువాత, అతను ఎపిసిఎల్సిని వదిలి మానవ హక్కుల ఫోరంను ఏర్పాటు చేశాడు. 26 సంవత్సరాల కాలంలో, అతను ఆంధ్రప్రదేశ్ మరియు ఇతర ప్రాంతాలలో ప్రభుత్వ దళాలు వేలాది మంది చట్టవిరుద్ధ హత్యల కేసులను నమోదు చేశాడు. బాలగోపాల్ 90 దశక ప్రారంభం వరకు ఎకనామిక్ అండ్ పొలిటికల్ వీక్లీలో ప్రచురించిన అనేక వ్యాసాలలో మాండలిక మార్క్సిస్ట్ పద్ధతిని అనుసరించాడు. నక్సల్బరీ ఉద్యమానికి ఎంతోమంది కార్యకర్తలను అందించిన ఆయన ఆ తర్వాత క్రమంలో విప్లవపార్టీల వైఖరిని తప్పుబట్టారు. ప్రజలకు చేరువకావడంలో ఎం.ఎల్ పార్టీలు విఫలమయ్యాయని విమర్శించారు. ఆయన రాసిన 'నక్సల్బరీ ఉద్యమం, గమ్యం, గమనం', 'చీకటి కోణం' పుస్తకాలు సంచలనం సృష్టించాయి.

మావోయిస్టుల హింస చర్యలపై ఆయన బహిరంగంగా విమర్శించడం నక్సలైట్ల నుండి తీవ్ర విమర్శలను ఆకర్షించింది. పశ్చిమ బెంగాల్లోని లాల్ ఘడ్ లో జరిగిన హింసపై ఆయన చేసిన వ్యాఖ్యల తరువాత, మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు మల్లోజుల కోటేశ్వర్ రావు..బాలగోపాల్‌ను లాల్ గఢ్ నిరోధక ప్రాంతాన్ని సందర్శించి నిజమైన చిత్రాన్ని తెలుసుకోవాలని సవాలు చేశాడు. ఆయన 2008 లో భారతదేశ ప్రణాళికా సంఘం ఏర్పాటు చేసిన తీవ్రవాద ప్రభావిత ప్రాంతాలలో అభివృద్ధి సవాళ్ళపై నిపుణుల సమూహంలో సభ్యుడిగా పనిచేశాడు. మానవ హక్కులు అవిభక్త మైనవని ఆయన నమ్మాడు. అతను తన సరళమైన జీవనానికి మరియు ఎకనామిక్ అండ్ పొలిటికల్ వీక్లీలో క్రమం తప్పకుండా కనిపించే విశ్లేషణాత్మక వ్యాసాలకు ప్రసిద్ధి చెందాడు.

ఇపిడబ్ల్యులోని అతని కథనాలలో ఇందిరా గాంధీ పాలన, రిజర్వేషన్ల సమస్య, వివిధ ప్రదేశాలలో ఎప్పటికప్పుడు మానవ హక్కుల ఉల్లంఘన, గుజరాత్ అల్లర్లు, ప్రత్యేక ఆర్థిక మండలాలు, భూసేకరణ, ఆంధ్రప్రదేశ్‌లోని షెడ్యూల్ కులాల ఉప వర్గీకరణ, వైయస్ఆర్ ప్రభుత్వం మరియు సిపిఐ-మావోయిస్టుల మధ్య చర్చలు తదితరాలతో ఆయన పాత్ర విడదీయరానిది.

రాడికల్ విప్లవం కోసం తాము కృషి చేస్తున్నామని చెప్పుకునే వారి మానవ హక్కుల ఉల్లంఘనను ఆయన తెలుగు వ్యాసం 'చీకటి కోణాలు' లో ప్రత్యక్షంగా ప్రశ్నించారు. మానవ హక్కుల ఫోరం ఏర్పడిన తరువాత, అతను తన కార్యకలాపాలను విస్తరించాడు.

జమ్మూ కాశ్మీర్, గుజరాత్, పశ్చిమ బెంగాల్ మరియు ఒరిస్సాలో తీవ్రమైన సామాజిక గందరగోళానికి గురైన ప్రాంతాలను సందర్శించాడు. ఒరిస్సాలో అతని నిజనిర్ధారణ బృందాలు రాయగడ జిల్లాను సందర్శించాయి. ప్రధాన స్రవంతి రాజకీయ పార్టీల పనితీరులో ఉన్న వంచనను ఆయన విశ్లేషించాడు, బహిర్గతం చేశాడు. బాలగోపాల్ దాదాపు ఒక దశాబ్దం క్రితం న్యాయశాస్త్రం అభ్యసించడం ప్రారంభించాడు. పోలీసులు హత్యలను ఎదుర్కోవటానికి సంబంధించిన డజన్ల కొద్దీ కేసులను వాదించాడు.

ఎన్‌కౌంటర్లలో పాల్గొన్న పోలీసులపైన హత్యానేరం నమోదు చేయాలని ఆయన గట్టిగా వాదించి విజయం సాధించాడు. ఈ రాష్ట్రంలో ఆయన అడుగుపెట్టని పల్లె లేదు, పట్టణం లేదు.

అరణ్యాల నుంచి జనారణ్యాల వరకూ ఎక్కడ ఏ సమస్య తలెత్తినా ఆయన తప్పని సరిగా ఆ ప్రాంతానికి వెళ్లి అధ్యయనం చేసేవాడు. అందుకే మన భౌగోళిక, నైసర్గిక స్థితిగతులపై ఆయనకున్న జ్ఞానం అపారం. ఆయన అక్టోబర్ 8, 2009న గుండెపోటుతో మరణించాడు.

**జూన్ 10... పౌర హక్కుల బాలగోపాల్ జయంతి**

**- రామ కిష్టయ్య సంగన భట్ల**
9440595494

# పాఠశాల విద్యార్థులకు 'ప్రతిజ్ఞ' ఒక క్రమశిక్షణ

మనదేశంలో ఉదయం దాదాపు ప్రతి పాఠశాలలో ప్రార్థనా సమయంలో ఇంగ్లీష్ లోనో, తెలుగు లోనో, ఇతర భాషలలోనో తప్పనిసరిగా పిల్లలు చదివే 'భారత దేశం నా మాతృభూమి, భారతీయు లందరూ నా సహోదరులు.' అనే 'ప్రతిజ' (ప్లెడ్జ్) రాసిన గొప్ప జాతీయ భావాలు కలిగిన రచయిత మాత్రం చాలా మందికి తెలియదు. ప్రతి రోజు విద్యార్థులు పాఠశాల దిన చర్యను ప్రారంభించే ముందు వందే మాతరం, జనగణమన జాతీయ గీతాలతో పాటు 'భారతదేశము నా మాతృభూమి..' అనే ప్రతిజ్ఞను సామూహికంగా చేసే విషయం నిత్య అనుసరణీయమే.

వందేమాతరం రాసింది బంకించంద్ర ఛటర్జీ, జనగణమన రాసింది రవీంద్రనాథ్ ఠాగూర్ అని, సారే జహాసే అచ్చా రాసింది మహమ్మద్ ఇక్బాల్ అని పిల్లలను అడిగితే సమాధానం చెప్తారు. పాఠశాల క్విజ్ పోటీలలో తప్పక వేసే ప్రశ్నలు ఇవి. కానీ ప్రతిజ్ఞ రచయిత గురించి పుస్తకాలలో లేక ఉపాధ్యాయులకు, విద్యార్థులకు తెలియపరచకుండా ఉంచడమే బాధాకరం.

తెలంగాణలోని నల్గొండ సమీపంలోని అన్నెపర్తిలో పుట్టడమే ఆయన చేసుకున్న పాపమో, లేక ఈ తెలంగాణ గడ్డకు కలిగిన శాపమో? నాటి పాలకుల పక్షపాత వైఖరియో తెలియదు కాని...జాతీయ భావం ప్రేరేపించే ప్రతిజ్ఞ యాభై ఏళ్లకు పైబడి పాఠ్య పుస్తకాల్లో ముద్రితమై కనిపిస్తున్నా అది రాసిన రచయిత పేరు దశాబ్దాలుగా ఎక్కడా ప్రస్తావించక పోవడం బాధాకరం. తెలుగుతో పాటు సంస్కృతం, హిందీ, తమిళం, మలయాళం, కన్నడ, గుజరాతీ, మరాఠీ.. తొమ్మిది భాషల్లోకి అనువాదమై, ఆరు దశాబ్దాల కిందటి నుంచే పాఠ్య పుస్తకాల్లో ప్రచురించిన ఈ ప్రతిజ్ఞను తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాతే గుర్తించడం గమనార్హం. కారణం ఈ ప్రతిజ్ఞను రాసింది తెలంగాణ వాసి కావడమే. ఆయనే నల్గొండ జిల్లా, అన్నెపర్తికి చెందిన తెలుగు రచయిత పైడిమర్రి వెంకట సుబ్బారావు.



వెంకట సుబ్బారావు (1916 జూన్ 10 - 1988 ఆగష్టు 13) 1916, జూన్ 10న పైడిమర్రి వెంకట రామయ్య, రాంబాయమ్మ దంపతులకు నల్లగొండ కేంద్రానికి సమీపంలో ఉండే అన్నెపర్తిలో జన్మించారు. విద్యాభ్యాసం మొత్తం అన్నెపర్తి, నల్లగొండలోనే సాగింది. తెలుగు, సంస్కృతం, హిందీ, ఇంగ్లీష్, అరబిక్ భాషల్లో నిష్ణాతులు. హైదరాబాద్ రాష్ట్రం లోనే ట్రెజరీ విభాగంలో ప్రభుత్వోద్యోగం సంపాదించారు. ఆ తర్వాత ఆంధ్ర ప్రదేశ్ ఏర్పడ్డాక ఖమ్మం, నిజామాబాద్, నెల్లూరు, విశాఖ పట్నం, నల్లగొండ జిల్లాల్లో పని చేశారు. ఉద్యోగ విరమణ అనంతరం 1988 ఆగష్టు 13 న అనారోగ్యంతో తుదిశ్వాస విడిచారు. ఆయన జమిందారీ, భూస్వామ్య వెట్టిచాకిరీని నిరసిస్తూ ఎన్నో కథలు రాశారు. ఆయన తన 18వ ఏటనే కాలభైరవుడు (1936) పేరున చిన్న నవల రాశారు. దేవ దత్తుడు, తులసీదాసు, త్యాగరాజు మొదలైన పద్య కావ్యాలు, బ్రహ్మ చర్యము, గృహస్థ జీవితము, స్త్రీ ధర్మము, ఫిరదౌసి, తార, శ్రీమతి అనే నాటకాలు రాశారు.

సింగపురీ నృకేసరీ శతకం, బాల రామాయణం మొదలైన రచనలు, అనేక అనువాద రచనలు కూడా చేశారు. గోలకొండ, సుజాత, ఆంధ్రపత్రిక, భారతి, నవజీవన్, ఆనందవాణి పత్రికలలో అయన రచనలు ప్రచురితమైనాయి. ఆయన పద్యాలు గోలకొండ కవుల సంచికలోను, కథలు ఉషస్సు కథా సంకలనం, తెలంగాణ తొలితరం కథలులో 'నౌకరి' కథ వచ్చింది. 1945లోనే ఉషస్సు కథల సంపుటిని వెలువరించారు. 1945-46లలో నల్లగొండలో జరిగిన ఆంధ్రసారస్వత పరిషత్తు సభలలో ప్రముఖ పాత్ర వహించారు. పదవీ విరమణ తర్వాత సర్వేలు గురుకుల పాఠశాలలో కొంతకాలం స్వచ్ఛందంగా పనిచేశారు.

1962 చైనా యుద్ధ సమయంలో ఆయన విశాఖ పట్టణంలో ట్రెజరీ అధికారిగా పనిచేస్తున్న కాలంలో, విద్యార్థులలో దేశభక్తిని పెంపొందించేందుకు పైడిమర్రి 'ప్రతిజ్ఞ' కు రూపకల్పన చేశారు. రాసిన దానిని 19 63లో విశాఖపట్నం లోని ఒక పాఠశాలలో తొలిసారిగా ప్రతిజ్ఞ చేయించారు. 'ప్రతిజ్ఞ'ను ప్రముఖ రాజకీయవేత్త, స్వాతంత్ర్య సమర యోధుడు తెన్నేటి విశ్వనాథం దృష్టికి తీసు కెళ్లగా, సాహితీవేత్త అయిన అప్పటి విద్యాశాఖ మంత్రి, విజయ నగరం రాజాగా పేరు గాంచిన పీవీజీ రాజుకు అంద చేశారు. ఆయన నాటి ముఖ్య మంత్రి కాసు బ్రహ్మానంద రెడ్డితో చర్చిం చారు. 1963లో 'ప్రతిజ్ఞ' ను పాఠ్య పుస్తకాలలో చేర్చి ప్రతిరోజు ప్రార్థనా సమయంలో చదివించాలని ఉత్తర్వులు జారీ చేసారు.

1964లో బెంగుళూరులో ప్రముఖ న్యాయ నిపుణుడు మహ్మద్ కరీం చాగ్లా అధ్యక్షతన కేంద్రీయ విద్యా సలహా మండలి సమావేశం జరిపి నపుడు జాతీయ ప్రతిజ్ఞగా స్వీకరించారు. తరువాత దీన్ని అన్ని భాషల్లోకి అనువాదం చేయించారు.

1965 తర్వాత కేంద్ర ప్రభుత్వం దీనిని ఇంగ్లీష్ లో పొందు పరచి దేశవ్యాప్తంగా అమలు చేశారు. పైడిమర్రి రాసిన ప్రతిజ్ఞలో కాలానుగుణంగా కొన్ని స్వల్ప మార్పులు జరిగి, కొన్ని గ్రాంథికం పదాల స్థానంలో వాడుక భాష వాడి, ఇతర భాషల్లోకి అనువదించి 1963 నుంచి దేశ ప్రతిజ్ఞగా అమలులోకి తెచ్చారు. 1965 జనవరి 26 నుంచి దేశ వ్యాప్తంగా పాఠశాలల్లో చదువుతున్నారు.

పాఠ్య పుస్తకాలలో ప్రచురిస్తున్న ప్రతిజ్ఞకు పైడిమర్రి వెంకట సుబ్బారావు పేరును ముద్రించాలని తెలంగాణ విద్యావంతుల వేదిక 2014 నవంబరు 27న రాష్ట్రపతికి, ప్రధాన మంత్రికి, రాష్ట్ర గవర్నర్‌కు తెలంగాణ సీఎం కెసీఆర్‌కు విజ్ఞప్తి చేశారు.

2015-16 విద్యాసంవత్సరం నుంచి కేంద్ర, రాష్ట్ర స్థాయిల్లో అన్ని భాషల్లో అన్ని ప్రభుత్వ పాఠ్య పుస్తకాలలో జాతీయ ప్రతిజ్ఞతో పాటు రచయిత పైడిమర్రి వెంకట సుబ్బారావు పేరును ముద్రిస్తున్నారు.

**జూన్ 10...పైడిమర్రి వెంకట సుబ్బారావు జయంతి**

**- ఆర్‌కేఎస్**
9440595494

# తెలంగాణ ఇక్కడి ప్రజల జాగీరే..!

ప్రజాస్వామ్యబద్ధంగా భారత రాజ్యాంగం ప్రకారం తెలంగాణ రాష్ట్రం ఏర్పడి పుష్కర కాలం గడిచినా రాష్ట్ర ఏర్పాటుపై, ఇక్కడి ప్రజలపై సీమాంధ్ర రాజకీయ పార్టీల అక్కసు బయటపడుతూనే ఉంది. కోట్లాది ప్రజల ఆరు దశాబ్దాల ఆకాంక్ష, వేలాది మంది అమరుల త్యాగాల పునాదులపై ఏర్పడ్డ తెలంగాణపై ఎందుకంత ద్వేషం..? ఇక్కడి వనరుల్ని ఇక్కడి భూమి పుత్రుల కంటే ఎక్కువగా అనుభవిస్తూ ఎందుకంత అహంభావం..? అదీ తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం నాడు జూన్ 2న, పన్నెండేళ్ళ తర్వాత నవనిర్మాణమంటూ, సభకు పర్మిషన్ ఇవ్వలేదంటూ గగ్గోలు పెట్టడం ఎందుకనే భావన తెలంగాణ ప్రజానీకానికి కలుగుతోంది.

తెలంగాణ ఏర్పడిన తర్వాత 11 రోజులు అన్నం ముట్టలేదన్న పవన్ కల్యాణ్ మాటల్ని ఇక్కడి ప్రజలు ఇంకా మరువలేదు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును కాదు ప్రక్రియను తప్పు పట్టానంటూ మరొక వితండవాదం.. ప్రక్రియ జరిగిందే భారత రాజ్యాంగం ప్రకారం కదా.. ఇందులో తప్పు ఎక్కడుందో మరి అతనికే తెలియాలి. విశ్లేషకుడు నాగేశ్వర్‌రావుకు, పవన్ కల్యాణ్‌కు మధ్య జరిగింది ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగిన వివాదం, దానికి ప్రాంతీయ విద్వేషాలు రెచ్చగొట్టడం ఎందుకున్నది రెండు తెలుగు రాష్ట్రాల్లో ఉన్న సగటు పౌరుడి ప్రశ్న. భారత రాజ్యాంగం ప్రకారం ఎవరైనా పార్టీలు పెట్టి, ఎన్నికల్లో పోటీ చేయవచ్చు దానికి ఎవరూ అడ్డు పడరు. తెలంగాణ ఓటర్లే సరైన సమయంలో సరైన తీర్పు చెప్తారు.

పవన్ కల్యాణ్ ఇటీవల నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో చాలా విషయాలు మాట్లాడారు, కాంగ్రెస్, బీజేపీ పార్టీలు ఉత్తరాది జాతీయ పార్టీలు అవి ఇక్కడ పోటీ చేయలేదా అంటూ, నిజమే కానీ బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో భాగంగా తెలంగాణ బిల్లుకు పార్లమెంట్‌లో తమ సంపూర్ణ మద్దతును ప్రకటించాయి. నాడు ఉద్యమ సమయంలో కనీసం తెలంగాణ యువత ఆత్మబలిదానాలు చేసుకోవద్దని ఒక్కనాడన్న పవన్ ఇలా ప్రెస్‌మీట్ పెట్టిన దాఖలాలు ఉన్నాయా..? తెలంగాణలో ఉన్న కొండగట్టు దేవాలయానికి తిరుమల తిరుపతి దేవస్థానం తరుపున నిధులు కేటాయించి దాన్ని కూడా రాజకీయాల కోసం వాడుకోవడం అంటే సీమాంధ్ర పార్టీలకు..నేతలకు తెలంగాణ పై ఉన్నది నిజమైన ప్రేమ,అభిమానం కాదని తేటతెల్లమైంది. ఇక్కడ సినీ మార్కెట్ ఉన్నది కాబట్టి ఇక్కడే సంపాదిస్తూ పన్ను మినహాయింపు కోసం, ఏదైనా విపత్తు వచ్చినపుడు ఎంతో కొంత చేసిన సాయాన్ని కూడా గొప్పగా ప్రచారం చేసుకోవడం సగటు పవన్ కల్యాణ్ అభిమానికీ కూడా నచ్చడం లేదు.

తెలంగాణ ముమ్మాటికి ఇక్కడి ప్రజల జాగీరే.. ప్రజాకవి గూడ అంజన్న రాసిన అయ్యోనివా..నువ్వు అవ్వోనివా..ఇసంత రమ్మంటే ఇల్లంతా నాదంటవా..? అన్న పాట యాదికి వస్తుంది. పవన్ కల్యాణ్ మాట్లాడిన మాటల్లో కొంత నిజం లేక పోలేదు. ఉద్యమ పార్టీగా రాష్ట్రాన్ని మేమే తెచ్చినమని చెప్పుకున్న టీఆర్ఎస్ జాతీయ రాజకీయాల్లో చక్రం తిప్పాలని బీఆర్ఎస్ పార్టీగా మారి ఆంధ్ర ప్రదేశ్, మహారాష్ట్రలో పార్టీ ఆఫీసులు ఓపెన్ చేసి గుణాత్మక



మార్పు కోసం ఎన్నికల్లో పోటీ చేస్తానని ప్రకటించడం కరెక్ట్ అయితే, జనసేన తెలంగాణ ఎన్నికల్లో పోటీ చేస్తే తప్పు లేదు కదా.. ఇదివరకే 2014 , 2018 అసెంబ్లీ ఎన్నికల్లో వైసీపీ, టీడీపీలు కూడా పోటీ చేశాయి కదా..!. మరి జనసేనను పోటీ చేయకుండా ఆపేదెవరు..? ఎందుకింత రాద్దాంతం..? కొత్తగా జనసేన తెలంగాణలో పోటీ చేయడం ఏంది.. గత అసెంబ్లీ ఎన్నికల్లో అక్కడక్కడా పోటీ చేస్తే డిపాజిట్లు కూడా రానిది బహుశా మరిచిపోయారేమో..?

హైదరాబాద్ శివార్లలో పవన్ కల్యాణ్ చెరువును కబ్జా చేసినట్టు వస్తున్న ఆరోపణలు నిజమో, కాదో తేల్చాల్సిన బాధ్యత హైడ్రా పైన ఉన్నది. తెలిసో తెలియకో ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్, చెరువుకు ఆనుకుని ఉన్న భూముల్లో ఇండ్లు కొని, నివసిస్తున్న వారి ఇళ్లను నేలమట్టం చేసే హైడ్రా పవన్ కల్యాణ్ వంటి సినీ, రాజకీయ నాయకుల విషయంలో మౌనంగా ఉంటే ప్రజల్లోకి తప్పుడు సంకేతాలు వెళ్తాయి. ఏపీలో మూడో స్థానంలో ఉన్న పార్టీ, ఇక్కడ పోటీ చేస్తే మహా అయితే ఆరో స్థానంలో ఉండొచ్చు, ఏపీలో మూడు నుండి రెండు అటునుంచి ఒకటికి చేరితే నమ్మి వెంట తిరిగిన కార్యకర్తలకు మేలు జరుగుతుంది కానీ, తెలంగాణ ఎన్నికల్లో గెలుపోటములను నిర్ణయించే స్థాయిలో జనసేన ఉండదన్నది వాస్తవం.

సీమాంధ్ర సెటిలర్ల కోసం ఎన్నికల్లో గెలవడానికి ఒకటి, రెండు నియోజకవర్గాల్లో విగ్రహాలు పెట్టుకుంటే పర్వాలేదు కానీ అస్తిత్వ మనుగడను ప్రశ్నార్థకం చేసేలా క్షుద్ర రాజకీయాలు చేసేది ఎవరైనా సరే తెలంగాణ సమాజం క్షమించదు. తెలంగాణ ప్రభుత్వం సీమాంధ్ర కాంట్రాక్టర్లకు కాంట్రాక్టులు కట్టబెట్టడం ఎంత తప్పో.. సీమాంధ్ర బడా హీరోల సినిమాలకు స్పెషల్ టికెట్ రేట్లు, బెనిఫిట్ షోలకు పర్మిషన్లు ఇవ్వడం కూడా అంతే తప్పు. సినిమా బాగున్నా, లేకున్నా అభిమానాన్ని టికెట్ రేట్ల రూపంలో చేసే దోపిడిని అరికట్టాల్సిన బాధ్యత కూడా ఇక్కడి ప్రభుత్వం మీదే ఉంటుంది.

తెలంగాణ ఉద్యమంలో పాల్గొనని నాయకులు, ఈ రోజు ఎమ్మెల్యే, ఎంపీలుగా గెలిచి ఉండవచ్చు. ప్రాంతేతరుడు ద్రోహం చేస్తే ప్రాంతం నుండి తరమికొడతం, ప్రాంతంవాడే ద్రోహం చేయాలని చూస్తే ప్రాంతంలోనే పాతి పెడతం అన్న ప్రజాకవి కాళోజీ మాటల్ని యావత్ తెలంగాణ సమాజం ఎన్నటికీ మరువదు. ఆనాడు తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును వ్యతిరేకించి, రాజకీయ వలస పక్షుల్లా ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పక్షాన చేరే వాళ్ళు పార్టీలకతీతంగా ప్రజల పక్షాన నిలబడకుంటే వాళ్లకు రాజకీయ భవిష్యత్ లేకుండా చేసే శక్తి ఇక్కడి ప్రజలకు ఉన్నది. పవన్ కల్యాణ్ మాట్లాడుతూ మాజీ సీఎం కేసీఆర్, ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి అంటే గౌరవమని చెప్తూనే, తెలివిగా ఇక్కడి నాయకులను, ప్రజల్ని వేరుచేసి మాట్లాడుతున్నారు. ఇంకెన్నాళ్ళు ఈ ప్రత్యేక వాదమంటూ విభజించి పాలించే.. బ్రిటీష్ కాలం నాటి రాజకీయం చేయబోతే తెలుసుకోలేనంత అమాయకులు తెలంగాణలో ఎవరూ లేరు.

నిజాం నిరంకుశ పాలనకు, రజాకార్ల అకృత్యాలకు, భూస్వాముల దోపిడీలకు వ్యతిరేకంగా జరిగిన సాయుధ రైతాంగ పోరాటమైనా... ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ పట్ల వివక్షకు వ్యతిరేకంగా ఉధృతమైన 1969 నాటి తొలిదశ జై తెలంగాణ ఉద్యమమైనా... సీమాంధ్ర వలస పాలనలో దశాబ్దాలుగా నీళ్లు, నిధులు, నియామకాల్లో జరిగిన అన్యాయాలపై, స్వరాష్ట్ర సాధనే లక్ష్యంగా సాగిన 2009 మలిదశ తెలంగాణ ఉద్యమమైనా...అన్నీ స్వీయ అస్తిత్వం, ఆత్మగౌరవ పునాదులపైనే నిర్మితమయ్యాయి. ఇక్కడి ప్రజల ఆత్మగౌరవాన్ని, అస్తిత్వ మనుగడను ప్రశ్నార్థకం చేయాలని చూస్తే... ఇక్కడి గడ్డిపరకలు కూడా పోరాటానికి సై అంటూ గడ్డపారలవుతాయి.

ప్రముఖ కవి అందెశ్రీ మాటల్లో చెప్పాలంటే.. తెలంగాణ అంటే పిడికెడు మట్టి కాదు, ఇక్కడి ప్రజలు నిప్పుల వాగులో నివురుగప్పిన నిప్పు కణికలు విద్వేషాన్ని రాజేసే ప్రయత్నం చేసిన వారే దహనమైన ఘటనలు చరిత్రలో కోకొల్లలు.. తెలంగాణది ప్రాంతీయ వాదమని సీమాంధ్ర రాజకీయ పార్టీల నాయకులు తప్ప మరెవరూ అనరు. తెలంగాణది ప్రాంతీయ వాదం కాదు అసలు సిసలైన జాతీయ వాదం. వందలాది ఏండ్ల క్రితం నుండే భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీకగా ఇక్కడి ప్రజలు కుల,మత, వర్గ భేదాలను పక్కన పెట్టి సోదరభావంతో జీవించే గొప్ప వాతావరణం ఇక్కడ ఉన్నది. అటువంటి తెలంగాణది జాతీయ వాదం అవుతుంది కానీ ప్రాంతీయ వాదమంటూ వక్రీకరించడం ఎందుకు..? పవన్ కల్యాణ్ అమితంగా ఇష్టపడే గద్దర్ కూడా ఇప్పుడు బ్రతికి ఉంటే తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని అవమానించే ప్రయత్నం మానుకోవాలని హితవు పలికే వాడేమో..

వాస్తవానికి జాతీయ వాదంలోనే ప్రాంతీయ వాదం మిళితమై ఉంటుంది. అదే నిజమైన సమాఖ్య స్ఫూర్తికి నిదర్శనం. భారతదేశం రాష్ట్రాల సమాఖ్య అని రాజ్యాంగంలోని మొదటి ఆర్టికల్ స్పష్టం చేస్తోంది. నాడు ప్రాంతీయ వాదంతోనే కదా మద్రాసు రాష్ట్రం నుండి ఆంధ్ర విడిపోయింది..? నాడు ఆంధ్ర రాష్ట్రంగా ఏర్పడింది ప్రాంతీయ వాదం వల్లనే అని పవన్ అంగీకరించినట్లేనా..? విడిపోయిన తర్వాత కూడా చెన్నైలో తెలుగు వారున్నట్లే, హైదరాబాద్‌లో సీమాంధ్రులు, మార్వాడీలు, ఇతర రాష్ట్రాల నుండి జీవనోపాధి కోసం వచ్చిన వాళ్ళున్నారు. అంతా సఖ్యతగా ఉన్నప్పుడు, సీమాంధ్ర వలస పాలనలో అమరులైన వారి త్యాగాలను, ఉద్యమ జ్ఞాపకాలను స్మరించుకునే తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం నాడు ఇక్కడి ప్రజలను రెచ్చగొట్టేలా ప్రసంగించడం ముమ్మాటికి సరికాదు.

కేంద్ర ప్రభుత్వంలో ఉన్న ఎన్డీఏ కూటమిలో భాగస్వాములు కాబట్టి పవన్ కళ్యాణ్ ఏం మాట్లాడినా సమర్థించే ఇక్కడి బీజేపీ నాయకుల తీరును కూడా తెలంగాణ యువత నిశితంగా గమనిస్తోంది. అధికార కాంగ్రెస్ అయినా, ప్రతిపక్ష బీఆర్ఎస్ అయినా, మరే పార్టీ అయినా ఇక్కడి ప్రజల ఆకాంక్షలకు, అమరుల ఆశయాలకు అనుగుణంగా కృషి చేయాలి. తమ తరుపున కొట్లాడే పార్టీలను... నాయకులను గుండెల్లో పెట్టుకునే విశ్వసనీయత తెలంగాణ ప్రజలకు ఉన్నది.

తెలుగు వారికి ఇప్పుడు రెండు రాష్ట్రాలు ఉన్నాయి. రెండు రాష్ట్రాలూ సంక్షేమం, అభివృద్ధిలో పోటీ పడేలా పాలన అందించాల్సిన బాధ్యత ఇరు ప్రభుత్వాలపై ఉంది. రెండు రాష్ట్రాల్లో రెండు సార్లు ప్రభుత్వాలు మారాయి. ప్రస్తుతం అధికారంలో ఉన్న పార్టీలు గత పాలకుల వైఫల్యం వల్లే ఇదంతా.. అంటూ ఆరోపణలు చేయడం కంటే ప్రజలు ఐదేళ్లు అధికారాన్ని అందించినప్పుడు వీలైనంత మంచి చేసే ప్రయత్నం చేయాలి. అంతేకానీ ప్రాంతీయ విద్వేషాలు రెచ్చగొడుతూ ప్రజా సమస్యలను పక్కదోవ పట్టించవద్దు. విభజన చట్టం హామీలు, గోదావరి, కృష్ణా నది జలాల వివాదాలు ఇంకా అలాగే ఉన్నాయి. నిత్యావసర వస్తువుల ధరలపై నియంత్రణ లేకపోవడం, నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించకుండా, ఎన్నికలు వచ్చినపుడు హామీలు ఇవ్వడం, గెలిచిన తర్వాత ఇచ్చిన హామీలను అమలు చేయకుండా పాలన సాగించడం శోచనీయం. ఇరు రాష్ట్రాల ప్రజల మధ్య ఉన్న సుహృద్భావ వాతావరణాన్ని దెబ్బతీసే ప్రయత్నాలు మానుకుంటే అందరికీ మంచిది.

**- యం.అర్జున్**

# రైతులకు సరిపడా ఎరువుల నిల్వలు ఉన్నాయి

- **ఆందోళన చెందవద్దు**
- **కలెక్టర్ ఇలా త్రిపాఠి**



**నిజామాబాద్, జూన్ 9 ( మనం బ్యూరో ):** జిల్లాలోని అన్ని సహకార సంఘాల గోడౌన్లు, సేల్ పాయింట్లలో రైతులకు సరిపడా ఎరువుల నిల్వలు ఉన్నాయని.. ఆందోళన చెందవద్దని కలెక్టర్ ఇలా త్రిపాఠి పేర్కొన్నారు. ఎడపల్లి మండలంలోని జానకంపేట్, ఎడపల్లిలో ఎరువుల గిడ్డంగులు, విక్రయ కేంద్రాలను కలెక్టర్ మంగళవారం తనిఖీ చేశారు. గోడౌన్లలో నిల్వ ఉన్న యూరియా, ఇతర ఎరువులను కలెక్టర్ పరిశీలించారు. స్టాక్, రిజిస్టర్‌లో పొందుపర్చిన వివరాలతో సరిపోల్చుకున్నారు. ఇప్పటివరకు ఎన్ని ఎరువుల బస్తాలు వచ్చాయి..? ఎన్ని పంపిణీ చేశారు...? ఎంత పంపిణీ చేయాల్సి ఉందనే వివరాలను అధికారులతో అడిగి తెలుసుకున్నారు. యూరియా బుకింగ్ యాప్ పనితీరును కలెక్టర్ స్వయంగా పరిశీలన జరిపి, యాప్ వల్ల సమకూరే ప్రయోజనాల గురించి రైతులకు వివరించారు. మన రాష్ట్రంలో అమలు అవుతున్న బుకింగ్ యాప్ విధానాన్ని ఇతర రాష్ట్రాలు కూడా ఎరువుల పంపిణీ కోసం అమలు చేస్తున్నాయన్నారు. ఈ యాప్ వల్ల ఎలాంటి నష్టం లేదని, గత రబీ సీజన్‌లో కూడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా అమలు చేయడం జరిగిందని గుర్తు చేశారు. ఎరువులు పక్కదారి పట్టకుండా, పారదర్శకంగా, ప్రణాళికాబద్ధంగా యూరియా పంపిణీకి బుకింగ్ యాప్ దోహదపడుతుందని, దీని విషయంలో రైతులు అపోహలకు గురి కావద్దని కలెక్టర్ సూచించారు. నానో యూరియా వాడకం వల్ల కలిగే లాభాలపై రైతులకు అవగాహన కల్పించారు. ప్రయోగాత్మకంగా కొంత పరిమాణంలో నానో యూరియాను వినియోగించి ఫలితాలను స్వయంగా పరిశీలించాలని రైతులకు హితవు పలికారు. అయితే రైతులను నానో యూరియా కొనాలని బలవంతం చేయవద్దని, వారు కోరిన ఎరువులు మాత్రమే అందించాలన్నారు. ఇతర ఉత్పత్తులు కొనుగోలు చేయాలని ఒత్తిడి చేస్తే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని, డీలర్ల లైసెన్సులు రద్దు చేసేందుకు కూడా వెనుకాడబోమని కలెక్టర్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు. జిల్లా రైతుల అవసరాలకు సరిపడా ప్రస్తుతం 27 వేల మెట్రిక్ టన్నుల పైచిలుకు యూరియా ఎరువులు అందుబాటులో ఉన్నాయని పాలనాధికారి పేర్కొన్నారు. ఎక్కడ కూడా కొరత ఏర్పడకుండా రైతుల అవసరాలకు అనుగుణంగా అన్ని ప్రాంతాలకు నిల్వలను చేరవేస్తున్నామని తెలిపారు. పలు సొసైటీలు డిఫాల్ట్‌లో ఉండగా, వాటి పరిధిలోని రైతులకు సైతం ఇబ్బందులు తలెత్తకూడదని, స్థానికంగానే వారికి ఎరువులు అందుబాటులో ఉంచాలనే ఉద్దేశ్యంతో డీసీఎంఎస్ ద్వారా ఎరువుల పంపిణీ జరిపిస్తున్నామన్నారు. పంటలు విత్తుకునే బోధన్, బాన్సువాడ నియోజకవర్గాల పరిధిలో ఇప్పటికే రైతులకు ఎరువుల పంపిణీ ప్రక్రియను ప్రారంభించినట్లు కలెక్టర్ పేర్కొన్నారు. తదుపరి నిజామాబాద్, ఆర్మూర్, బాల్కొండ నియోజకవర్గాల్లో కూడా పక్కాగా పంపిణీ జరిగేలా చర్యలు తీసుకున్నామని, స్టాక్ పాయింట్లకు ఎరువుల నిల్వలు చేరవేశామని వివరించారు. మోతాదుకు మించి ఎరువులు, క్రిమిసంహారక మందులు వినియోగించకుండా, వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తల సూచనలు పాటించాలని రైతులకు సూచించారు. కలెక్టర్ వెంట జిల్లా వ్యవసాయ అధికారి వీరస్వామి, జిల్లా సహకార శాఖ అధికారి శ్రీనివాస్, తహశీల్దార్ దత్తాద్రి, జానకంపేట్ సర్పంచ్ అనురాధ, సొసైటీ ఛైర్మన్ నరేందర్, స్థానిక అధికారులు పాల్గొన్నారు.

## డిటిఎఫ్ జగిత్యాల జిల్లా కమిటీ ఏకగ్రీవ ఎన్నిక




- **అధ్యక్షులుగా దాశెట్టి రవీందర్ రెడ్డి**

**జగిత్యాల జూన్ 8 ( మనం న్యూస్):** డిటిఎఫ్ జగిత్యాల జిల్లా 5వ వార్షిక కౌన్సిల్ సమావేశం మంగళవారం జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు ఎన్నం రామ్ రెడ్డి అధ్యక్షతన జరిగింది. జిల్లా ప్రధాన కార్యదర్శి గట్ల సంతోష్ కార్యదర్శి నివేదికను ప్రవేశపెట్టగా సభ్యుల చర్చ అనంతరం సభ ఆమోదించింది. డీటీఎఫ్ నిర్మాణానికి సభ్యులంతా నిర్మాణాత్మక పాత్ర పోషించాలని అధ్యక్షులు ఎన్నం రామ్ రెడ్డి పిలుపునిచ్చారు. డిడిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బీ.శ్యామ్ ఎన్నికల అధికారిగా, రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.శౌతన్ పరిశీలకులుగా వ్యవహరించగా, డీటీఎఫ్ రాష్ట్ర పూర్వ అధ్యక్షులు ఎం. రఘు శంకర్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

**డీటీఎఫ్ జిల్లా నూతన కమిటీ:**

అధ్యక్షులుగా దాశెట్టి రవీందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా గట్ల సంతోష్, ఉపాధ్యక్షులుగా ఇంద్రాల రమేశ్వర్, ఐత పద్మ, రాథోడ్ నాందేవ్, కార్యదర్శులుగా నీలం సంపత్, మొగిలి గంగరాజం, గడప రాజేందర్, ఎం.రవీందర్, ఆడిట్ కన్వీనర్గా వేముల రవీందర్ రెడ్డి ఎన్నికయ్యారు. రాష్ట్ర కౌన్సిలర్లుగా ఎన్నం రాంరెడ్డి, వి . లతా దేవి, ఎండి రజాక్ తదితరులు ఎన్నికయ్యారు. సమావేశంలో రవీందర్ రెడ్డి, నరేందర్, రాజేందర్, సంపత్, రమేశ్వర్, నాందేవ్, పద్మ తదితరులు పాల్గొన్నారు.

## విద్య పేరుతో దోపిడీకి అడ్డుకట్ట వేయాలి

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలి

అక్రమ ఫీజులు, పాఠ్యపుస్తకాల విక్రయాలపై చర్యలు తీసుకోవాలి

ఏబీవీపీ కరీంనగర్ విభాగ్ కన్వీనర్ అజయ్




**పెద్దపల్లి, జూన్ 09 (మనం ప్రతినిధి):** జిల్లాలో విద్యా రంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏబీవీపీ పెద్దపల్లి జిల్లా శాఖ ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ)కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ కరీంనగర్ విభాగ్ కన్వీనర్ అజయ్ మాట్లాడుతూ, జిల్లాలోని అనేక ప్రభుత్వ పాఠశాలల్లో తాగునీరు, మరుగుదొడ్లు, తరగతి గదులు, ఫర్నిచర్, ప్రహరీ గోడలు, డిజిటల్ విద్యా సదుపాయాలు వంటి ప్రాథమిక వసతులు తగిన స్థాయిలో లేవని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలంటే ప్రభుత్వ పాఠశాలల్లో అవసరమైన మౌలిక సదుపాయాలను వెంటనే కల్పించాలని డిమాండ్ చేశారు.

అదే సమయంలో, కొన్ని ప్రైవేట్ మరియు కార్పొరేట్ పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అధిక ఫీజులు వసూలు చేస్తూ తల్లిదండ్రులను ఆర్థికంగా ఇబ్బందులకు గురిచేస్తున్నాయని ఆరోపించారు. ఫీజుల వివరాలను పారదర్శకంగా ప్రకటించకుండా ఇష్టానుసారంగా వసూలు చేస్తున్న పాఠశాలలపై విద్యాశాఖ కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కొన్ని విద్యాసంస్థలు విద్యార్థులు తప్పనిసరిగా తమ వద్ద నుంచే లేదా నిర్దిష్ట దుకాణాల నుంచే పాఠ్యపుస్తకాలు, నోట్బుక్స్, యూనిఫాంలు కొనుగోలు చేయాలని ఒత్తిడి తెస్తున్నాయని తెలిపారు. ఈ విధానం తల్లిదండ్రులపై అదనపు ఆర్థిక భారం మోపుతోందని పేర్కొన్నారు. అలాగే, ప్రభుత్వ అనుమతులు లేకుండా లేదా విద్యాశాఖ నిబంధనలను పాటించకుండా నిర్వహిస్తున్న పాఠశాలలను గుర్తించి, సమగ్ర విచారణ జరిపి అవసరమైతే వాటి గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు.డిమాండ్లపై అధికారులు స్పందించకపోతే రానున్న రోజుల్లో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఏబీవీపీ నాయకులు హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యుడు మారం సందీప్, జిల్లా కన్వీనర్ బండి రాజశేఖర్, నాయకులు విఘ్నేష్, జశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

# సమాచార హక్కు చట్టం అమలులో నిర్లక్ష్యం

### గాంధారి మండల అధికారిపై జిల్లా పంచాయతీ కార్యాలయంలో మొదటి అప్పీల్




**కామారెడ్డి, జూన్ 9 ( మనంప్రతినిధి):** కామారెడ్డి జిల్లా గాంధారి మండల పరిషత్ పంచాయతీ కార్యాలయంలో సమాచార హక్కు చట్టం అమలు తీరుపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. చట్టానికి లోబడి రికార్డుల పరిశీలన కోసం దరఖాస్తు చేసుకున్నప్పటికీ, స్థానిక అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో సమాచార హక్కు కార్యకర్త శ్రావణ్ కుమార్ జిల్లా పంచాయతీ కార్యాలయంలో మొదటి అప్పీల్ దాఖలు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. ఆర్టీఐ కార్యకర్త శ్రావన్ కుమార్ సుమారు 40 రోజుల క్రితం గాంధారి మండల పరిషత్ పంచాయతీ కార్యాలయంలోని రికార్డులను పరిశీలించేందుకు సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తు చేసుకున్నారు. ఈ దరఖాస్తును పరిశీలించిన జిల్లా అధికారులు, తదుపరి చర్యల నిమిత్తం సమాచార హక్కు చట్టం సెక్షన్ 6(3) కింద గాంధారి మండల కార్యాలయానికి బదిలీ చేశారు. చట్టం ప్రకారం నిర్ణీత గడువులోగా దరఖాస్తుదారునికి సమాచారం అందించాల్సి ఉండగా, గాంధారి మండల సమాచార అధికారి మాత్రం ఈ దరఖాస్తును పూర్తిగా పక్కనబెట్టారు. గడువు ముగిసినా అధికారుల నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో శ్రావణ్ కుమార్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.

**ప్రధాన ముఖ్యాంశాలు.. 40 రోజుల నిరీక్షణ**

దరఖాస్తు సమర్పించి 40 రోజులు గడుస్తున్నా మండల అధికారి నుంచి ఎటువంటి సమాధానం రాకపోవడంతో సెక్షన్ 6(3) ఉల్లంఘన జరిగినట్లు ధ్రువీకరణ చేసుకొని జిల్లా అధికారులు బదిలీ చేసిన దరఖాస్తుపై స్థానిక అధికారి నిర్లక్ష్య వైఖరి వహించడం చట్ట నిబంధనలకు విరుద్ధం అని తెలియజేసారు. మండల అధికారి బాధ్యతారాహిత్యానికి నిరసనగా శ్రావణ్ కుమార్ జిల్లా పంచాయతీ కార్యాలయంలో మొదటి అప్పీల్ దాఖలు చేయాల్సి వచ్చింది.

**చట్టాన్ని అపహాస్యం చేస్తున్నారు: శ్రావణ్ కుమార్.**

'ప్రజాస్వామ్య వ్యవస్థలో పారదర్శకత కోసం తెచ్చిన సమాచార హక్కు చట్టాన్ని గాంధారి మండల అధికారులు అపహాస్యం చేస్తున్నారు. జిల్లా అధికారులు ఆదేశించినా స్థానిక సమాచార అధికారి స్పందించకపోవడం వారి నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. ఉన్నతాధికారులు స్పందించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలి మరియు తక్షణమే రికార్డుల పరిశీలనకు అనుమతించాలి.' - శ్రావన్ కుమార్, ఆర్టీఐ కార్యకర్త మండల స్థాయి అధికారుల తీరుపై జిల్లా పంచాయతీ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో, దరఖాస్తుదారునికి ఎప్పుడు న్యాయం జరుగుతుందో వేచి చూడాలి.

## రైల్వే స్టేషన్‌లో 10 కిలోల గంజాయి స్వాధీనం



**కామారెడ్డి, జూన్ 9 (మనం జిల్లా ప్రతినిధి):** కామారెడ్డి రైల్వే స్టేషన్లో ఎక్సైజ్ అధికారులు నిర్వహించిన తనిఖీల్లో 10 కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకుని ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశారు. జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి బి. హన్మంతరావు ఆదేశాల మేరకు ఎక్సైజ్ సిబ్బంది రైల్వే స్టేషన్లో తనిఖీలు చేపట్టారు. సంబల్పూర్ నుంచి నాందేడ్ వెళ్తున్న నాగవలి ఎక్స్ప్రెస్లో అనుమానాస్పదంగా కనిపించిన మహారాష్ట్రలోని జాల్నా జిల్లాకు చెందిన సునీల్, ప్రవీణ్లను తనిఖీ చేయగా వారి వద్ద 10 కిలోల ఎండు గంజాయి లభ్యమైంది. ఒడిశాలోని రాయగడలో కొనుగోలు చేసిన గంజాయిని మహారాష్ట్రకు తరలిస్తుండగా పట్టుబడినట్లు ఎక్సైజ్ సీఐ సీహెచ్. సంపత్ కృష్ణ తెలిపారు. నిందితులిద్దరినీ అరెస్ట్ చేసి రిమాండ్కు తరలించినట్లు అధికారులు వెల్లడించారు. తనిఖీల్లో ఎక్సైజ్ సీఐ సంపత్ కృష్ణ, ఎస్ఐ విక్రమ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

## లోక్ అదాలత్ కేసుల పరిష్కారం వేగం పెంచాలి




- **జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయి రమాదేవి**

**సిద్దిపేట, జూన్ 9 మనం ప్రతినిధి:** లోక్ అదాలత్ కేసుల పరిష్కారం విషయంలో వేగం పెంచాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయి రమాదేవి పేర్కొన్నారు. జిల్లా కోర్ట్ కాంప్లెక్స్ లో మంగళవారం జరిగిన డిస్టిక్ కోఆర్డినేషన్ కమిటీ మీటింగ్ సాయి రమాదేవి పాల్గొని ప్రసంగించారు. జిల్లాలో సివిల్, క్రిమినల్ కేసుల పెండింగ్ పై చర్చిస్తూ చాలా కాలం నుండి పెండింగ్ లో ఉన్న కేసులను పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని న్యాయ, పోలీస్ శాఖల అధికారులకు సూచించారు. పెండింగ్ లో ఉన్న కేసులను వెంటనే పరిష్కారం అయ్యే విధంగా చూడాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు న్యాయమూర్తి జయప్రసాద్, జిల్లా కలెక్టర్ హైమావతి వివిధ కోర్టుల జడ్జిలు, పబ్లిక్ ప్రాసిక్యూషన్ లాయర్లు, ఏసీపీలు తదితరులు పాల్గొన్నారు.

# పూరిగుడిసెలు లేని జిల్లాగా కామారెడ్డి

### రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో పూరిగుడిసెల్లో నివసిస్తున్న వారికి ప్రాధాన్యం

### గృహ సౌకర్యం లేని కుటుంబాల వివరాలు సేకరణకు చర్యలు

### నిజమైన లబ్ధిదారుల గుర్తింపునకు గ్రామస్థాయిలో సమగ్ర సర్వే నిర్వహించాలని ఆదేశం

### అర్హులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు ప్రక్రియ వేగవంతం చేయాలి.. కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్



**కామారెడ్డి, జూన్ 9 (మనం జిల్లా ప్రతినిధి):** జిల్లాలో ఒక్క పూరిగుడిసె కూడా లేకుండా కామారెడ్డిని పూరిగుడిసెలు లేని జిల్లాగా తీర్చిదిద్దేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ సూచించారు. పూరిగుడిసెల్లో నివసిస్తున్న అర్హులైన కుటుంబాలను గుర్తించి వారికి ఇందిరమ్మ ఇళ్ల మంజూరు ప్రక్రియను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం రామారెడ్డి మండలంలోని వడ్డెర కాలనీని సందర్శించిన కలెక్టర్, అక్కడ పూరిగుడిసెల్లో నివసిస్తున్న కుటుంబాల పరిస్థితిని పరిశీలించారు. గృహ సౌకర్యం లేని అర్హుల వివరాలను క్షేత్రస్థాయిలో సేకరించి ప్రభుత్వ నిబంధనల మేరకు వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. రెండవ విడత ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ కార్యక్రమంలో భాగంగా పూరిగుడిసెల్లో నివసిస్తున్న నిజమైన లబ్ధిదారులను గుర్తించి వారికి ఇళ్లు మంజూరు చేసేలా చర్యలు చేపట్టాలని తెలిపారు.

**ఏపీఎం ద్వారా రుణాలు మంజూరు.**

ఇళ్ల నిర్మాణంలో పేమెంట్ సమస్యలు తలెత్తిన సందర్భాల్లో ఏపీఎం ద్వారా రుణాలు మంజూరు చేసి పనులు ఆగిపోకుండా చూడాలని సూచించారు. నిజమైన అర్హులను గుర్తించడంలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా గ్రామస్థాయిలో సమగ్ర సర్వే నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. అర్హత కలిగిన ప్రతి కుటుంబం ప్రభుత్వ గృహ పథకాల ప్రయోజనం పొందేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సంబంధించి పెండింగ్లో ఉన్న అంశాలను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ పనులు వేగవంతం చేయాలని, లబ్ధిదారులకు అవసరమైన సాంకేతిక, పరిపాలనా సహకారం అందించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పీడీ హౌసింగ్ విజయపాల్ రెడ్డి, తహసీల్దార్, ఎంపీడీవో నాగేశ్వర్ రావు, సర్పంచ్ బండి ప్రవీణ్, సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## మహానంది ఆలయానికి లాకర్ విరాళం




**మహానంది.,జూన్9,మనంన్యూస్:** ప్రముఖ శైవ క్షేత్రమైన మహానంది ఆలయానికి హైదరాబాదులోని యశోద హాస్పిటల్ కి చెందిన డాక్టర్ రాజశేఖర్ చక్రవర్తి, డాక్టర్ కిరణ్మయి దంపతులు లాకర్ ను మంగళవారం విరాళంగా అందజేసినట్లు సూపరిండెంట్ లు శశిధర్ రెడ్డి, నీలకంఠ రాజు తెలిపారు. రెండు లక్షల రూపాయల పైనే విలువ చేస్తుందని పేర్కొన్నారు. విలువైన వస్తువులు ఆభరణాలు లాకర్లలో భద్రపరుచుకోవడానికి దీనివల్ల అవకాశం ఏర్పడింది అన్నారు. క్షేత్రంలో ఇంతవరకు విలువైన బంగారు ఆభరణాలు, ఇతర విలువైన వస్తువులు దాచుకోవడానికి లాకర్ వసతి లేదని తెలిపారు. ప్రస్తుతం డాక్టర్ రాజశేఖర్ చక్రవర్తి , డాక్టర్ కిరణ్మయి దంపతుల ఆర్థిక సహాయ సహకారాలతో ఈ అవకాశం దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో టెంపుల్ ఇన్స్పెక్టర్ మల్లయ్య, జగదీశ్వర రెడ్డి వున్నారు.

# రుణ లక్ష్యం పూర్తికి బ్యాంకర్లు సహకరించాలి

- **రుణ లక్ష్యం పూర్తికి బ్యాంకర్లు సహకరించాలి**
- **లక్ష్యం లో 90% మించి అమలు తప్పనిసరి కావాలి**
- **వ్యవసాయ తదితర రుణాల ప్రాధాన్యత కల్పించాలి**
- **కే హైమావతి, జిల్లా కలెక్టర్**



**సిద్దిపేట జూన్ 9; మనం ప్రతినిధి:** రైతులకు వ్యవసాయ రుణాలు, ప్రాధాన్యతా రంగ రుణాలు మరింతగా అందించి లక్ష్యాలను సాధించాలని బ్యాంకర్లకు సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని సబ్సిడీ ఆధారిత పథకాల రుణాలను ఎటువంటి జాప్యం లేకుండా అర్హులైన లబ్ధిదారులకు మంజూరు చేయాలని ఆదేశించారు. సిద్దిపేటలో మంగళవారం జరిగిన జిల్లా కన్సల్టేషన్ కమిటీ, మరియు జిల్లా స్థాయి సమీక్ష కమిటీ సమావేశంలో మాట్లాడారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జిల్లాలోని బ్యాంకులు మొత్తం రూ.9,450 కోట్ల రుణాలు పంపిణీ చేసి 87.60 శాతం లక్ష్యాన్ని సాధించాయని. ఇందులో ప్రాధాన్యతా రంగానికి రూ.6,746.65 కోట్లు (76.26%), ప్రాధాన్యేతర రంగానికి రూ.2,658.86 కోట్లు (140.68%) రుణాలు అందించగా, స్వయం సహాయక సంఘాలకు రూ.851.86 కోట్లు (96.52%) రుణాలు మంజూరు చేయడం జరిగింది అన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించిన లక్ష్యాల సాధనలో బ్యాంకర్లు ముందుండాలని, ముఖ్యంగా ప్రాధాన్యతా రంగంలోని వ్యవసాయ విభాగంలో కనీసం 90 శాతం లక్ష్యాన్ని చేరుకోవాలని ఆదేశించారు. ముద్ర, విద్యా రుణాలు, వ్యవసాయం మరియు ఎంఎస్ఎంఈ రంగాల్లో గణనీయమైన సేవలు అందించేలా కార్యాచరణ ప్రణాళికలు రూపొందించి అమలు చేయాలని సూచించారు. ప్రాధాన్యతా రంగాల లక్ష్య సాధనలో వెనుకబడిన బ్యాంకులు గ్రామీణ ప్రాంతాలన్నింటిలో రుణ మేళాలు నిర్వహించి రైతులకు అవసరమైన ఆర్థిక సహాయం అందించాలని తెలిపారు. ఖరీఫ్ సీజన్ను దృష్టిలో ఉంచుకుని రైతు వేదికలు, గ్రామసభల్లో పాల్గొని రుణాలపై అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి వచ్చే రైతులకు సత్వర సేవలు అందించేందుకు ఐడీఓసీలో హెల్ప్డెస్కు ఏర్పాటు చేయాలని బ్యాంకు అధికారులను ఆదేశించారు. త్రైమాసిక ప్రాతిపదికన నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించుకుని లక్ష్య సాధన దిశగా పనిచేయాలని సూచించారు. పీఎంఎఫ్ఎంఈ, పీఎంఈజీపీ, ముద్ర యోజన మరియు యూనియన్ రూరల్ సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్ పథకాలలో నిర్దేశిత లక్ష్యాలను సాధించాలని సంబంధిత అధికారులకు సూచించారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు విలువ ఆధారిత శిక్షణలు అందించాలని, అంతరించిపోతున్న గొల్లభామ చీరల నేసే కళను ప్రోత్సహించేలా ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు చేపట్టాలని కలెక్టర్ పేర్కొన్నారు. మహిళల ఆర్థిక సాధికారత కోసం వినూత్న వ్యాపార ప్రణాళికలు రూపొందించాలని, టెక్స్టైల్స్ పార్కో పాటు వ్యవసాయ ఆధారిత ఉత్పత్తుల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఫుడ్ సెక్యూరిటీ మరియు ప్రాధాన్యతా రంగాల్లో కనీసం 97 శాతం లక్ష్య సాధనకు కృషి చేయాలని సూచించారు. జిల్లాలో కరీంనగర్ జిల్లా కన్న ఎక్కువ పంట జిల్లాలో వచ్చిందని ఇందుకు కృషి చేసిన రైతులు, అధికారులు, బ్యాంకర్లను అభినందించారు. రైతులు మరియు స్వయం సహాయక సంఘాలకు అవసరమైన రుణాలు అందించడంతో పాటు, గోదాముల నిర్మాణానికి బ్యాంకులు సహకరించాలని కోరారు. ప్యాక్స్, ఐకేపీ సంస్థలు కూడా గోడౌన్ ల సదుపాయాలు కల్పించుకునేలా రుణ సహాయం అందించాలని సూచించారు. రాబోయే రోజుల్లో ఎల్నినో ప్రభావం ఉండే అవకాశం ఉన్నందున రైతులకు తగిన సలహాలు, ఆర్థిక సహకారం అందించి పంట దిగుబడులు తగ్గకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశం అనంతరం 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వార్షిక రుణ ప్రణాళికను ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఎల్డీఎం హరిబాబు మాట్లాడుతూ, 2026-27 సంవత్సరానికి జిల్లాకు మొత్తం రూ.11,829 కోట్ల వార్షిక రుణ ప్రణాళిక లక్ష్యాలు నిర్ణయించబడ్డాయని. ఇందులో వ్యవసాయ రంగంలో రూ.7,542 కోట్లు సూక్ష్మ, చిన్న మరియు మధ్య తరహా పరిశ్రమలు రూ.1,675 కోట్లు, ప్రాధాన్యతా రంగం మొత్తం : రూ.9,675 కోట్లు ప్రాధాన్యేతరరరంగం : రూ.2,155 కోట్లు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏజీఎం హేమలత, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆర్ఎం మకరంద్, తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఆర్ఎంలు ఈ. రాజయ్య, శ్రీనివాస్, డీసీసీబీ డీజీఎం విశ్వేశ్వర్, నాబార్డ్ డీడీఎం నిఖిల్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ, వ్యవసాయ, డీఆర్డీఏ అధికారులు, వివిధ బ్యాంకుల ప్రతినిధులు పాల్గొన్నారు.

## జిల్లా రవాణా శాఖ అధికారిని కలిసిన ప్రైవేట్ ట్రావెల్స్ ప్రతినిధులు



జగిత్యాల, జూన్ 9( మనం న్యూస్):జగిత్యాల జిల్లాకు నూతనంగా నియమితులైన జిల్లా రవాణా శాఖ అధికారి మహమ్మద్ సందాని, వెహికల్ ఇన్స్పెక్టర్ లను పాత బస్టాండ్ ప్రైవేట్ ట్రావెల్స్ యూనియన్ సభ్యులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా రవాణా శాఖ పరిధిలోని రవాణా వ్యవస్థ, ప్రైవేట్ ట్రావెల్స్కు సంబంధించిన పలు అంశాలపై వారు అధికారులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో పాత బస్టాండ్ ప్రైవేట్ ట్రావెల్స్ అధ్యక్షుడు సయ్యద్ ఇక్బాల్ భాయ్, రఘుపతి రెడ్డి, చారి, నవీన్, కిషన్ పాల్గొన్నారు. అలాగే ప్రైవేట్ ఆర్టీసీ బస్ అసోసియేషన్ అధ్యక్షుడు వేణుగోపాల్, జనరల్ సెక్రటరీ చుక్క వేణుగోపాల్, శ్రీనివాస్ రెడ్డి తదితరులు హాజరయ్యారు. అధికారులు తమకు సహకరించాలని ప్రతినిధులు కోరగా, నిబంధనల మేరకు పూర్తి సహకారం అందిస్తామని అధికారులు హామీ ఇచ్చారు.

# వర్షాకాలం అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- వాగులు వంకలు పొర్లి ప్రమాదాలకు ఆస్కారం ఉన్న రోడ్లను,బ్రిడ్జిలను గుర్తించి ప్రమాద హెచ్చరికలు పెట్టాలి
- ప్రతి రోజు అధికారులు ఫీల్డ్ విజిట్ చేయాల్సిందే..
- ఆర్ అండ్ బి అధికారుల సమీక్షలో మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి
- పురోగతిలో ఉన్న పలు రోడ్లు, ఆర్వోబి,ఆర్యుబి లపై ఆరా తీసిన మంత్రి
- రీజినల్ రింగ్ రోడ్డు భూసేకరణలో రాష్ట్ర వాటా కింద 626.87 కోట్లు ఇప్పటికే గ్రాఏఅఐ ఖాతాలో జమచేసినట్లు వెల్లడి
- నందిపాడ్ వెహికల్ అండర్ పాస్ నిర్మాణంపై అధికారులను ఆదేశించిన మంత్రి



హైదరాబాద్, మనంన్యూస్ః వర్షాకాలం ప్రారంభమవుతున్న నేపథ్యంలో ఆర్ అండ్ బి అధికారులు క్షేత్ర స్థాయిలో పూర్తి అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి స్పష్టం చేశారు. వాగులు వంకలు పొర్లి ప్రమాదాలకు ఆస్కారం ఉన్న రోడ్లను,బ్రిడ్జిలను గుర్తించి ప్రమాద హెచ్చరికలు పెట్టాలనీ,అందుకు అన్ని శాఖలతో సమన్వయం చేసుకోవాలన్నారు. రోడ్లు, బ్రిడ్జిలు, కల్వర్టులు,లో కాజ్ వేలు వివరాలను మంత్రి అధికారులను అడిగి తెలుసుకున్నారు. గత ఏడాది వానకాలం సీజన్ లో క్షేత్ర స్థాయిలో మానిటరింగ్ చేస్తూ అప్రమత్తంగా ఉన్నట్లే..ఎర్రమంజిల్ ప్రధాన కార్యాలయంలో కంట్రోల్ రూమ్ సెంటర్ ఏర్పాటు చేసుకుని,జిల్లాల వారీగా రోజు వారి పరిస్థితులు పర్యవేక్షించాలని చెప్పారు. ఆర్ అండ్ బి డివిజన్ ల వారిగా క్షేత్ర స్థాయి రిపోర్ట్ రోజు తనకు తెలపాలని మంత్రి అధికారులకు స్పష్టం చేశారు. రాష్ట్ర స్థాయి అధికారులతో పాటు సి.ఈ.,ఎస్.ఈ.,ఈ.ఈ., డి.ఈ.,ఏ.ఈ లు ఖచ్చితంగా ప్రతి రోజు ఫీల్ విజిట్ చేయాల్సిందేనని తేల్చి చెప్పారు. పురోగతిలో ఉన్న పలు రోడ్లు, ఆర్వోబి,ఆర్యుబి లపై ఆరా తీసిన మంత్రి,తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. ఫినిషింగ్ స్టేజ్ లో ఉన్నవాటిపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి: రాష్ట్రంలో రోడ్ నెట్వర్క్ అభివృద్ధి పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు ప్రత్యేక దృష్టి సారించినట్లు మంత్రి ఈ సందర్భంగా అధికారులతో పేర్కొన్నారు. హ్యామ్ పనులకు అతి త్వరలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా శంకుస్థాపన ఉంటుందని మంత్రి అన్నారు. 2047 రైసింగ్ తెలంగాణ నినాదంతో 3ట్రిలియన్ ఎకానమీ లక్ష్యంగా వెళ్తున్న సీఎం రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా గ్లోబల్ సమ్మిట్ వేదికగా రాష్ట్ర రోడ్ సెక్టార్ పాలసీ తీసుకువచ్చామని గుర్తు చేశారు. గ్రామీణ స్థాయి నుండి రహదారులు అభివృద్ధి చేయడం వల్ల పరిశ్రమలు వచ్చి, పల్లెల్లో ఉపాధి అవకాశాలు పెరుగుతాయని చెప్పారు. రీజినల్ రింగ్ రోడ్డు పనుల పురోగతిపై ఆరా తీసిన మంత్రి రీజినల్ రింగ్ రోడ్డు ప్రాజెక్టు రాష్ట్రానికి గేమ్ చేంజర్ గా మారనుందని,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,తాను కేంద్రమంత్రి నితిన్ గడ్కరీని కలిసి ప్రాజెక్ట్ వేగంగా పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని కోరిన విషయాన్ని గుర్తు చేశారు. ఇటీవల ఖఖఖసదరన్ పార్ట్ పై మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి గారికి కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ రాసిన లేఖపై సమీక్షలో ప్రస్తావనకు వచ్చింది. కేంద్రం నుండి వెంటనే సదరన్ పార్ట్ పై అప్రూవల్ వచ్చేలా ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నామని,ఇక్కడి కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి,బండి సంజయ్,రాష్ట్ర బీజేపీ ఎంపీలు ఈ విషయంలో చొరవ తీసుకోవాలని కోరారు. రాజకీయాలకు అతీతంగా రాష్ట్రాభివృద్ధికి సహకరించాలన్నారు. రీజినల్ రింగ్ రోడ్డు ఉత్తర భాగం భూసేకరణలో రాష్ట్ర వాటా కింద 626.87 కోట్లు ఇప్పటికే గ్రాఏఅఐ ఖాతాలో జమచేసినట్లు వెల్లడించారు. హై స్పీడ్ రైల్ కారిడాల్ (హైదరాబాద్ - పూణే - ముంబై,భారత్ ఫ్యూచర్ సిటీ - చెన్నై,ఫ్యూచర్ సిటీ - బెంగళూరు) పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారితో ప్రత్యేకంగా చర్చిస్తానని ఈ సందర్భంగా మంత్రి చెప్పారు. ఎయిర్పోర్ట్ ల పనుల పురోగతిపై ఆరా.. వరంగల్ ఎయిర్పోర్ట్,ఆదిలాబాద్ ఎయిర్పోర్ట్ పనులు వేగంగా జరుగుతున్నాయని రూరల్ ఎకానమీ గ్రోత్ కి ఎంతో ఉపయుక్తం కానున్నాయని మంత్రి అభిప్రాయ పడ్డారు. వరంగల్ ఎయిర్పోర్ట్ పనులు వేగంగా జరుగుతున్నాయని వచ్చే ఏడాది నాటికి కార్గో సేవలు అందుబాటులోకి వచ్చేలా పనులు చేస్తున్నట్లు తెలిపారు. నందిపాడ్ వెహికల్ అండర్ పాస్ నిర్మాణం పై... న్యామ్ రోడ్డులో మిర్యాలగూడ నియోజకవర్గంలోని నందిపాడ్ వద్ద తరచూ యాక్సిడెంట్స్ జరుగుతున్నాయని,వెంటనే అక్కడ వెహికిల్ అండర్ పాస్ నిర్మించేందుకు ఏర్పాట్లు చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. పరిపాలన అనుమతులు మంజూరు చేసి, పనులు అతి త్వరగా ప్రారంభం అయ్యేలా చూడాలని చెప్పారు. ఈ సమీక్ష సమావేశంలో స్పెషల్ సిఎస్ వికాస్ రాజ్, సెక్రెటరీ ప్రావిణ్యా,సి.ఈ లు బి.వి రావు,ధర్మారెడ్డి, వనజ పలువురు ఆర్ అండ్ బి ఇంజనీర్లు ఉన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో మీ పిల్లల్ని చేర్పించండి

- మీ పిల్లల చదువుకు నాది బాధ్యత
- జిల్లా విద్యాశాఖఅధికారి సిద్ధార్థ రెడ్డి



ములుగు , జూన్ 9, మనం ప్రతినిధిఃములుగు జిల్లా గోవిందరావు పేట మండలం గాంధీనగర్ గ్రామపంచాయతీలో గ్రామ సర్పంచ్ బానోత్ నిర్మల వెంకన్న ఆధ్వర్యంలో మంగళవారం బడిబాట కార్యక్రమం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా విద్యాశాఖ అధికారి సిద్ధార్థ రెడ్డి హాజరై విద్యార్థుల తల్లిదండ్రుల ఇంటికి స్వయంగా వెళ్లి ప్రభుత్వ బడిలో పిల్లలను వారికి భరోసానిచ్చారు.ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి సిద్ధార్థ రెడ్డి మాట్లాడుతూ..ప్రభుత్వ పాఠశాలలో అత్యుత్తమ ప్రతిభ కలిగిన ఉపాధ్యాయులు విద్యా బోధన అందిస్తారని,ప్రైవేటు పాఠశాలకు తీసిపోకుండా అన్ని వసతులను ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేశామని అన్నారు. రాష్ట్రంలో ఇటీవల జరిగిన పదవ తరగతి పరీక్షల్లో ములుగు జిల్లా మొదటి స్థానంలో నిలిచిందని, ప్రభుత్వ పాఠశాలలో 100 శాతం ఉత్తీర్ణత వచ్చేవిధంగా కృషిచేస్తున్నామని అన్నారు. తప్పనిసరిగా మీ పిల్లలను ప్రభుత్వ బడిలో చేర్పించండి అంటూ గాంధీనగర్ గ్రామస్తులకు భరోసానిచ్చారు.

ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బానోత్ నిర్మల వెంకన్న,ఉప సర్పంచ్ వల్లపు మహేష్, ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మి,వార్డు సభ్యులు మాలోత్ శంకర్,తేజావత్ హుని,లిక్కి కుమారస్వామి, కూరాకుల సురేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

# 20న 'పది' ప్రతిభావంతులకు పురస్కారాల పంపిణీ

- 500 మంది విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ
- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

పటాన్ చెరు, జూన్ 9 (మనం న్యూస్) : ఇటీవల విడుదలైన పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో పటాన్ చెరు నియోజకవర్గ పరిధిలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థినీ విద్యార్థులను ప్రోత్సహించడంలో భాగంగా ఈ నెల 20వ తేదీన సైకిళ్లు, ప్రశంసా పత్రాలు అందజేయనున్నట్లు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. మంగళవారం పటాన్ చెరు డివిజన్ పరిధిలోని క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని ఆయా మండలాల విద్యాశాఖ అధికారులు, ప్రైవేట్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, కరస్పాండెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు పరీక్షల సమయంలో మానసిక స్థైర్యం పెంపొందించేందుకు వ్యక్తిత్వ వికాస నిపుణులతో శిక్షణ తరగతులు నిర్వహించడంతోపాటు.. పరీక్ష సామాగ్రి సైతం అందించడం జరుగుతోందని తెలిపారు. అదే విధంగా.. ఫలితాల్లో అత్యుత్తమ మార్పులు సాధించిన విద్యార్థులను సైతం ప్రోత్సహించాలన్న లక్ష్యంతో ప్రతి సంవత్సరం నగదు పురస్కారాలు పంపిణీ చేస్తున్నమని తెలిపారు. ఈ సంవత్సరం వినూత్నంగా సైకిళ్ళు



పంపిణీ చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని ప్రతి పాఠశాలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ విద్యార్థినీ విద్యార్థులకు పురస్కారాలు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ నెల 20వ తేదీ ఉదయం 10 గంటలకు పటాన్చెరు పట్టణంలోని మైత్రి మైదానంలో కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యార్థులు, తల్లిదండ్రులు భారీ సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో పటాన్చెరు మండల విద్యాశాఖ అధికారి నాగేశ్వరరావు నాయక్, తదితరులు పాల్గొన్నారు.

## కరీంనగర్లో టాస్క్ ఫోర్స్ మెరుపు దాడులు



- భారీగా కల్తీ కారంపొడి, సుగంధ ద్రవ్యాల స్వాధీనం

కరీంనగర్ జూన్ 9(మనం బ్యూరో)ః నగరంలోని శనివారం మార్కెట్ పరిధిలో కల్తీ కారంపొడి విక్రయిస్తున్నారనే నమ్మదగిన సమాచారం మేరకు కరీంనగర్ టాస్క్ ఫోర్స్ పోలీసులు మంగళవారం మెరుపు దాడులు నిర్వహించారు. మార్కెట్లోని గౌరిశెట్టి రమేష్'మరియు సిద్ధంశెట్టి చక్రపాణి' కిరాణం సుగంధ ద్రవ్యాల దుకాణాల్లో జరిపిన ఈ సోదాల్లో భారీ మొత్తంలో కల్తీ అనుమానిత నిల్వలను కనుగొన్నారు. ఈ దాడుల సమాచారాన్ని వెంటనే ఫుడ్ సేఫ్టీ అధికారులకు చేరవేయగా, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్లు అంకిత్ రెడ్డి, రోహిత్ రెడ్డిలు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. టాస్క్ ఫోర్స్ బృందం వారి సమక్షంలో సుమారు ₹47 బస్తాల కారంపొడి (ప్రతి బస్తా బరువు 50 కిలోలు), 2 బస్తాల పసుపు, మరియు 1 బస్తా ధనియాల పొడిని స్వాధీనం చేసుకుని ఫుడ్ సేఫ్టీ అధికారులకు అప్పగించారు. ఫుడ్ సేఫ్టీ అధికారులు సదరు దుకాణాల నుండి నమూనాలను సేకరించి, పరీక్షల నిమిత్తం ల్యాబొరేటరీకి పంపించారు. ఈ ల్యాబ్ పరీక్షల ఫలితాలు వచ్చే వరకు సదరు స్టాక్ను పూర్తిగా సీజ్ చేయడం జరిగిందని, అలాగే ఈ సుగంధ ద్రవ్యాల అమ్మకాలపై పూర్తి నిషేధం విధించినట్లు అధికారులు తెలిపారు. ప్రజల ఆరోగ్యంతో ఆటలాడే కల్తీ వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా పోలీసులు హెచ్చరించారు.ఈ దాడుల్లో టాస్క్ ఫోర్స్ ఏసీపీ వాసాల సతీష్ ఎస్సైలు మామిడాల సురేందర్, శ్రీకాంత్ కానిస్టేబుల్ సాయిదీప్ లు పాల్గొన్నారు.

## కరీంనగర్ జిల్లాలో 2.77 లక్షల ప్రభుత్వ ఉచిత పాఠ్యపుస్తకాల పంపిణీ పూర్తి

కరీంనగర్, జూన్ 09,(మనం బ్యూరో)ః 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి కరీంనగర్ జిల్లాకు కేటాయించిన 2,77,340 ప్రభుత్వ ఉచిత పాఠ్యపుస్తకాల పంపిణీని జిల్లాలోని 16 మండలాలకు విజయవంతంగా పూర్తి చేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎన్. ప్రశాంత్ రెడ్డి తెలిపారు. విద్యా సంవత్సరం ప్రారంభం నుంచే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందుబాటులో ఉండేలా ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టామని, జిల్లాలోని అన్ని మండలాలకు అవసరమైన పాఠ్యపుస్తకాల సరఫరా ప్రక్రియను శాతం వందకు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండల విద్యాధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని తమ పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు పాఠ్యపుస్తకాలు సకాలంలో చేరేలా పర్యవేక్షణ



చేపట్టాలని సూచించారు. ముఖ్యంగా జూన్ 12వ తేదీ నాటికి ప్రతి పాఠశాలలో అన్ని తరగతులకు అవసరమైన పాఠ్యపుస్తకాలు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండి, విద్యార్థులకు పంపిణీ జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అదేవిధంగా పాఠ్యపుస్తకాల స్వీకరణ, నిల్వ, పంపిణీ ప్రక్రియలో ప్రధానోపాధ్యాయులు మరియు సంబంధిత సిబ్బంది సమన్వయంతో పనిచేసి ఎక్కడా కొరత లేదా ఆలస్యం తలెత్తకుండా చూడాలని సూచించారు. ప్రభుత్వం విద్యార్థుల విద్యాభివృద్ధికి అత్యంత ప్రాధాన్యతనిస్తూ విద్యా సంవత్సరం ప్రారంభం నుంచే అవసరమైన అన్ని విద్యా వనరులు అందుబాటులో ఉండేలా విద్యాశాఖ కట్టుదిట్టమైన చర్యలు చేపడుతోందని జిల్లా విద్యాశాఖాధికారి తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేయడంలో సహకరించిన టెక్స్టుబుక్స్ జిల్లా మేనేజర్, టెక్స్టుబుక్స్ నోడల్ అధికారి, మండల విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులు, సంబంధిత అధికారులు మరియు సిబ్బందిని జిల్లా విద్యాశాఖాధికారి అభినందించారు.

## అధికారులతో మంత్రి పొన్నం సమీక్ష

హైదరాబాద్, మనంన్యూస్ః హైదరాబాద్ సాయంత్రం కురిసిన భారీ వర్షం కారణంగా ఏర్పడిన పరిస్థితులపై హైదరాబాద్ ఇన్చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ జీహెచ్ఎంసీ కమిషనర్, సిటీ పోలీస్ కమిషనర్, జిల్లా కలెక్టర్లతో ఫోన్లో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. తక్కువ సమయంలో ఒక్కసారిగా భారీ వర్షం కురవడంతో నగరంలోని పలు ప్రాంతాల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని మంత్రి పేర్కొన్నారు. అనేక ప్రాంతాల్లో మోకాళ్ల లోతు వరకు వర్షపు నీరు నిల్వ ఉండటంతో వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారని తెలిపారు. నగరంలోని ఒక్కసారిగా ఈదురు గాలులు వీయడంతో పలు ప్రాంతాల్లో చెట్లు కూలిపోవడం, విద్యుత్ తీగలు తెగిపడిన ఘటనలపై మంత్రి ఆరా తీశారు. విద్యుత్ షాక్ తో ఇద్దరు వ్యక్తులు మరణించారని తెలుసుకున్న సమాచారంతో తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.కూలిన చెట్లు ,తెగిన విద్యుత్ తీగలు తొలగించడానికి సహాయక చర్యలను వేగవంతం చేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని జీహెచ్ఎంసీ, హైడ్రా, పోలీస్, విద్యుత్, హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్, రెవెన్యూ తదితర శాఖలు సమన్వయంతో పనిచేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. భారీ వర్షాలు కురిసే సమయంలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టాలని సూచించారు.

ప్రజల భద్రతకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ఎలాంటి అత్యవసర పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు అన్ని శాఖలు అప్రమత్తంగా ఉండాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

# కడుపునిండా అన్నం పెట్టే చేతులకు, పుట్టెడు కడుపు కోత...

- స్వరాష్ట్రం సాధించుకున్నాం మన్న సంబరం తప్ప,
- డైలీ వేజ్ వర్కర్ల బ్రతుకులు హీనమాయే
- పని భారం ఎక్కువ పైస తక్కువ
- రెక్క ఆడితే గాని డొక్కాడని డైలీ వర్కర్ల బతుకులు మారేదేప్పుడు
- ప్రభుత్వాలు మారిన.. మా బ్రతుకులు మారవా
- మా డైలీ వేజ్ వర్కర్ల గోస వినరా పెద్ద సారోళ్ళు




ఉమ్మడి మహబూబ్ నగర్ జూన్ 9 (మనం బ్యూరో): స్వరాష్ట్రము సాధించుకున్నామన్న సంబరం తప్ప, మా ఆకలి కేకలు, బాధలు తీరేది ఎప్పుడు అయ్యా అంటూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో డైలీ వేజ్ వర్కర్ల అర్ధనాదాలు అంతా ఇంతా కాదు. గత నాలుగు నెలల క్రితం తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా సరియైన పనికి సరైన గౌరవ వేతనం ఇవ్వాలంటూ పలు డిమాండ్లతో దాదాపు నెల పైబడి ఆశ్రమ పాఠశాలల ముందు నిరసన, ధర్నా కార్యక్రమాలు వినుత్న రీతిలో డైలీ వేజ్ వర్కర్లు కార్యక్రమాలు చేపట్టడం జరిగింది. అయినా కూడా ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా మా బ్రతుకులు మారవా అంటూ డైలీ వేజ్ వర్కర్లు ముక్తకంఠంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా గిరిజన సంక్షేమ శాఖలో అనేక సంవత్సరాలుగా సేవలందిస్తున్న డైలీ వేజ్ కార్మికుల పరిస్థితి నేటికీ ఆందోళనకరంగా ఒక ప్రశ్నార్థకంగా మిగిలిపోతుందా అన్న భయంతో వారు ఉండిపోతున్నారు. ప్రభుత్వాలు మారాయి, పాలకులు మారుతున్నారు, అనేక సంక్షేమ పథకాలు పెరుగుతున్నాయి, కానీ గిరిజన సంక్షేమ శాఖలో పనిచేస్తున్న డైలీ వేజ్ వర్కర్ల జీవితాల్లో మాత్రం ఏమాత్రం మార్పు కనిపించడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గిరిజన సంక్షేమ శాఖలో ఆశ్రమ పాఠశాలలు, గురుకులాలు, కళాశాల వసతి గృహాలు, కార్యాలయాల్లో డైలీ వేజ్ పద్ధతిలో పనిచేస్తున్న కార్మికులు విద్యార్థుల సంక్షేమం కోసం రాత్రింబవళ్లు కష్టపడుతూ విద్యార్థులకు మూడు పూటలా కడుపు నింపుతున్నారు. ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు భోజనం, వసతి, పరిశుభ్రత, భద్రత, కార్యాలయ నిర్వహణ వంటి అనేక బాధ్యతలను నిర్వర్తిస్తు ముందుకు వెళ్తున్న ఆ డైలీ వర్కర్లు ఏం పాపం చేశారయ్యా. వారి బతుకులు మారేది ఎప్పుడు అంటూ పలుకుల సంఘాలు, ప్రతిపక్షాల నేతలు మద్దతుగా నిలుస్తున్నారు. శ్రమకు తగిన గుర్తింపు, గౌరవం, వేతనం మాత్రం లభించడం లేదని వాపోతున్నారు. గిరిజన సంక్షేమ శాఖలో పనిచేస్తున్న డైలీ వేజ్ వర్కర్లు లేవనెత్తుతున్న ప్రధాన ప్రశ్న 'పని ఒకటే అయితే వేతనం ఎందుకు వేరుగా ఉంటుంది?' అనేదే. ఒకే కార్యాలయంలో, ఒకే విధమైన బాధ్యతలు నిర్వర్తిస్తున్న రెగ్యులర్ ఉద్యోగికి నెలకు ఒక లక్ష రూపాయల వరకు జీతం వస్తుండగా, డైలీ వేజ్ వర్కర్ మాత్రం కేవలం రూ.11,700 వేతనంతోనే కుటుంబాన్ని పోషించాల్సిన పరిస్థితి నెలకొంది. ఇదెక్కడి న్యాయం అంటూ కొంతమంది ప్రశ్నిస్తున్నారు.కష్టానికి తగ్గ ఫలితం దక్కాలి.సమాన పనికి సమాన వేతనం అనే సూత్రం రాజ్యాంగం, న్యాయస్థానాల తీర్పుల్లో ప్రస్తావనకు వచ్చినప్పటికీ క్షేత్రస్థాయిలో మాత్రం అమలు కావడం లేదని గిరిజన సంక్షేమ శాఖలో పనిచేస్తున్న డైలీ వేజ్ వర్కర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేతనాల్లో 80 నుంచి 90 శాతం వరకు వ్యత్యాసం ఉండటం అన్యాయమని వారు ముక్తకంఠంతో పేర్కొంటున్నారు. జీవోలతో ప్రయోజనాలా? లేక కోతలా.. కొన్ని సందర్భాల్లో ప్రభుత్వం జారీ చేస్తున్న జీవోల వల్ల వేతనాల పెంపు కంటే కోతలే ఎక్కువగా కనిపిస్తున్నాయని గిరిజన సంక్షేమ శాఖలో పనిచేస్తున్న డైలీ వేజ్ వర్కర్లు ఆరోపిస్తున్నారు. ఉద్యోగ భద్రత, వేతనాల పెంపు, క్రమబద్ధీకరణ వంటి అంశాలపై స్పష్టమైన విధానం లేకపోవడంతో కార్మికుల్లో అనిశ్చితి నెలకొంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి ఎన్నో సంవత్సరాలు గడిచినా గిరిజన సంక్షేమ శాఖలో పనిచేస్తున్న డైలీ వేజ్ వర్కర్ల సమస్యలు యథాతథంగానే ఉన్నాయి. 'మా జీవితాలు ఎప్పుడు మారుతాయి? సమాన పనికి సమాన వేతనం ఎప్పుడు వస్తుంది...? ఉద్యోగ భద్రత ఎప్పుడు కలుగుతుంది?' అనే ప్రశ్నలకు ఇప్పటికీ సమాధానం దొరకడం లేదని కార్మికులు చెబుతున్నారు. గిరిజన సంక్షేమ శాఖలో పనిచేస్తున్న డైలీ వేజ్ వర్కర్లకు కనీస వేతనాల పెంపు, సమాన పనికి సమాన వేతనం, ఉద్యోగ భద్రత, సేవల క్రమబద్ధీకరణ, సామాజిక భద్రతా పథకాలు అమలు చేయాలని వారు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. గిరిజన విద్యార్థుల భవిష్యత్తు కోసం శ్రమిస్తున్న కార్మికుల భవిష్యత్తును కూడా ప్రభుత్వం పట్టించుకోవాల్సిన అవసరం ఉందని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. స్వరాష్ట్రం సాధించిన తెలంగాణలో గిరిజన సంక్షేమ శాఖలో పనిచేస్తున్న డైలీ వేజ్ వర్కర్ల జీవితాల్లో కూడా వెలుగులు నిండే రోజు ఎప్పుడు వస్తుందో అని వెయ్యి కళ్ళతో వేచి చూస్తున్నారు.

# రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సమస్యలు తీర్చేదెన్నడు?

- జిపిఎఫ్ బకాయిలు రాని పెన్షనర్లు
- పెన్షనర్లకు ఉద్యోగ విరమణ బకాయిలు ఏవి?

ఖమ్మం, జూన్ 9(మనం న్యూస్)ః సమస్యలతో రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లు సతమతమవుతున్నారని, వాటిని సత్వరం పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం(ఎస్జీపిఏటి) రాష్ట్ర కార్యదర్శి వి. మేరి ఏసుపాదం, జిల్లా అధ్యక్షులు పరిశపుల్లయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. మంగళవారం కృషిభవన్ లో ఎస్జీపిఏటి జిల్లా అధ్యక్షులు పరిశ పుల్లయ్య అధ్యక్షతన జరిగిన పెన్షనర్ల సమావేశంలో వారు మాట్లాడారు. వైద్యశాలల ఎంపిక జరగకుండా, ఈహెచ్ఎస్ విధి విధానాలు లేకుండా పెన్షనర్లకు సమాచారం లేకుండా ప్రీమియం మినహాయింపు చేయటం శోచనీయమని, రాష్ట్ర ప్రభుత్వం సత్వరం స్పందించి పెన్షనర్ల మానసిక ఆందోళనకు పరిష్కారం చూపాలని కోరారు. రెండు సంవత్సరాలుగా ఉద్యోగ విరమణ చేస్తున్న పెన్షనర్ల బకాయిలు సత్వరం చెల్లించాలని, వందలాది మంది పెన్షనర్లకు జిపిఎఫ్ బకాయిలు ఇప్పటికి జమ కాలేదని, సత్వరమే బకాయిలు చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇప్పటివరకు బకాయిపడ్డ ఐదు విడతల కరువుభత్యం మంజూరు చేయాలని, డిఏ బకాయిలు పెన్షనర్లకు ఏకమొత్తంగా చెల్లించాలని, పిఆర్సిని సత్వరం అమలు చేయాలని కోరారు. పెట్రోలు, డీజిల్, వంటగ్యాస్ ధరలు కేంద్ర ప్రభుత్వం దఫదఫాలుగా పెంచుతున్నదని, దీని ఫలితంగా పెన్షనర్లు మధ్యతరగతి ప్రజానీకం, కార్మికులు, కర్షకులు సతమతమవుతున్నారని, అధిక ధరల భారం పట్ల పెన్షనర్లు ఆందోళన చెందుతున్నారని ఎస్జిపిఏటి జిల్లా ప్రధాన కార్యదర్శి రాయల రవికుమార్ తెలిపారు. సమావేశం ముందుగా పెన్షనర్లు ప్రముఖ అధ్యాపకులు బివిరామారావు, కొసరాజు రామకృష్ణయ్య, కాలం వీరభద్రరావు, చావా శ్రీహరి మరణంతో పాటు విశాఖపట్నం ఉక్కు ఫ్యాక్టరీ ప్రమాద మృతులకు, దేశ వ్యాపితంగా వడగాడ్పు మృతులకు, ఢిల్లీ అగ్నిప్రమాదం, పడవ ప్రమాదం లో మరణించిన వారికి మౌనం పాటించి, నివాళులు అర్పించింది.




సమావేశంలో సీనియర్ పెన్షనర్లు దుగ్గినేని శ్రీనివాసరావు, చీదిరాల వెంకటేశ్వర్లు, వీరభద్రరావు మాట్లాడుతూ పెన్షనర్ల సమస్యల పట్ల ప్రభుత్వ వైఖరి సరిగాలేదని, పెన్షనర్లు చైతన్యవంతంగా ఉండాలని కోరారు. సమావేశంలో జిల్లా ఆర్థిక కార్యదర్శి గుర్రాల శ్రీనివాసరావు, సంయుక్త అధ్యక్షులు కనపర్తి వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు పెదమళ్ళ సత్యనారాయణ, మహిళా కార్యదర్శి బోజెడ్ల కృష్ణకుమారి, కార్యదర్శులు ప్రసాదరావు, నాగప్రసాద్, సుధాకర్, రామనాథం, హుస్సేన్, కార్యకర్తలు శివకుమార్, దేవప్రసాద్, ఆదినారాయణ, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు మరింత చేరువగా సహకార బ్యాంకింగ్ సేవలు...

**మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి**

**ఏదులాపురం మునిసిపల్ పరిధిలో డిసిసిబి కరుణగిరి నూతన శాఖ ప్రారంభం**



ఖమ్మం, జూన్ 9(మనం బ్యూరో): రైతులకు మరింత చేరువగా సహకార బ్యాంకింగ్ సేవలు అందనున్నాయని మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు.ఏదులాపురం మునిసిపల్ ప్రాంతంలోని కరుణగిరిలో జిల్లా కేంద్ర సహకార బ్యాంకు లిమిటెడ్ (డీసీసీబీ) నూతన శాఖను రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సంయుక్తంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ రైతులు, స్వయం సహాయక సంఘాలు, చిన్న వ్యాపారులు, సాధారణ ప్రజలకు బ్యాంకింగ్ సేవలు మరింత సులభంగా అందుబాటులోకి తీసుకురావడంలో ఈ నూతన శాఖ కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో సహకార బ్యాంకింగ్ వ్యవస్థను మరింత బలోపేతం చేస్తూ ప్రజలకు నాణ్యమైన ఆర్థిక సేవలు అందించడం ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. సహకార రంగం అభివృద్ధి చెందితే రైతులు ఆర్థికంగా మరింత బలోపేతం అవుతారని, వ్యవసాయ రుణాలు, పొదుపు పథకాలు, ఇతర బ్యాంకింగ్ సేవలు ప్రజలకు సత్వరంగా అందేలా చర్యలు తీసుకుంటున్నామని మంత్రులు వెల్లడించారు. డీసీసీబీ విస్తరణతో స్థానిక ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., సిపి సునీల్ దత్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఖాదర్ బాబా, మద్దులపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ హరినాథ్ బాబు, ఏదులాపురం మున్సిపల్ చైర్పర్సన్ అనిత, వైస్ చైర్మన్ నవీన్, డీసీఓ గంగాధర్, ప్రజా ప్రతినిధులు, రైతులు, సంబంధిత అధికారులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం

**దమ్మపేట మండలంలో విస్తృతంగా పర్యటించిన మంత్రి పొంగులేటి**



- **ఎంపీ రామసహాయం, ఎమ్మెల్యే జారే ఆదినారాయణ**
- **ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభం**



దమ్మపేట, జూన్ 9(మనం న్యూస్): తెలంగాణ రాష్ట్ర రెవిన్యూ గృహని ర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఖమ్మం పార్లమెంట్ సభ్యులు దిశా కమిటీ భద్రాద్రి జిల్లా అధ్యక్షులు రామసహాయం రఘురాం రెడ్డి, అశ్వారావుపేట శాసనసభ్యులు జారె ఆదినారాయణ, జిల్లా కలెక్టర్ అంకిత్, దమ్మపేట అశ్వారావుపేట మండలాల్లో విస్తృత పర్యటన నిర్వహించి పలు అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ముందుగా ఆదివాసీ కొండరెడ్డి గిరిజన గ్రామాలైన పూసుగూడెం, కట్కూరులో ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించి లబ్ధిదారులతో మాట్లాడారు. అనంతరం పట్వారిగూడెం నుండి పాకలగూడెం వరకు నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేసి స్థానిక రైతు వేదికలో రాచూరుపల్లి, మల్లారం గ్రామాలకు చెందిన డబుల్ బెడ్రూమ్ ఇళ్ల లబ్ధిదారులకు అర్హత పత్రాలను అందజేశారు. అలాగే పట్వారిగూడెంలో పూర్తయిన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమాల్లో పాల్గొని లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. నాయుడుపేట మొద్దులగూడెం గ్రామంలో రైతులకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించేందుకు రెడ్యాలపాడు వరకు నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేసి మొద్దులగూడెం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించారు. అనంతరం అశ్వారావుపేట మండల కేంద్రంలో పర్యటించి కొమరంభీం అర్బన్ ఎకో పార్క్ నిర్మాణానికి శంకుస్థా పన చేయడంతో పాటు రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ అయిన యంగ్ ఇండియా ఇంటిగ్రే టెడ్ రెసిడెన్సియల్ స్కూల్ నిర్మాణ పనులను ప్రారంభించారు. అలాగే కొత్త మామిళ్ల వారిగూడెం గ్రామానికి చెందిన డబుల్ బెడ్రూమ్ ఇళ్ల లబ్ధిదారులకు అర్హత పత్రాలు అందజేసి ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ఆత్మకమిటీ చైర్మన్ సుంకవల్లి వీరభద్రరావు మార్కెట్ కమిటీ చైర్మన్ వాసం రాణి, ,అశ్వారావుపేట మున్సిపల్ చైర్మన్ జూపల్లి శశికళ రమేష్, జిల్లా మండల స్థాయి ఉన్నతాధికారులు జిల్లా మండల స్థాయి ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ నాయకులు అభిమానులు అనుబంధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా నమ్మకమే ప్రభుత్వ బలం

## ప్రజాదర్బార్‌లో 24 వేల పైచిలుకు దరఖాస్తులు

## మీడియా సమావేశంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి



ఖమ్మం, జూన్ 9(మనం బ్యూరో): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి ప్రజా సంక్షేమమే పరమావధిగా పనిచేస్తోందని, ప్రజల్లో ప్రభుత్వంపై ఉన్న నమ్మకం, విశ్వాసానికి పాలేరు నియోజకవర్గంలో నిర్వహించిన 'ప్రజా దర్బార్' విజయవంతం కావడమే నిదర్శనమని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం ఖమ్మంలోని ఎస్ ఆర్ కన్వెన్షన్ హాల్లో ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రఘురామ్ రెడ్డితో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక' కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం మూడో సంవత్సరంలోకి అడుగుపెట్టిన సందర్భంగా చేపట్టిన 99 రోజుల ప్రత్యేక కార్యాచరణ జూలై 12 నాటికి పూర్తి కాబోతోందని వెల్లడించారు.

**14 క్లస్టర్లలో వెల్లువెత్తిన జనసందోహం.. 24 వేల పైచిలుకు దరఖాస్తులు**

పాలేరు నియోజకవర్గాన్ని 14 క్లస్టర్లుగా వర్గీకరించి, గత 25 నుండి 30 రోజులుగా 'ప్రజల వద్దకే ప్రభుత్వం' అనే నినాదంతో ప్రజా దర్బార్ నిర్వహించినట్లు మంత్రి తెలిపారు. సోమవారంతో అఖరి విభాగం పూర్తయిందని, ఈ కార్యక్రమాల ద్వారా దాదాపు 25వేల మంది ప్రజలను తాను వ్యక్తిగతంగా కలిసి, వారి సమస్యలను స్వయంగా కళ్లారా చూసి, చెవులారా విన్నానని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రజా దర్బార్లో పట్టణ, గ్రామీణ ప్రాంతాల నుండి మొత్తం 24వేల పైచిలుకు దరఖాస్తులు వచ్చాయన్నారు. అందులో అత్యధికంగా ఇందిరమ్మ ఇళ్ల కోసం 11,000 అర్జీలు, ఆసరా పింఛన్ల కోసం 5,200 అర్జీలు అందినట్లు వివరించారు. అలాగే గృహజ్యోతి పథకం దరఖాస్తులతో పాటు అంతర్గత రహదారులు, మురుగు కాలువలు, తాగునీరు వంటి స్థానిక సమస్యలపై కూడా ప్రజలు పెద్ద ఎత్తున వినతులు సమర్పించారని చెప్పారు.

**భూ భారతి చట్టంతో సాదాబైనామాల సమస్యకు శాశ్వత పరిష్కారం**

గత ప్రభుత్వం ధరణి చట్టం తెచ్చే ముందు సాదాబైనామాల అప్లోడ్కు అవకాశం ఇచ్చి, ఆ తర్వాత చట్టంలో చేర్చకుండా రైతులను గాలికి వదిలేసిందని మంత్రి మండిపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్లో ఉన్న 9,26,000 సాదాబైనామా దరఖాస్తుల సమస్యను పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని మంత్రి మండలి నిబంధనలను సవరించిందని తెలిపారు. గతంలో భూమి అమ్మిన వారి సమ్మతి కూడా కావాలనే నిబంధన ఉండేదని, కానీ రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, అమ్మిన వారి సమ్మతి అవసరం లేకుండా నిబంధనలు మార్చామన్నారు. ఇప్పటికే ఐదున్నర లక్షల దరఖాస్తులను గుర్తించి నోటీసులు ఇచ్చామని, మిగిలిన వాటికి మరో 15 రోజుల్లో నోటీసుల ప్రక్రియ పూర్తవుతుందని, చట్టప్రకారం 30 రోజుల నోటీసు గడువు తర్వాత అర్హులైన అన్ని సాదాబైనామాలను పరిష్కరిస్తామని స్పష్టమైన హామీ ఇచ్చారు.

**ఆధునిక డిజిటల్ సర్వే.. సాగులో ఉన్నవారికే భూమి పట్టాలు**

తరతరాలుగా భూమి సాగులో ఉన్నా పట్టా పుస్తకాలు రావట్లేదని ఆవేదన చెందుతున్న రైతుల కోసం రాష్ట్రవ్యాప్తంగా మొదటి విడతగా ప్రతి జిల్లాలో 70 రెవెన్యూ గ్రామాలను ఎంపిక చేసి ఆధునిక భూ సర్వే నిర్వహిస్తున్నట్లు మంత్రి తెలిపారు. పాలేరు నియోజకవర్గంలోని తిరుమలాయపాలెం (కాకరవాయి) గ్రామంలో ఇప్పటికే ఈ సర్వే విజయవంతంగా పూర్తయిందన్నారు. క్షేత్రస్థాయిలో సాగులో ఉన్న వారికే పట్టా పుస్తకాలు ఇస్తూ, లేని వారివి రద్దు చేసే చట్టాన్ని తెచ్చామని, ప్రజా దర్బార్లో వచ్చిన 4,300 భూ సమస్యల దరఖాస్తుల్లో దాదాపు 2,300 అప్లికేషన్లను ప్రత్యేక కార్యాచరణ ద్వారా త్వరలోనే పరిష్కరించబోతున్నామని స్పష్టం చేశారు. అలాగే ప్రభుత్వ అవసరాల కోసం కొంత భూమి సేకరిస్తే ఆ సర్వే నెంబర్ మొత్తం నిషేధిత జాబితాలో పెట్టే పాత విధానాన్ని సవరించి, పట్టా భూములను ఆ నిషేధిత జాబితా నుంచి తొలగించే ప్రక్రియను దాదాపు పూర్తి చేశామన్నారు.

**నిర్ణీత కాలపరిమితి లోగా గృహాలు, ఇళ్ల స్థలాల కేటాయింపు**

ప్రజా దర్బార్లో వచ్చిన అర్జీలను పరిష్కరించడానికి అధికారుల యంత్రాంగాన్ని విభజించి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు మంత్రి పొంగులేటి తెలిపారు. రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కనీసం 45 రోజుల సమయం పడుతుందన్నారు. ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి అర్హులైన వారి దరఖాస్తులను విడతలవారీగా అందజేస్తామని, అలాగే ఇళ్ల స్థలాల కోసం 1,500 మంది దరఖాస్తు చేసుకున్నారని చెప్పారు. గతంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఇళ్ల స్థలాల కోసం సేకరించిన భూములను గుర్తించాలని అధికారులను ఆదేశించామని, ఎక్కడైతే నివాసానికి యోగ్యమైన ప్రభుత్వ స్థలాలు ఉన్నాయో వాటిని సేకరించి రాబోయే కొద్ది రోజుల్లో ఇళ్ల స్థలాల సమస్యను కూడా పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు.

**ప్రతిపక్షాల బురదజల్లే రాజకీయాలను తిప్పికొట్టిన ఓటర్లు**

కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ ప్రజాప్రతినిధులు, పదేళ్లు దొరపాలన సాగించిన మాజీ మంత్రులు రాజకీయ దురుద్దేశంతో, స్వలాభం కోసం ప్రభుత్వంపై బురదజల్లుతున్నారని, వారి మాటల్లో ఎలాంటి నిజం లేదని మంత్రి కొట్టిపారేశారు. ప్రతిపక్షాలు చేసే విమర్శల్లో ప్రజలకు ఉపయోగపడే న్యాయమైన అంశాలు ఉంటే పంతాలకు పోకుండా సానుకూలంగా తీసుకుని తక్షణమే పరిష్కరిస్తామని చెప్పారు. ప్రజా దర్బార్కు వచ్చిన వారు కేవలం కాంగ్రెస్ శ్రేణులు మాత్రమే కాదని, అన్ని పార్టీలకు చెందిన పేద ప్రజలు ప్రభుత్వంపై పూర్తి నమ్మకంతో వచ్చారని మంత్రి అన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సహకరించకపోయినా ఈ ప్రభుత్వం ఖచ్చితంగా మా సమస్యలు తీరుస్తుందనే అచంచల విశ్వాసం ప్రజల్లో కనిపించిందని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు, ఉప ఎన్నికలు.. ఏవైనా సరే ఓటరు స్పష్టమైన తీర్పుతో ప్రజా ప్రభుత్వాన్ని ఆశీర్వదించడానికి సిద్ధంగా ఉన్నారని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

# ఖమ్మంలో దారుణం బాలికపై లైంగిక దాడి

**భవనంపై నుండి తోసేసిన దుండగుడు**

**ఆలస్యంగా వెలుగులోకి ఘటన**

ఖమ్మం, జూన్ 9(మనం న్యూస్): ఖమ్మంలో జరిగిన దారుణం ఆలస్యంగా వెలుగు చూసింది. 12 ఏళ్ల బాలికపై ఓ దుండగుడు లైంగిక దాడికి పాల్పడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం...ఖమ్మంలోని రాపర్తి నగర్లో ఓ ఆపార్ట్మెంట్ వద్ద ఓ కుటుంబం కాపలా ఉంటోంది. ఈ నెల 6న వారి 12 ఏళ్ల బాలికపై అదే అపార్ట్మెంట్లో ఉంటున్న వ్యక్తి లైంగిక దాడికి పాల్పడ్డాడు. భయపడిన బాలిక కేకలు వేయడంతో అపార్ట్మెంట్పై నుండి కిందికి తోసేశాడు.

దీంతో బాలిక వెన్నుముక, పక్కటెముకలకు తీవ్ర గాయాలయ్యాయి. బాలికను తల్లిదండ్రులు ఓ ప్రయివేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

**పలువురి ఖండన**

బాలికపై లైంగిక దాడిని సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు ఖండించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలికను పరామర్శించి నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర కూడా ఖండించారు. నిందితుడిని కఠినంగా శిక్షించాలని, బాలికకు మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు.

**స్పందించిన మంత్రి పొంగులేటి**

లైంగిక దాడిపై మంత్రి పొంగులేటి స్పందించారు. నిందితుడికి కఠిన శిక్ష పడేలా చేస్తామన్నారు. కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

# ముందు పాపను కాపాడుకుందాం.. నేనున్నా!

**ఖమ్మం ఘోరంపై మంత్రి పొంగులేటి తీవ్ర ఆవేదన**

- **బాధితురాలికి నిమ్స్‌లో అత్యున్నత వైద్యం..**
- **నిందితుడికి కఠిన శిక్ష తప్పదు**

ఖమ్మం, జూన్ 9(మనం న్యూస్): ఖమ్మం నగరంలో బాలికపై జరిగిన అమానుష దాడి, హత్యాయత్నం ఘటనపై తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి ఆవేదన వ్యక్తం చేశారు. సమాజం తలదించుకునేలా ప్రవర్తించిన ఆ కఠినాత్ముడిని చట్టపరంగా అత్యంత కఠినంగా శిక్షిస్తామని ఆయన స్పష్టం చేశారు. తల్లంపాడు గ్రామానికి చెందిన రేగళ్ల రమేశ్ కుమార్తెపై జరిగిన ఈ ఘాతుకం తనను తీవ్రంగా కలచివేసిందని, నిందితుడిపై తక్షణమే కఠిన చట్టాల కింద కేసు నమోదు చేయాలని పోలీసులను ఆదేశించారు.

**బాధితులకు పూర్తి అండ..**

విషయం తెలిసిన వెంటనే మంత్రి పొంగులేటి బాధిత బాలిక తండ్రితో, స్థానిక సర్పంచ్తో ఫోన్ లో మాట్లాడి పరామర్శించారు. 'ముందు మన పాప ప్రాణాలను కాపాడుకుందాం, అధైర్యపడకండి.. నేనున్నా' అని ధైర్యం చెప్పారు. బాలికకు అత్యున్నత వైద్యం అందించడం కోసం తక్షణమే హైదరాబాద్లోని నిమ్స్ ఆసుపత్రికి తరలించాలని సూచించారు. పాప వైద్య ఖర్చులన్నింటినీ తానే భరిస్తానని, బాధిత కుటుంబానికి పూర్తి న్యాయం జరిగేలా చూస్తానని మంత్రి పొంగులేటి భరోసానిచ్చారు.

# బాలికపై లైంగిక ఘటనపై మాజీ ఎంపీ నామ ఆగ్రహం

**నిందితుడికి కఠిన శిక్ష విధించాలని డిమాండ్**



ఖమ్మం, జూన్ 9(మనం న్యూస్): ఖమ్మంలో 12 ఏళ్ల బాలికపై జరిగిన దారుణ ఘటనపై బీఆర్ఎస్ మాజీ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బాలికపై అత్యాచారం చేసి భవనం పై నుంచి తోసేయడం అమానుషమని ఖండించారు. చిన్నారులపై ఇలాంటి పైశాచిక దాడులు సభ్యసమాజం తలదించుకునేలా చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నిందితుడిని వెంటనే అరెస్టు చేసి ఫాస్ట్రాక్ కోర్టులో విచారణ జరిపించి అత్యంత కఠినంగా శిక్షించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని, పోలీస్ యంత్రాంగాన్ని కోరారు. బాధిత కుటుంబానికి అన్ని విధాలా అండగా నిలిచి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. నేరస్తుల గుండెల్లో భయం పుట్టేలా ప్రభుత్వం ఉక్కుపాదం మోపాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు.

# జస్టిస్ బాలకృష్ణన్ కమిషన్ గడువు పొడిగించాలి

**మైనార్టీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ యాకూబ్ పాషా**



ఖమ్మం, జూన్ 9(మనం న్యూస్): దళిత ముస్లింలు, దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పన అంశంపై అధ్యయనం చేస్తున్న జస్టిస్ కె.ఎన్. బాలకృష్ణన్ కమిషన్ పదవీకాలం నేటితో ముగియనున్న నేపథ్యంలో కమిషన్ గడువును మరో ఏడాది పాటు పొడిగించాలని మైనార్టీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ యాకూబ్ పాషా కేంద్ర ప్రభుత్వాన్ని మంగళవారం ఓ ప్రకటనలో కోరారు. సుప్రీంకోర్టు సూచనల మేరకు కేంద్ర ప్రభుత్వం 2022లో జస్టిస్ కె.ఎన్. బాలకృష్ణన్ నేతృత్వంలో రెండేళ్ల కాలపరిమితితో కమిషన్ను ఏర్పాటు చేసినప్పటికీ, ఇప్పటి వరకు సమగ్ర స్థాయిలో అధ్యయనం పూర్తి కాలేదని అన్నారు. దేశవ్యాప్తంగా పర్యటించి దళిత ముస్లింలు, దళిత క్రైస్తవుల సామాజిక, ఆర్థిక పరిస్థితుల కమిషన్ విచారణ జరపాల్సి ఉండగా, ఇప్పటివరకు కేవలం ఏడు రాష్ట్రాల్లో మాత్రమే పర్యటించిందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో కూడా కమిషన్ పర్యటించకపోవడం విచారకరమన్నారు.

ప్రస్తుతం ఢిల్లీలోని కార్యాలయం ద్వారా మాత్రమే వివిధ సంఘాల నుంచి వినతిపత్రాలను స్వీకరిస్తోందని పేర్కొన్నారు. ఈ పరిస్థితుల్లో కమిషన్ నివేదిక సమగ్రత దెబ్బతినే ప్రమాదం ఉందని యాకూబ్ పాషా ఆందోళన వ్యక్తం చేశారు. దళిత ముస్లింలు, దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పిస్తే విద్య, ఉపాధి రంగాల్లో మెరుగైన అవకాశాలు లభిస్తాయని తెలిపారు. అందువల్ల కమిషన్ గడువును పొడిగించి దేశవ్యాప్తంగా విస్తృత పర్యటనలు నిర్వహించి లోతైన అధ్యయనం చేపట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

# తెలంగాణ ఆత్మగౌరవ గీతానికి 'చిరస్మరణీయ' నివాళి

- **ఘట్‌కేసర్‌లో 'అందెశ్రీ స్మృతి వనం' ఏర్పాటు**
- **పనులను పరిశీలించిన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**

హైదరాబాద్,జూన్ 09(మనం న్యూస్): తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని తన కలంతో ప్రజల్లో రగిలించిన మహాకవి, ప్రజా గాయకుడు, రాష్ట్ర గేయ రచయిత అందెశ్రీ స్మ ృతిని చిరస్థాయిగా నిలిపేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ వెల్లడించారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఘట్‌కేసర్ సమీపంలోని ఔటర్ రింగ్ రోడ్ పక్కన ఏర్పాటు చేయనున్న 'అందెశ్రీ స్మ ృతి వనం' స్థలాన్ని మంగళవారం సంక్షేమ శాఖ మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమ చరిత్రలో అందెశ్రీది ప్రత్యేక స్థానం అని,. తన గీతాలు, రచనల ద్వారా తెలంగాణ భావజాలాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. ముఖ్యమంత్రి వఆదేశాల మేరకు అందెశ్రీ సేవలకు గుర్తింపుగా ఈ స్మ ృతి వనాన్ని అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ఎకరం 22 గుంటల భూమిని ఇందుకోసం కేటాయించిందని మంత్రి వెల్లడించారు. ఇది కేవలం ఒక ఉద్యానవనం మాత్రమే కాకుండా, తెలంగాణ సాహిత్య, సాంస్క ృతిక వారసత్వానికి ప్రతీకగా నిలిచే స్మారక క్షేత్రంగా రూపుదిద్దుకోనుందని చెప్పారు. ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేయడం తన బాధ్యతగా భావిస్తున్నట్లు ఆయన తెలిపారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి మాట్లాడుతూ... స్మ ృతి వనం అభివృద్ధి కోసం ఆర్ అండ్ బి శాఖ ఆధ్వర్యంలో సుమారు రూ.4 కోట్ల అంచనా వ్యయంతో ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు. త్వరలోనే టెండర్ల ప్రక్రియ ప్రారంభించి పనులు చేపట్టనున్నట్లు వెల్లడించారు. అభివృద్ధి పనులు పూర్తయిన అనంతరం స్మృతి వనాన్ని నిర్వహణ కోసం హెచ్ఎండీఏకు అప్పగించనున్నట్లు పాలనాధికారి తెలిపారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని గీతంగా మలిచిన మహాకవి అందెశ్రీకి రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఈ గౌరవం, తెలంగాణ సాంస్క ృతిక చరిత్రలో ఒక మైలురాయిగా నిలవనుంది.

# ఆర్యవైశ్య ప్రజాప్రతినిధుల అభినందన

**కార్యక్రమానికి మంత్రి తుమ్మలకు ఆహ్వానం**



దమ్మపేట, జూన్ 09 (మనం న్యూస్) : ఈ నెల 12వ తేదీన హైదరాబాద్ చంపాపేటలో జరిగే రాష్ట్రస్థాయి ఆర్యవైశ్య ప్రజా ప్రతినిధులకు అభినందన సత్కారం ఆర్యవైశ్య నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారానికి రావలసిందిగా రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు,ని ఉమ్మడి ఖమ్మం జిల్లా ఆర్యవైశ్య జిల్లా అధ్యక్షులు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆహ్వానించారు. దమ్మపేట మండలం గండుగులపల్లి గ్రామంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా ఆర్యవైశ్య సంఘ అధ్యక్షులు పసుమర్తి చంద్రరావు, దారా రమేష్‌తో పాటు ఉమ్మడి ఖమ్మం జిల్లా ఆర్యవైశ్య సంఘం నాయకులు, రాష్ట్రస్థాయి నాయకులు మంత్రి తుమ్మలను కలిసిన వారిలో ఉన్నారు.

# బాలికపై లైంగిక దాడికి ఖండన

**నిందితుడికి కఠిన శిక్ష విధించాలి**

**బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలవాలి**

**సీపీఎం ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు**



ఖమ్మం, జూన్ 9(మనం న్యూస్): ఖమ్మం నగరంలో బాలికపై జరిగిన అత్యంత అమానుషమైన లైంగిక దాడి ఘటనను సీపీఎం ఖమ్మం జిల్లా కమిటీ తీవ్రంగా ఖండిస్తోందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు పేర్కొన్నారు. బాధిత బాలికను పరామర్శించిన అనంతరం ఆయన మాట్లాడుతూ బాలికపై లైంగిక దాడికి పాల్పడటమే కాకుండా, ఆధారాలు లేకుండా చేయాలనే దురుద్దేశంతో నాలుగు అంతస్తుల భవనంపై నుంచి కిందకు తోసివేయడం సభ్య సమాజం తలదించుకునే అత్యంత ఘోరమైన నేరమని అన్నారు. మహిళలు, బాలికలపై రోజురోజుకు పెరుగుతున్న లైంగిక దాడులు ఆందోళన కలిగిస్తున్నాయని, చట్టాల పట్ల నేరస్తులకు భయం లేకపోవడమే ఇలాంటి ఘటనలకు కారణమవుతోందని అన్నారు. ప్రభుత్వం మహిళల భద్రత విషయంలో మాటలకే పరిమితం కాకుండా కఠిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనలో నిందితుడిని వెంటనే అరెస్టు చేసి ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా విచారణ జరిపి అత్యంత కఠిన శిక్ష విధించాలని కోరారు. బాధిత బాలికకు మెరుగైన వైద్య చికిత్సను పూర్తిగా ప్రభుత్వ ఖర్చులతో అందించడంతో పాటు, బాధిత కుటుంబానికి తక్షణ ఆర్థిక సహాయం ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యురాలు బుగ్గవీటి సరళ, ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై విక్రమ్, జిల్లా కమిటీ సభ్యులు ఎస్ నవీన్ రెడ్డి, దొంగల తిరుపతిరావు, నగర నాయకులు పత్తిపాక నాగ సులోచన, భాగం అజిత, కూచిపూడి నరేష్, బీబీ ,కుమారి, సుజిత, పావని, అమీనా తదితరులు పాల్గొన్నారు.

## హాస్టళ్ళు,గురుకులాల నిర్వహణలో ఆరోపణలకు, విమర్శలకు ఆస్కారమివ్వొద్దు

**బీసీ సంక్షేమ, చేనేత, జౌళి శాఖాధికారుల సమీక్షలో మంత్రి సవిత**



**తిరుపతి జూన్9 మనం న్యూస్:** రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బీసీ హాస్టళ్లు, గురుకులాల నిర్వహణలో ఆరోపణలకు, విమర్శలకు తావివ్వకుండా నిర్వహించాలని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత ఆదేశించారు. ఆప్కో, లేపాక్షి షో రూమ్ ల్లో అమ్మకాలు పెంచాలని, చేనేతలకు, హస్త కళాకారులకు రోజూ ఉపాధి కల్పించాలనేది కూటమి ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. స్థానిక పద్మావతి గెస్ట్ హౌస్ లో బీసీ సంక్షేమ, ఆప్కో, లేపాక్షి అధికారులతో మంత్రి సవిత మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయా శాఖల వారీగా చేపడుతున్నఅభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ శాఖాధికారులతో మాట్లాడుతూ, కొద్ది రోజుల్లో నూతన విద్యా సంవత్సరం ప్రారంభం కానుందన్నారు. విద్యార్థులు హాస్టళ్లలో చేరేలోగా, తరగతి గదులను, విశ్రాంతి గదులను, మరుగుదొడ్లను, బాత్ రూమ్ లను శుభ్రం చేయాలన్నారు. హాస్టళ్లు, గురుకులాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. హాస్టళ్లు, గురుకుల్లాల్లో చేరే విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలన్నారు. బీసీ బిడ్డలకు ఉన్నత విద్య అందించాలన్నది సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ లక్ష్య సాధనలో భాగంగా బీసీ హాస్టళ్లు, గురుకులాల్లో అత్యధిక మంది విద్యార్థులను చేర్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. బీసీ విద్యార్థులకు ఉన్నత విద్య అందించాలన్న లక్ష్యంలో భాగంగా ఐఐటీ, నీట్ కు ఉచిత శిక్షణ అందజేయనున్నామన్నారు. విశాఖ, టేకులోడు ఎంజేపీ స్కూళ్లలో రెండు ఉచిత నీట్, ఐఐటీ శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నామన్నారు. బాలురకు, బాలికలకు వేర్వేరుగా ఈ శిక్షణా తరగతులు నిర్వహించనున్నామని, వచ్చే విద్యా సంవత్సరం నుంచే ఈ శిక్షణా తరగతులు ప్రారంభించనున్నామని మంత్రి సవిత వెల్లడించారు.

# మహనీయులను మరవవద్దు..

- వీరి పోరాట ఫలితంగానే స్వేచ్ఛగా జీవిస్తున్నాము
- గిరినేతరులు మనతో కలసి జీవించడం ఆనందకరం
- చదువుతో పాటు అన్ని రంగాలలో ముందుండాలి
- ఆదివాసీ గ్రామాల అభివృద్ధికి కట్టుబడి ఉన్నా..
- ఏజెన్సీ చట్టాల అమలు బాధ్యత అధికారులదే..
- కొమరం భీం విగ్రహావిష్కరణ సభలో ఎంఎల్ఏ తెల్లం



**చర్ల, జూన్ 9 (మనం న్యూస్) :** ఆదివాసీల అభ్యున్నతికి కృషి చేసిన బిర్సా ముండా, కొమరం భీం, మల్లు దొర, గంటం దొరల వంటి మహనీయులను ఆదివాసీ సమాజం ఎన్నటికీ మరువవద్దని, వారు చూపిన భాటలోనే పయనించి జాతి సంక్షేమం, ఎదుగుదల కొరకు కృషి చేయాలని భద్రాచలం ఎంఎల్ఏ డాక్టర్ తెల్లం వెంకట్రావు అన్నారు. మండలంలోని కేశవాపురం గ్రామ పంచాయతీ ప్రజల సహకారంతో కేశవాపురం క్రాస్ రోడ్ వద్ద ఏర్పాటు చేసిన గిరిజనుల ఆరాధ్య దైవం కొమరం భీం విగ్రహాన్ని ఎంఎల్ఏ వెంకట్రావు మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కాపుల శారద అధ్యక్షతన జరిగిన సభలో ఆయన ఆదివాసీలను ఉద్దేసించి ప్రసంగించారు. బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా, ఆదివాసీల స్వయం పాలన కోసం పోరాడిన యోధుడు బిర్సా ముండా వర్ధంతి రోజే కొమరం భీం విగ్రహాన్ని ఆవిష్కరించడం సంతోషకరమని పేర్కొన్నారు. దేశానికి స్వాతంత్రం వచ్చినప్పటి తెలంగాణ నిజాం నవాబుల పాలనలో ఉండి దోపిడీకి గురవుతున్న గిరిజనుల పక్షాన నిలిచి జల్, జంగిల్ జమీన్ పేరుతో అడవులను రక్షించి అటవీ సంపద తమకే దక్కుతుందని పోరాటం చేసిన గొప్ప యోధుడు కొమరం భీమ్ అని గుర్తు చేశారు. ఆదివాసీలకు అండగా నిలిచిన ఇటువంటి మహనీయుల పోరాటాలను ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని సూచించారు. ఆదివాసీల పక్షాన పోరాటం చేసిన మహనీయులను మరవవద్దని, వారు చేసిన పోరాట ఫలితంగానే నేడు ఆదివాసి సమాజం స్వేచ్ఛగా జీవిస్తుందన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. అడవులను నమ్ముకొని జీవనం సాగిస్తున్న ఆదివాసీలకే అక్కడి సంపద దక్కుతుందని పోరాటం చేసిన ఫలితంగానే ఆదివాసి సమాజం ఎన్నో ఏళ్లుగా అటవీ ఉత్పత్తులపై ఆధారపడి జీవనం సాగించిన విషయాన్ని గుర్తు చేశారు. ఏజెన్సీ ప్రాంతంలో గిరిజన గిరిజనేతరులు అన్నదమ్ముల వలె కలిసిమెలిసి జీవించడం సంతోషకరమని పేర్కొన్నారు. గిరిజనుల జీవన విధానానికి ఎక్కడ ఆటంకం కలగకుండా వీరు సహకరించడం ఆదర్శనీయమని పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి ఆదివాసికి చేరేలా తాను కృషి చేస్తానని, ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు నిర్మించి గుడిసె లేని గూడేలుగా మర్చే బాధ్యత తీసుకుంటానని ప్రకటించారు. ఆదివాసీ గూడేల అభివృద్ధికి కట్టుబడి ఉన్నానని, పెండింగ్లో ఉన్న అన్ని రకాల పనులకు నిదులు కేటాయించి పూర్తి చేయిస్తానని హామీ ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో సంక్షేమం - అభివృద్ధిని జోడెడ్ల బండిలా సమపాల్లలో ముందుకు తీసుకు వెళ్తానని స్పష్టం చేశారు. చిన్నారులు, యువతీ, యువకులు విద్యపై దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. చదువు కుంటేనే భవిష్యత్ ఉంటుందని, తల్లిదండ్రులు పిల్లల చదువులపై దృష్టి సారించాలని విజ్ఞప్తి చేసారు. ప్రతి ఒక్కరూ విద్యపై దృష్టి సారించి బంగారు భవిష్యత్ కు బాటలు వేసుకోవాలని పిలుపునిచ్చారు ఉద్యోగం లేకుంటే సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ ద్వారా నలుగురికి ఉపాధి కల్పించాలని కోరారు. ప్రభుత్వం ఆదివాసీలను అన్ని రంగాలలో ప్రోత్సహిస్తోందని, రిజర్వేషన్లను సద్వినియోగం చేసుకొని జీవన ప్రమాణం పెంచుకోవాలని కోరారు. యువతీ యువకుల కొరకు ప్రతి గ్రామంలో స్కిల్ డెవలప్మెంట్ కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నామని, వీటి ద్వారా యువతను స్వయం ఉపాధి కల్పించేలా ప్రోత్సహించనున్నట్లు వెల్లడించారు. అవకాశాలను సద్వినియోగపరుచుకోవాలన్నారు. చర్ల సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని అద్భుతంగా తీర్చిదిద్దామని, ఇక్కడి ప్రజలకు ఆధునిక హంగులతో కార్పొరేట్ స్థాయి వైద్యం అందించేలా చర్యలు తీసుకున్నామని వెల్లడించారు. రూ.10 కోట్ల వ్యయంతో 30 పడకల ఆసుపత్రి నిర్మాణం వేగంగా సాగుతోందని ప్రకటించారు. ఏజెన్సీ చట్టాలను అమలు చేసే బాధ్యతను అధికారులతో పాటు ప్రజాప్రతినిధులు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఆదివాసీ విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో జీవిస్పి రాష్ట్ర అధ్యక్షుడు పాయం సత్యనారాయణ, ఏటిఏ రాష్ట్ర అధ్యక్షుడు కల్లూరి జయబాబు, డాక్టర్ అరుణ్ కుమార్, ఏఎస్పి రాష్ట్ర అధ్యక్షుడు సోయం కామరాజు, తుర్రం రామారావు, తుర్రం నాగేశ్వరరావు, సోడి వెంకటేశ్వరరావు, పాయల బుచ్చిబాబు, తాటి రామకృష్ణ, శ్యామల రామారావు, చిడెం హిమగిరిబాబు, కాపుల నాగరాజు, కోరెం సూర్యనారాయణ, తాటి పాపారావు, టిపిసిసి ప్రదాన కార్యదర్శి నల్లపు దుర్గాప్రసాద్, ఆత్మ కమిటీ చైర్మన్ ఇందల బుచ్చిబాబు, డిసిసి ఉపాధ్యక్షులు చీమలమర్రి మురళీకృష్ణ, పోలిన లంకరాజు, ఇందల రమేష్, గుమ్మడి నవభావతి, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

## భక్తులకు మరింత నాణ్యమైన అన్నప్రసాదం అందించడమే టీటీడీ లక్ష్యం



- రైస్ మిల్లర్లతో సమావేశంలో టీటీడీ అదనపు ఈవో
- అన్న ప్రసాదాల నాణ్యతపై భక్తుల ప్రశంసలు

**తిరుమల, జూన్ 09, మనం న్యూస్:** కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వేంకటేశ్వరస్వామివారి దర్శనార్థం తిరుమలకు విచ్చేసే భక్తులకు అత్యుత్తమ నాణ్యతతో కూడిన అన్నప్రసాదాలు అందించడమే టీటీడీ ప్రధాన లక్ష్యమని టీటీడీ అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి తెలియజేశారు. తిరుమలలోని శ్రీ పద్మావతి అతిథి గృహం సుధర్మ సమావేశ మందిరంలో మంగళవారం ఆయన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన రైస్, దాల్ మిల్లర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని నాణ్యమైన ముడి దినుసుల సరఫరాలో ఎలాంటి రాజీ ఉండకూడదని స్పష్టం చేశారు. మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద కేంద్రంలో ఇటీవల భక్తుల నుంచి నిర్వహించిన అభిప్రాయ సేకరణలో దాదాపు 98 శాతానికి పైగా భక్తులు గతంతో పోల్చితే ప్రస్తుతం అందిస్తున్న అన్నప్రసాదం రుచి, నాణ్యత గణనీయంగా మెరుగుపడిందని పేర్కొన్నారని అదనపు ఈవో తెలిపారు.అలాగే సోమవారం రాత్రి రైస్ మిల్లర్లు స్వయంగా అన్నప్రసాద కేంద్రంలో భక్తులతో మాట్లాడి అభిప్రాయాలు తెలుసుకోగా, అధిక శాతం మంది భక్తులు అన్నప్రసాద నాణ్యత, రుచిపై పూర్తి సంతృప్తి వ్యక్తం చేసినట్లు వెల్లడించారు.ఈ సమావేశంలో వేర్ హౌజ్ డిప్యూటీ ఈవో పద్మావతి,ప్రొక్యూర్ మెంట్ విభాగాధిపతి ఉమా శంకర్, క్యాటరింగ్ ప్రత్యేక అధికారి శాస్త్రి, ఇతర అధికారులు, ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణకు చెందిన రైస్, దాల్ మిల్లర్లు పాల్గొన్నారు.

# ఖరీఫ్ సీజన్కు రైతులను సన్నద్ధం చేయాలి

- కలెక్టర్ సుమిత్ కుమార్

**జిుత్తూరు జూన్ 9 మనం న్యూస్:** ఖరీఫ్ సీజన్ సమీపిస్తున్న నేపథ్యంలో రైతులకు సీజన్కు అనుగుణమైన పంటల సాగుపై విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టర్ ఛాంబర్ నందు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ జిల్లా డివిజన్ ,మండల స్థాయి వ్యవసాయ అధికారులతో రైతులకు వ్యవసాయ శాఖ3 అందిస్తున్న సేవలు, సంక్షేమ కార్యక్రమాల పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని రైతులకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సేవలు, సంక్షేమ పథకాలు సమర్థవంతంగా చేరేలా చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. ఖరీఫ్ సీజన్లో సాగు చేయదగిన పంటలు, ఆధునిక సాగు విధానాలపై రైతులకు విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు.రైతు సేవా కేంద్రాల (ఆర్ఎస్కేలు) పనితీరును మరింత మెరుగుపరచి రైతులకు నాణ్యమైనసేవలుఅందించాలన్నారు రైతు యాప్ వినియోగంపై రైతులకు అవగాహన కల్పించి, యాప్ డౌన్లోడ్లు లాగిన్ల సంఖ్య పెరిగేలాచర్యలుతీసుకోవాలన్నారు.ఎరువుల పంపిణీ ప్రక్రియపై రైతులకు పూర్తి స్థాయిలోఅవగాహనకల్పించాలన్నారు.అన్నదాత సుఖీభవ పోర్టల్లో ఉన్న లోపాలు, పెండింగ్ కేసులను పరిశీలించి వెంటనే సరిదిద్దాలన్నారు. అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించిన పెండింగ్ దరఖాస్తులను కారణాల వారీగా విశ్లేషించి ఆర్ఎస్కే వారీగా సమగ్ర నివేదిక అందించాలన్నారు.ఈ-క్రాప్ మరియు ఇతర రైతు డేటా నమోదుల్లో ఎలాంటి పొరపాట్లు లేకుండా ఖచ్చితమైన సమాచారాన్ని నమోదు చేయాలని తెలిపారు. రైతుల వివరాలను మండల వ్యవసాయ అధికారులు గ్రామ వ్యవసాయ సహాయకులు పూర్తిగా ధృవీకరించాలన్నారు.రైతులకు సాయిల్ హెల్త్



కార్డుల ప్రాముఖ్యతను వివరించి వాటి ప్రయోజనాలను అందుబాటులోకి తీసుకురావాలి. ప్రకృతి వ్యవసాయం పట్ల రైతుల్లో అవగాహన పెంపొందించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలన్నారు.వాతావరణ పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ రైతులకు ఎప్పటికప్పుడు సూచనలు అందించాలని సూచించారు.

# పెట్రోల్, డీజిల్, సిఎన్జీ, వంటగ్యాస్ ధరలు తగ్గించాలి


- వామపక్ష పార్టీల రాస్తారోకో



**తిరుపతి జూన్9 మనం న్యూస్:** కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు పెట్రోల్, డీజిల్, సిఎన్జీ, వంటగ్యాస్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ వామపక్ష పార్టీల రాష్ట్రవ్యాప్త పిలుపు మేరకు నేడు తిరుపతిలో రాస్తారోకో నిర్వహించారు. ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహం నుంచి సిపిఎం, సిపిఐ, సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ, సుసి పార్టీల ఆధ్వర్యంలో ప్రదర్శన నిర్వహించి పూర్ణకుంభం సర్కిల్ వద్దకు చేరుకుని రాస్తారోకో చేపట్టారు.ఈ కార్యక్రమానికి సిపిఎం నగర కార్యదర్శి కే. వేణుగోపాల్, సిపిఐ నగర కార్యదర్శి జె. విశ్వనాథ్ అధ్యక్షత వహించారు.అనంతరం జరిగిన సభలో సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డి. రామానాయుడు, సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నగర కార్యదర్శి వెంకటరత్నం, సుసి పార్టీ కార్యదర్శి హరీష్ ప్రసంగించారు.వక్తలు మాట్లాడుతూ, 2014లో కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కార్పొరేట్ అనుకూల విధానాలను అమలు చేస్తూ ప్రజలపై భారాలు మోపుతోందని విమర్శించారు. ధరల నియంత్రణ, ఉపాధి కల్పన, ప్రజా సంక్షేమం పేరుతో ఇచ్చిన హామీలకు విరుద్ధంగా నేడు సామాన్య ప్రజల జీవనం మరింత భారంగా మారిందని అన్నారు.2014లో లీటర్ పెట్రోల్ ధర సుమారు రూ.62 నుంచి రూ.70 మధ్య, డీజిల్ ధర సుమారు రూ.55 ప్రాంతంలో ఉండేదని గుర్తుచేశారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్లో పెట్రోల్ ధర సుమారు రూ.118, డీజిల్ ధర రూ.105కు చేరుకుందని తెలిపారు. అలాగే ఒకప్పుడు రూ.400-450 మధ్య లభించిన గృహ వినియోగ వంటగ్యాస్ సిలిండర్ ధర నేడు రూ.900 దాటిపోయిందని పేర్కొన్నారు.

## శ్రీకాళహస్తిలో 'వెన్నుపోటు' పై సమరశంఖం

**నిరసనలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కుమార్తె, వైఎస్సార్ సిపి శ్రేణులు**



**శ్రీకాళహస్తి జూన్ 9 మనం న్యూస్:** శ్రీకాళహస్తి పట్టణ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్లు నిరసన మరియు ముఖాముఖి కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి కుమార్తె కాటంరెడ్డి పవిత్ర రెడ్డి బియ్యపు ,వైఎస్ఆర్సిపి నాయకులు,కార్యకర్తలతో కలిసి పాల్గొన్నారు. ముందుగా చంద్రబాబు రెండేళ్ల పాలనకు నిరసన తెలిపి నల్ల బెలూన్లు ఎగురవేసిన పవిత్ర రెడ్డి, వైఎస్ఆర్సిపి శ్రేణులు.అలాగే ఈ రెండేళ్ల లో తెలుగుదేశం పార్టీ చేసిన దాడులను గతంలో జగనన్న చేసిన అభివృద్ధి కార్యక్రమాలను ఫోటో ఎగ్జిబిషన్ ద్వారా వీక్షించారు.ఈ సందర్భంగా పవిత్ర రెడ్డి మాట్లాడుతూ,చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్లు కార్యక్రమం ద్వారా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు, అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలు ఎదుర్కొంటున్న వాస్తవ పరిస్థితులను ప్రజల ముందుకు తీసుకువస్తున్నాం అన్నారు.

## వృద్ధురాలిని వృద్ధాశ్రమంలో ఆశ్రయం కల్పించిన కలెక్టర్

**తిరుపతి జూన్ 9 మనం న్యూస్:** కర్ణాటక రాష్ట్రానికి చెందిన 75 సం. ల వయసు గల శారదమ్మ దిక్కు తోచని స్థితిలో మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఆవరణలో జిల్లా కలెక్టర్ డా.ఎస్.వేంకటేశ్వర్ ను కలసి ఆశ్రయం కల్పించాలని కోరగా వెనువెంటనే మానవతా దృక్పథంతో స్పందించి జిల్లా కలెక్టర్ ఆమెకు ఆశ్రయం కల్పించారు.కర్ణాటక రాష్ట్రానికి చెందిన పి.శారదమ్మ తన భర్తతో కలసి బళ్ళారి పట్టణంలోని ఆలయ పరిసరాల్లో చిన్నపాటి పనులు చేసుకుంటూ జీవనం గడుపుకునే వారు.వృద్ధ దంపతులకు ఇద్దరు పిల్లలు ఉన్నారు.శారదమ్మ తన భర్త మరణించిన అనంతరం జీవనోపాధి లేక ఒంటరిగా మిగిలిపోయింది.దిక్కు తోచని స్థితిలో శ్రీ వేంకటేశ్వర స్వామే దిక్కని తలచి తిరుపతి పట్టణం చేరుకుంది. వృద్ధురాలి దయనీయ స్థితిని చూసిన పలువురు స్థానికులు జిల్లా కలెక్టర్ ను కలసి తన పరిస్థితిని వివరించాలని సూచించారు. ఈ నేపథ్యంలో మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణలో జిల్లా కలెక్టర్ ను కలిసిన వృద్ధురాలు తన భర్త మరణానంతరం తన ఇద్దరు పిల్లలు తనకు ఆశ్రయం కల్పించలేదని, దుర్భర పరిస్థితిలో తిరుపతి చేరుకున్నానని తెలిపింది. అనంతరం తిరుపతిలోని పలు వృద్ధాశ్రమాలను ఆశ్రయించగా తనకు ఆశ్రయం కల్పించడానికి వృద్ధాశ్రమాలు తిరస్కరించాయని తెలిపారు.దిక్కు లేని వాడికి దేవుడే దిక్కని శ్రీ వేంకటేశ్వర స్వామిని నమ్మి వచ్చానని, పేద ప్రజల కష్టానికి చలించే జిల్లా కలెక్టర్ ఉన్నారని స్థానిక ప్రజల సూచనలతో తిరుపతి జిల్లా సచివాలయానికి చేరుకున్నానని, తనకు ఆశ్రయం కల్పించాలని జిల్లా



కలెక్టర్ కు ఆమె విన్నవించుకున్నది. వృద్ధురాలి నిస్సహాయ పరిస్థితి, కన్నీటిని చూసిన జిల్లా కలెక్టర్ చలించి మానవతా దృక్పథంతో సహాయక చర్యలకు పూనుకున్నారు. వెంటనే బీ.టి.ఆర్. కాలనీలో ఉన్న రాష్ట్రీయ సేవా సమితి ప్రతినిధులను సంప్రదించి వృద్ధురాలిని వృద్ధాశ్రమంలో చేర్పించి ఆశ్రయం, వైద్యం, అవసరమైన సంరక్షణ చర్యలు చేపట్టాలని దివ్యాంగులు, ట్రాన్స్జెండర్లు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అధికారిని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలతో తక్షణమే వృద్ధురాలిని రాష్ట్రీయ సేవా సమితి వృద్ధాశ్రమంలో చేర్పించే ఏర్పాట్లు చేశారు. వృద్ధురాలు తన పరిస్థితికి చలించి తనకు ఆశ్రయం కల్పించిన జిల్లా కలెక్టర్ కు, అధికారులకు ధన్యవాదాలు తెలిపింది.వృద్ధులు నిరాశ్రయుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు జిల్లా యంత్రాంగం కట్టుబడి ఉందని ఈ సందర్భంగా అధికారులు తెలిపారు.

# రోడ్డు భద్రతపై ప్రజల్లో అవగాహన పెంపొందించడమే లక్ష్యం

- చిత్తూరు మీడియా మిత్రులకు హెల్మెట్ ల పంపిణి చేసిన ఎస్పీ తుషార్ డూడి



**చిత్తూరు జూన్ 9 మనం న్యూస్:** చిత్తూరు జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో రోడ్డు ప్రమాదాల నివారణ, ద్విచక్ర వాహనదారుల్లో హెల్మెట్ వినియోగంపై అవగాహన పెంపొందించి,రోడ్డు భద్రతా నిబంధనల పట్ల బాధ్యతాయుతమైన వైఖరిని పెంపొందించేందుకు అమలు చేస్తున్న సురక్షిత చిత్తూరు - మీ భద్రత మా బాధ్యత కార్యక్రమంలో భాగంగా నేడు పలు కార్యక్రమాలు నిర్వహించారు.చిత్తూరుపట్టణంలోని ప్రింట్,ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులకు జిల్లా ఎస్పీ తుషార్ డూడి, చిత్తూరుఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్, నాన్ కేడర్ ఎస్పీ ఆపరేషన్స్ ఎస్.ఆర్.రాజశేఖర రాజు,చుడ ఛైర్పర్సన్ కటారి హేమలత, ఇతర పోలీసు అధికారులతో కలిసి హెల్మెట్లను పంపిణీ చేశారు. రోడ్డు భద్రతపై అవగాహన కల్పించడంలో మీడియా కీలక పాత్ర పోషిస్తోందని, ప్రజల్లో సానుకూల మార్పు తీసుకురావడంలో మీడియా సహకారం ఎంతో అవసరమని ఈ సందర్భంగా పేర్కొన్నారు.అనంతరం చిత్తూరు నగరంలోని గాంధీ కూడలి నుండి విజయం ఇంజనీరింగ్ కళాశాల వరకు సుమారు 200 మంది పాల్గొన్న భారీ హెల్మెట్ అవగాహన బైక్ ర్యాలీని జిల్లా ఎస్పీ తుషార్ డూడి జెండా ఊపి ప్రారంభించారు.ఈ ర్యాలీలో పోలీసులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, మీడియా ప్రతినిధులు, యువత పాల్గొన్నారు.ర్యాలీ అనంతరం విజయం ఇంజనీరింగ్ కళాశాల ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన హెల్మెట్ పెట్టు - బహుమతి పట్టు కార్యక్రమం విజేతల బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ తుషార్ డూడి మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు అనేక కుటుంబాల్లో విషాదాన్ని నింపుతున్నాయి. ప్రతి సంవత్సరం రోడ్డు ప్రమాదాల కారణంగా వేలాది మంది ప్రాణాలు కోల్పోతుండగా, వారిలో అధిక శాతం మంది ద్విచక్ర వాహనదారులే. ప్రమాదం జరిగిన క్షణాల్లో హెల్మెట్ ధరించి ఉంటే అనేక ప్రాణాలు రక్షించబడే అవకాశముంది. హెల్మెట్ అనేది కేవలం ట్రాఫిక్ నిబంధన మాత్రమే కాదు, ప్రాణాలను కాపాడే రక్షణ కవచం. ప్రజలు జరిమానాల భయంతో కాకుండా తమ కుటుంబ సభ్యుల భద్రత, తమ ప్రాణాల విలువను గుర్తించి స్వచ్ఛందంగా హెల్మెట్ ధరించేఅలవాటుపెంపొందించుకోవాలి.చిత్తూరు జిల్లా పోలీసు శాఖ 'సురక్షిత చిత్తూరు - మీ భద్రత మా బాధ్యత' అనే లక్ష్యంతో రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపడుతోంది. అందులో భాగంగానే 'హెల్మెట్ పెట్టు - బహుమతులు పట్టు' వంటి వినూత్న కార్యక్రమాన్ని ప్రారంభించాం. శిక్షల కంటే ప్రోత్సాహం ద్వారా ప్రజల్లో మంచి మార్పు తీసుకురావచ్చనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నాము. ఈ కార్యక్రమానికి ప్రజల నుండి లభిస్తున్న స్పందన ఎంతో సంతోషకరం. హెల్మెట్ ధరించి ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తున్న వారిని గుర్తించి ప్రోత్సహించడం ద్వారా మరింత మంది బాధ్యతాయుతమైన వాహనదారులుగా మారుతారని విశ్వసిస్తున్నాము.ప్రతి ద్విచక్ర వాహనదారుడు తాను మాత్రమే కాకుండా వెనుక కూర్చున్న వ్యక్తి కూడా తప్పనిసరిగా హెల్మెట్ ధరించేలా చూసుకోవాలి. అతివేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్, మద్యం సేవించి వాహనాలు నడపడం వంటి ప్రమాదకర అలవాట్లను పూర్తిగా నివారించాలి. రోడ్డు భద్రత అనేది పోలీసుల బాధ్యత మాత్రమే కాదు, ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత కూడా. ప్రజల సహకారంతో చిత్తూరు జిల్లాను ప్రమాద రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు పోలీసు శాఖ నిరంతరం కృషి చేస్తుంది. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తూ తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా కాపాడాలని కోరుతున్నాను అని తెలిపారు.నాన్-కేడర్ ఎస్పీఎస్.ఆర్. రాజశేఖర్ రాజు మాట్లాడుతూట్రాఫిక్ నిబంధనలు పాటించడం ప్రతి పౌరుడి బాధ్యత. హెల్మెట్ వినియోగం, అతివేగ నియంత్రణ, మద్యం సేవించి వాహనాలు నడపకపోవడం వంటి అంశాలపై ప్రజలు ప్రత్యేక శ్రద్ధ వహిస్తే ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చు అని అన్నారు.ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ మాట్లాడుతూ చిత్తూరు జిల్లా పోలీసు శాఖ చేపడుతున్న 'సురక్షిత చిత్తూరు - మీ భద్రత మా బాధ్యత' కార్యక్రమం ప్రజల్లో రోడ్డు భద్రతపై చైతన్యం కలిగిస్తోంది. 'హెల్మెట్ పెట్టు బహుమతులు పట్టు' వంటి వినూత్న కార్యక్రమాలు ప్రజల్లో మంచి అలవాట్లను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయి అని పేర్కొన్నారు.ఈ సందర్భంగా హెల్మెట్ పెట్టు - బహుమతులు పట్టు కార్యక్రమానికి దాతలుగా వ్యవహరించిన విజయం విద్యా సంస్థల చైర్మన్ తేజోమూర్తికి జిల్లా ఎస్పీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏ.ఆర్. అడిషనల్ ఎస్పీ ఎం.దేవదాస్, చిత్తూరు డిఎస్పీ జె.వెంకటనారాయణ, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ నిత్యబాబు, ఎస్.బి. ఇన్స్పెక్టర్ మురళీమోహన్, 2 టౌన్ ఇన్స్పెక్టర్ నెట్టికంటయ్య, జి.డి.నెల్లూరు ఇన్స్పెక్టర్ ప్రసాద్, చిత్తూరు ఈస్ట్ సర్కిల్ ఇన్స్పెక్టర్ రామచంద్ర,మాజీ యంఎల్సీ దొరబాబు, ట్రాఫిక్ విభాగం సిబ్బంది, విజయం విద్యా సంస్థల ప్రతినిధులు, మీడియా ప్రతినిధులు, విద్యార్థులు , ప్రజలు పాల్గొన్నారు.



# హర్మూజ్ వద్ద కూలిన అమెరికా అపాచీ హెలికాప్టర్

**వాషింగ్టన్, జూన్ 9:** హర్మూజ్ జలసంధి సమీపంలో అమెరికాకు చెందిన అపాచీ హెలికాప్టర్ కుప్పకూలింది. ఈ ప్రమాదంలో హెలికాప్టర్ ధ్వంసమవగా.. ఇద్దరు పైలట్లు సురక్షితంగా బయటపడినట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వెల్లడించారు. హర్మూజ్‌పై ఇరాన్ విధించిన దిగ్బంధనాన్ని ఛేదించే ప్రయత్నాల్లో భాగంగా, యూఎస్ సెంట్రల్ కమాండ్ అపాచీ హెలికాప్టర్లతో పాటు ఫైటర్ జెట్లు, డ్రోన్లతో పహారా కాస్తోన్న సమయంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ప్రమాదం జరిగిన సమయం లోనే రీపర్ డ్రోన్లను కూల్చివేసినట్లు ఇరాన్ ప్రకటించడంతో.. అపాచీ హెలికాప్టర్ ఇరాన్ కాల్పుల్లో కూలిపోయిందా లేదా ఏదైనా సాంకేతిక లోపం తలెత్తిందా అనే విషయంపై దర్యాప్తు చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. ఫిబ్రవరిలో అమెరికా, ఇరాన్ల మధ్య ఘర్షణలు ప్రారంభమైన ప్పటినుంచి యూఎస్ సైనిక హెలికాప్టర్ కూలిపోవడం ఇదే మొదటిసారి. అమెరికా-ఇజ్రాయెల్ సంయుక్త దాడుల వల్ల ఇరాన్ సైన్యం పూర్తిగా నాశనమైందని ట్రంప్ పేర్కొన్నారు. ప్రస్తుతం టెహ్రాన్ వద్ద క్షిపణి సామర్థ్యం 21 శాతానికి మాత్రమే పరిమితమైంద న్నారు. మళ్లీ దాడులు ప్రారంభిస్తే ఇరాన్ దురాక్రమణను ఎదుర్కోవడానికి అమెరికా సైన్యం సిద్ధంగా ఉందని హెచ్చరించారు. మరోవైపు ఈ యుద్ధంలో అగ్రరాజ్యం సైతం భారీ నష్టాన్ని చవిచూసిందని యూఎస్ సెంట్రల్ కమాండ్ ప్రకటించింది. ఇరాన్ దాడుల్లో ఇప్పటివరకు 13 మంది అమెరికన్ సైనికులు మరణించగా.. 399 మంది గాయపడ్డారని వెల్లడించింది. అమెరికాకు చెందిన పలు యుద్ధ విమానాలు కూడా కూలిపోయాయని తెలిపింది.

# ట్రంప్‌నకు బీబీ.. ప్రపంచానికి నెతన్యాహు..

## ఇజ్రాయెల్ ప్రధాని పేరు వెనుక కథ ఇదీ!



**వాషింగ్టన్, జూన్ 9:** ఇరాన్‌తో దౌత్యపరమైన శాంతి ఒప్పందం కుదుర్చుకోవడానికి ఓ వైపు అమెరికా ప్రయత్నాలు చేస్తున్న వేళ.. లెబనాన్, బీరుట్లపై ఇజ్రాయెల్ దాడులకు పాల్పడడం అగ్రరాజ్యానికి కోపం తెప్పించింది. ఈ దాడుల వల్ల శాంతి చర్చలకు ఆటంకం కలుగుతోందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ''బీబీ, చాలా జాగ్రత్తగా ఉండాలి.. లేకపోతే నువ్వు ఒంటరిగా మిగిలిపోతావు' అంటూ ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుని ఉద్దేశించి హెచ్చరించారు. ఇరాన్‌పై ఇజ్రాయెల్ మళ్లీ దాడులకు దిగితే, అమెరికా నుంచి ఆశించిన సహకారం ఉండపోవచ్చని సంకేతమిచ్చారు. ఈ క్రమంలో నెతన్యాహుని 'బీబీ' అని సంబోధించడం ఆసక్తిగా మారింది. దీంతో నెతన్యాహుని బీబీ అని ఎందుకు సంబోధించారు? అంటూ నెటిజన్లు తెగ ఆరా తీస్తున్నారు.

**బీబీ ముద్దు పేరు..**

బెంజమిన్ నెతన్యాహు 1949లో జన్మించారు. చిన్నతనం నుంచే ఆయన కుటుంబ సభ్యులు, స్నేహితులు ముద్దుగా బీబీ అని పిలుచుకునేవారు. చిన్నప్పటి నుంచి అందరూ అలా పిలవడంతో ఆ పేరు స్థిరపడిపోయింది. ఇజ్రాయెల్లో ఎంతటి పెద్ద నాయకులకైనా, ప్రముఖులకైనా చిన్ననాటి ముద్దుపేర్లను అధికారికంగా, రాజకీయాల్లో కూడా వాడడం సాధారణం. పైగా హీబ్రూ భాషలో పేర్లను చిన్నవిగా చేయడానికి, ప్రేమగా పిలవడానికి ఒకే అక్షరాన్ని రెండుసార్లు పలకడం, చేర్చడం ఒక అలవాటు. అలా బెంజమిన్‌లో 'బి' కాస్తా బీబీగా మారింది. నెతన్యాహు ప్రధాని అయ్యాక కూడా స్థానిక పత్రికలు, టీవీలు, ప్రజలు ఆయనను 'బీబీ' అని సంబోధించడం విశేషం.

**అలా నెతన్యాహు ఇంటి పేరైంది**

ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు పూర్తి పేరు వెనుకా ఆసక్తికర కథ దాగుంది. వాస్తవానికి బెంజమిన్ కుటుంబం పేరు మిలీకోవ్స్కీ. తాత నాథన్ మిలీకోవ్స్కీ పోలాండ్ నుంచి తన కుటుంబంతో కలిసి అప్పటి పాలస్తీనా (ప్రస్తుత ఇజ్రాయెల్) ప్రాంతానికి వలస వచ్చారు. అలా వచ్చిన యూదులు తమ యూరోపియన్ పేర్లను పక్కన పెట్టి, తమ సంస్కృతికి అద్దం పట్టేలా హీబ్రూ పేర్లను మార్చుకునేవారు. ఈ క్రమంలోనే నాథన్ మిలీకోవ్స్కీ తన వ్యాసాలు రాయడానికి నెతన్యాహు అనే కలం పేరు ఎంచుకున్నారు. తర్వాతి కాలంలో అదే వారి కుటుంబం పేరుగా మారింది. అంతేకాదు నెతన్యాహు అంటే హీబ్రూ భాషలో 'దేవుడు ఇచ్చిన కానుక' లేదా 'భగవంతుడి ప్రసాదం' అని అర్థం. ఇక బెంజమిన్ అనేది బైబిల్ (పాత నిబంధన) ప్రకారం.. జాకోబ్ 12వ, చివరి కుమారుడి పేరు. అలా బెంజమిన్ నెతన్యాహు అయ్యారు. బెంజమిన్ తండ్రి బెంజియన్ మైలెకోవ్స్కీ కూడా తన పేరును బెంజియన్ నెతన్యాహుగా మార్చుకున్నారు. ఇజ్రాయెల్ ఆవిర్భావానికి కృషి చేసిన నేతల్లో ఈయన ఒకరు.

## 750 డాలర్లు చెల్లిస్తే..
## 10 రోజుల్లోనే అమెరికా వీసా ఇంటర్వ్యూ



**వాషింగ్టన్, జూన్ 9:** అమెరికా వీసా ఇంటర్వ్యూల కోసం సుదీర్ఘ నిరీక్షణలకు చెక్ పెట్టేలా ట్రంప్ యంత్రాంగం కొత్త విధానాన్ని తీసుకురాబోతోంది. 'ప్రీమియం సర్వీసు' పేరిట ప్రత్యేక పైలట్ ప్రోగ్రామ్ను ప్రారంభించనుంది. దీని కింద 750 డాలర్లను చెల్లించిన వారికి వీసా ఇంటర్వ్యూను వేగంగా ఏర్పాటుచేయనున్నారు. బిజినెస్, టూరిస్ట్ వీసాలకు ఈ ఆప్షన్‌ను అందించనున్నారు. ఈ మేరకు తాజాగా అగ్రరాజ్య విదేశాంగశాఖ తమ ఫెడరల్ రిజిస్టర్‌లో నోటీసును ప్రచురించింది.ప్రస్తుతం బిజినెస్, టూరిస్ట్ వీసాలకు దరఖాస్తుదారులు ప్రాసెసింగ్ ఫీజు రూపంలో 185 డాలర్లను చెల్లిస్తున్నారు. దీనికి అదనంగా 750 డాలర్లు చెల్లిస్తే.. ఎంపిక చేసిన అమెరికా దౌత్య, రాయబార కార్యాలయాల్లో దరఖాస్తుదారులు పేమెంట్ చేసిన 10 రోజుల్లోపే ఇంటర్వ్యూను షెడ్యూల్ చేసుకునే వీలు లభించనుంది. ఈ పైలట్ ప్రోగ్రామ్‌ను జులై 1 నుంచి డిసెంబరు 31 వరకు అందుబాటులో ఉంచనున్నట్లు సదరు నోటీసుల్లో పేర్కొన్నారు.

ప్రస్తుతానికి ఈ పైలట్ ప్రోగ్రామ్ గురించి ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. అయితే, ఏయే ఎంబసీ, కాన్సులేట్లలో ఈ ఆఫర్ను అందుబాటులోకి తీసుకొస్తారనే వివరాలను జులై 1 కంటే ముందే ప్రకటించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఆరు నెలల కాలానికి ఈ ప్రీమియం సర్వీసులను రూపొందించినా.. పరిస్థితులను బట్టి మరింత కాలం పొడిగించే అవకాశాలున్నట్లు తెలుస్తోంది.

ట్రంప్‌అధికారంలోకి వచ్చిన తర్వాత అమెరికా వీసా విధానాలను అత్యంత కఠినతరం చేసిన సంగతి తెలిసిందే. వలసదారుల రాకను అరికట్టేందుకు భారీ వీసా ప్రాసెసింగ్ ఫీజులు, బాండ్లు, సోషల్ మీడియా వెట్టింగ్ వంటి నిబంధనలను అమలు చేస్తున్నారు. దీంతో ప్రపంచవ్యాప్తంగా అమెరికా వీసా ప్రాసెసింగ్ ప్రక్రియ ఆలస్యమవుతోంది. కొన్ని దేశాల్లో వీసా ఇంటర్వ్యూల కోసం దరఖాస్తుదారులు నెలలతరబడి ఎదురుచూడాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలోనే దరఖాస్తుదారులకు కొంత ఊరట కల్పించేలా తాజాగా 'ప్రీమియం సర్వీసు'లను అందుబాటులోకి తీసుకొస్తున్నారు. అయితే, ఈ ప్రత్యేక ఆఫర్ కోసం అదనపు రుసుములు చెల్లించినా.. వీసా వస్తుందన్న గ్యారెంటీ ఉండదు. ఇది కేవలం వేగంగా ఇంటర్వ్యూను షెడ్యూల్ చేసుకునేందుకు మాత్రమే వీలు కల్పిస్తుంది.

## హెచ్-1బీపై కోర్టు తీర్పు స్వాగతించదగినదే..




**వాషింగ్టన్, జూన్ 9:** హెచ్-1బీ వీసా ఫీజుపై ట్రంప్ నిర్ణయాన్ని కొట్టివేస్తూ.. ఫెడరల్ కోర్టు ఇచ్చిన తీర్పుపై అమెరికాలోని ప్రవాస భారతీయ సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి. వీసా ఫీజును లక్ష డాలర్లకు పెంచుతూ అధ్యక్షుడు ట్రంప్ తీసుకున్న నిర్ణయం చట్టవిరుద్ధమని కోర్టు స్పష్టం చేసింది.

ఫౌండేషన్ ఫర్ ఇండియా అండ్ ఇండియన్ డయాస్పోరా స్టడీస్‌కి చెందిన స్ట్రాటజీ చీఫ్ ఖండేరావ్ కంద్ దీనిపై మీడియాతో మాట్లాడారు. హెచ్-1బీ వీసా రుసుముపై ఫెడరల్ కోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నట్లు తెలిపారు. ఉద్యోగ ఆధారిత వలసల వ్యవస్థపై స్థిరత్వాన్ని ఇది తిరిగి తీసుకొస్తుందన్నారు. అమెరికాలో సాంకేతిక, ఆరోగ్య సంరక్షణ, అధునాతన తయారీ రంగాల వృద్ధికి ప్రపంచంలోని ప్రతిభావంతులు అవసరమన్నారు. విధానపరమైన మార్పులు, చట్టబద్ధమైన అధికారం, ఆర్థిక గణాంకాలపై ఆధారపడి ఉండాలని అభిప్రాయపడ్డారు. ఇండియాస్పోరా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సంజీవ్ జోషిపురా కోర్టు తీర్పుపై హర్షాతిరేకాలు తెలియజేశారు. అయితే, ట్రంప్ యంత్రాంగం ఈ విషయాన్ని ఇంతటితో ముగుస్తుందా.. లేదా అనే దానిపై అనుమానం వ్యక్తంచేశారు. ట్రంప్ యంత్రాంగానికి, న్యాయవ్యవస్థలకు మధ్య ఇటీవల జరిగిన పలు వివాదాలను ఆయన ప్రస్తావించారు. చట్టానికి విరుద్ధంగా.. విధానపరమైన అంశాలతో అమెరికా ప్రభుత్వం హెచ్-1బీ వీసాదారులకు మరిన్ని అడ్డంకులు సృష్టించవచ్చని హెచ్చరించారు.

హెచ్-1బీ వీసా ఫీజును లక్ష డాలర్లకు పెంచుతూ గతేడాది సెప్టెంబరులో ట్రంప్ తీసుకొన్న నిర్ణయం సంచలనం సృష్టించింది. ట్రంప్ నిర్ణయాన్ని యూఎస్ ఛాంబర్ ఆఫ్ కామర్స్‌ సహా పలు డెమోక్రటిక్ రాష్ట్రాలు కోర్టులో సవాల్ చేశాయి. ఈక్రమంలో బోస్టన్లోని ఫెడరల్ కోర్టు ట్రంప్ నిర్ణయం చట్టవిరుద్ధమైనదని ప్రకటించింది. అమెరికా కాంగ్రెస్ ఆమోదం లేకుండా అధ్యక్షుడు మాత్రమే దీనిపై నిర్ణయం తీసుకోలేరని స్పష్టం చేసింది. అయితే, ఈ తీర్పుపై ట్రంప్ యంత్రాంగం అప్పీల్ చేయనున్నట్లు తెలుస్తోంది.

## తమిళనాడులో మహిళల రక్షణ కోసం..
# 'సింగప్పెన్' టాస్క్ ఫోర్స్'



**చెన్నై, జూన్ 9:** తమిళనాడు సీఎం విజయ్ కీలక నిర్ణయం తీసుకున్నారు. మహిళల భద్రత కోసం రాష్ట్రంలో 'సింగప్పెన్ స్పెషల్ టాస్క్ ఫోర్స్' అనే ప్రత్యేక మహిళా పోలీస్ విభాగాన్ని ప్రారంభించారు. మహిళలు, పిల్లలపై నేరాలను ఆపేందుకు, ఏదైనా సమస్య వచ్చినప్పుడు వెంటనే స్పందించేందుకు వీలుగా ఈ బృందాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ విభాగానికి రూ. 354 కోట్లు కేటాయిస్తున్నట్లు వెల్లడించారు. సింగప్పెన్ దళం చిహ్నాన్ని ఆవిష్కరించి.. ఆ బృందాల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక గస్తీ వాహనాలను ప్రారంభించారు. ఓ వాహనాన్ని ఆయనే స్వయంగా నడిపారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ మహిళా భయంతో జీవించకూడదని.. సురక్షితంగా ఉన్నామనే భావనతో బయటకు రావాలని అన్నారు.

స్త్రీలపై వేధింపులు కేవలం శాంతిభద్రతల సమస్య మాత్రమే కాదని.. మొత్తం సమాజానికి సంబంధించిన సమస్యని విజయ్ పేర్కొన్నారు. మహిళలపై నేరాలను ఏమాత్రం ఉపేక్షించబోమని హెచ్చరించారు. రాష్ట్రంలో మహళలు, చిన్నారులపై నేరాలకు మాదకద్రవ్యాల వ్యాప్తికి సంబంధం ఉందన్నారు. డ్రగ్స్‌కు అలవాటుపడిన వారే ఎక్కువగా ఇటువంటి నేరాలకు పాల్పడుతున్నారని అన్నారు. విద్యార్థినులు, ఉద్యోగాలు చేసే మహిళల భద్రత కోసం సింగప్పెన్ బృందం రాష్ట్ర వ్యాప్తంగా డ్రోన్లను మోహరిస్తుందని తెలిపారు. వాటి సహాయంతో ఎక్కడ ఎవరు మహిళలను వేధించినా తక్షణమే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

# కేరళ మాజీ సీఎం పినరయి విజయన్ కుమార్తెకు ఈడీ సమన్లు



**తిరువనంతపురం, జూన్ 9:** కేరళ మాజీ సీఎం పినరయి విజయన్ కుమార్తె వీణకు ఈడీ సమన్లు జారీ చేసింది. కొచ్చిన్ మినరల్స్ అండ్ రూటిల్ లిమిటెడ్ (సీఎంఆర్ఎల్) అక్రమ లావాదేవీల్లో ఆమె ప్రమేయం ఉన్నట్లుగా ఆరోపణలు రావడంతో కంపెనీల చట్టం ఉల్లంఘన కింద అభియోగాలు నమోదయ్యాయి. ఈ నేపథ్యంలోనే శుక్రవారం కొచ్చి కార్యాలయం ముందు హాజరవ్వాలని ఆదేశించింది. వీణతో పాటు సీఎంఆర్ఎల్కు సంబంధించిన మరో తొమ్మిది మందికి సమన్లు జారీ చేసినట్లు అధికారులు వెల్లడించారు.

ఈడీతో కీలక పత్రాలను పంచుకోవడానికి నిరాకరిస్తూ కంపెనీ దాఖలు చేసిన పిటిషన్ను కార్పొరేట్ నేరాలను విచారించే ప్రత్యేక న్యాయస్థానం ఇటీవల తిరస్కరించింది. ఈ క్రమంలోనే ఈడీ దర్యాప్తును ముమ్మరం చేసింది. ఈ దర్యాప్తులోభాగంగా ఇప్పటికే పలు డాక్యుమెంటరీ, డిజిటల్, ఆర్థిక ఆధారాలను సేకరించినట్లు అధికారులు వెల్లడించారు. మరోవైపు వీణపై కార్పొరేట్ వ్యవహారాల శాఖ దర్యాప్తు చేపట్టింది. ఆమె నేతృత్వంలోని ఎక్సాలాజిక్ సొల్యూషన్స్‌కు కొచ్చిన్ మినరల్స్ అండ్ రిటైల్స్ రూ.2.78 కోట్లు చెల్లించడంపై అనుమానాలు లేవనెత్తింది.

కొచ్చిన్ మినరల్స్ అండ్ రూటిల్ లిమిటెడ్ సంస్థ గతంలో వీణ, ఆమె సంస్థ ఎక్సాలాజిక్ సొల్యూషన్స్‌కు రూ.2.73 కోట్లు చెల్లించింది. అయితే దానికి బదులుగా ఎలాంటి ఐటీ సేవలు అందించలేదు. 2023 ఆగస్టులో ఆ అంశం వెలుగులోకి రావడంతో రెండు సంస్థల మధ్య అధికారిక ఒప్పందం ఉన్నప్పటికీ.. అవి మోసపూరితంగా ఉన్నాయని సీరియస్ ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్ ఆఫీస్ (ఎస్ఎఫ్ఐఓ) అభియోగాల్లో పేర్కొంది. 2017 నుంచి 2020 మధ్యలో సీఎంఆర్ఎల్ నుంచి రూ.1.72 కోట్లు పొందినట్లు ఆ ఆరోపణల సారాంశం. ఈ నేపథ్యంలో పూర్తిస్థాయి దర్యాప్తు జరపాలని ఎస్ఎఫ్ఐఓకు కేంద్రం నుంచి ఆదేశాలు అందాయి. ఈ కేసు విషయంలో వీణపై ఈడీ మనీ లాండరింగ్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టింది.

# భారతీయులున్న నౌకపై దాడి.. అమెరికా పనే



**వాషింగ్టన్, జూన్ 9:** పశ్చిమాసియా ఘర్షణల వేళ.. ఒమన్ తీరంలో భారతీయులున్న నౌకపై దాడి జరిగిన సంగతి తెలిసిందే. తమ దేశమే ఆ దాడి చేసిందని అమెరికా మిలిటరీ వెల్లడించింది. ఇరాన్ ఓడరేవుల నుంచి నౌకల రాకపోకలను అడ్డుకునేందుకు రెండునెలలుగా హర్మూజ్‌లో యూఎస్ దిగ్బంధనం కొనసాగిస్తోంది. దానికి విరుద్ధంగా ఇరాన్ పోర్టుకు వెళ్లేందుకు ప్రయత్నించడంతో దాడి చేసినట్లు యూఎస్ సెంట్రల్ కమాండ్ తెలిపింది.

పలావు జెండాతో బయల్దేరిన కార్గో నౌక ఎంటీ మారివెక్స్ హర్మూజ్ సమీపంలో ఒమన్ తీరంలో ఉండగా ఈ దాడి జరిగింది. అమెరికా ఆదేశాలు పాటించకపోవడంతో పశ్చిమాసియా జలాల్లో ఉన్న యూఎస్ఎస్ అబ్రహం లింకన్ నుంచి ఈ దాడి చేసినట్లు పేర్కొంది. దీంతో మారివెక్స్ ఇక ఇరాన్ను చేరుకోలేదని ఎక్స్ వేదికగా వెల్లడించింది. దాడి కారణంగా మంటలు చెలరేగడంతో నౌకలోని సిబ్బంది అత్యవసర సహాయం కోసం అభ్యర్థనలు పంపారు. వెంటనే అప్రమత్తమైన భారత నౌకాదళానికి చెందిన హెలికాప్టర్లు.. షిప్‌లోని వారిని సురక్షితంగా తరలించాయి. ఇండియన్ కోస్టార్డ్ 24 మంది భారతీయులను కాపాడింది.

ఇరాన్- అమెరికా మధ్య శాంతి ఒప్పందం ఖాయమైందని అనుకునేలోపే.. మరోసారి ఘర్షణలు ప్రారంభమయ్యాయి. దాంతో ఇంధన రవాణాకు కీలకమైన హర్మూజ్‌లో అంతరాయాలు మళ్లీ తీవ్రమయ్యాయి. ఏప్రిల్ 13 నుంచే అమెరికా దిగ్బంధనాన్ని కొనసాగిస్తోంది. మానవతా సహాయం కోసం వెళ్తున్న 42 నౌకలు మాత్రమే హర్మూజ్ దాటేందుకు అనుమతించింది.

## సంతకం ఫోర్జరీ ఆరోపణలు..
## మమతా బెనర్జీ ఇంటికి సీఐడీ





**కోల్‌కతా, జూన్ 9:** పశ్చిమ బెంగాల్లో ప్రతిపక్ష నేత హోదా కోసం ఎమ్మెల్యేల సంతకాలు ఫోర్జరీ జరిగినట్లు ఆరోపణలు వచ్చిన విషయం తెలిసిందే. ఈ కేసులో నేడు కీలక పరిణామం చోటుచేసుకుంది. దర్యాప్తులో భాగంగా మమతా బెనర్జీ నివాసానికి సీఐడీ బృందం వెళ్లింది.

ప్రతిపక్ష నేత హోదా కోసం అసెంబ్లీ స్పీకర్కు సమర్పించిన ప్రతిపాదనలో టీఎంసీ శాసనసభ్యుల సంతకాలను ఫోర్జరీ చేశారనే ఆరోపణలు వచ్చాయి. వీటికి సంబంధించిన సమాచారం ఇవ్వాలని కోరుతూ సీఐడీ అధికారులు ఆ పార్టీ జాతీయ కార్యదర్శి అభిషేక్ బెనర్జీకి ఇటీవల నోటీసులు జారీ చేశారు. ఆయన ఇచ్చిన సమాధానం మేరకు తాజాగా పార్టీ అధినేత్రి నివాసం, కార్యాలయంలో సోదాలు నిర్వహిస్తున్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి.

జాతీయ స్థాయిలో విపక్ష పార్టీల 'ఇండియా' కూటమి సమావేశం అనంతరం.. కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీతో మమతా బెనర్జీ ప్రత్యేకంగా భేటీ అయ్యారు. భవిష్యత్తులో విపక్షాలు అనుసరించాల్సిన వ్యూహాలపై ఇరువురు చర్చించినట్లు తెలుస్తోంది.

# 3 నెలల్లో 37వ సారి..
# డీల్‌పై ట్రంప్ ప్రకటనల లెక్క..!



**వాషింగ్టన్, జూన్ 9:** 'ఇరాన్‌తో ఒప్పందానికి దగ్గరగా ఉన్నాం.. అతిత్వరలోనే డీల్ కుదురుతుంది'.. దాదాపు రెండున్నర నెలల కిందట అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చెప్పిన మాట ఇది. అప్పటి నుంచి ఆయన ఇదే విషయాన్ని పలుమార్లు వెల్లడిస్తున్నా.. ఒప్పందం మాత్రం ఖరారు కాలేదు సరికదా.. ఉద్రిక్తతలు ఇంకా పెరుగుతూనే ఉన్నాయి. అయితే, ట్రంప్ ఇలా డీల్ గురించి ఎన్నిసార్లు ప్రకటనలు చేశారో తెలుసా? మూడు నెలల్లో 37 సార్లు..!

ఫిబ్రవరి 28న ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ సంయుక్తంగా దాడులు చేసిన సంగతి తెలిసిందే. దీంతో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు భగ్గుమన్నాయి. ఈ క్రమంలోనే యుద్ధం ముగింపునకు శాశ్వత శాంతి ఒప్పందం కోసం ఇరాన్ను ట్రంప్ చర్చలకు ఆహ్వానించారు. ఆ సమయంలో మార్చి 23న ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. శాంతి చర్చల్లో చాలా అంశాలపై ఏకాభిప్రాయం కుదిరిందన్నారు. ఆ తర్వాత క్యాబినెట్ సమావేశంలో ప్రసంగిస్తూ.. అమెరికాతో ఒప్పందం కోసం టెహ్రాన్ తీవ్రంగా అభ్యర్థిస్తోందని తెలిపారు. ఏప్రిల్ 6న మరోసారి దీనిపై మాట్లాడుతూ.. ఇరాన్తో ఒప్పందానికి చాలా దగ్గరగా ఉన్నామని అన్నారు. ఆ మరుసటిరోజే ఇరుదేశాల మధ్య తాత్కాలిక కాల్పుల విరమణకు అంగీకారం కుదిరింది.

తొలుత రెండు వారాల పాటు ఈ కాల్పుల విరమణ చోటుచేసుకోగా.. ఆ తర్వాత దాన్ని మరికొంతకాలం పొడిగించారు. మరోవైపు, శాంతి చర్చల కోసం ఇరుదేశాల మధ్య చర్చలు కొనసాగాయి. అలా మొత్తంగా ఇప్పటివరకు ట్రంప్ 37 సార్లు డీల్ కుదుర్చుకునేందుకు చాలా దగ్గరగా వచ్చామని ప్రకటన చేసినట్లు మీడియా గణాంకాలు చెబుతున్నాయి. అయితే, ఇరాన్ మాత్రం ఎప్పటికప్పుడు అమెరికా అధ్యక్షుడి ప్రకటనలను కొట్టిపారేస్తూనే ఉంది. అగ్రరాజ్య డిమాండ్లను తాము అంగీకరించట్లేదని, ఒప్పందంలో ఏ అంశాల పైనా ఏకాభిప్రాయం కుదరలేదని టెహ్రాన్ చెబుతోంది. దీంతో ట్రంప్ ప్రకటనలపై ప్రజల్లో ఆసక్తి తగ్గిపోయినట్లు కన్పిస్తోంది.

ఇదిలాఉండగా.. ఓవైపు శాంతిఒప్పందం కోసం అమెరికా ప్రయత్నిస్తుండగా పశ్చిమాసియాలో మళ్లీ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులకు ప్రతీకారంగా ఇరాన్ క్షిపణులతో విరుచుకుపడింది. దీంతో ఇజ్రాయెల్ తీవ్రంగా ప్రతిస్పందించింది. ఇరుపక్షాలూ కాల్పులను తక్షణమే ఆపాలని ట్రంప్ పిలుపునిచ్చినా.. పరిస్థితిలో ఏ మార్పు రాలేదు. తాజాగా అమెరికాకు చెందిన అపాచీ హెలికాప్టర్ ఒకటి హర్మూజ్ సమీపంలో కూలిపోవడం గమనార్హం.

## హత్య కేసులో
## అప్పీలు విచారణకు 40 ఏళ్లా..?
## సుప్రీం ఆందోళన



**ఢిల్లీ, జూన్ 9:** సుదీర్ఘకాలం పెండింగ్లో ఉన్న కేసులపై సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. కిందికోర్టు వేసిన శిక్షను సవాలు చేస్తూ.. హత్య కేసు నిందితుడు 40 ఏళ్ల క్రితం వేసిన అప్పీల్‌ను విచారించేందుకు అలహాబాద్ హైకోర్టు అసాధారణ జాప్యం చేయడంపై అత్యున్నత న్యాయస్థానం అసంతృప్తి వ్యక్తంచేసింది. ఈ సుదీర్ఘ ఆలస్యాలు కలవరపాటుకు గురిచేస్తున్నాయని.. పేరుకుపోతున్న కేసుల్ని పరిష్కరించేందుకు ఎలాంటి వినూత్న చర్యలు తీసుకుంటున్నారని హైకోర్టును ప్రశ్నించింది.

**ఈ కేసు ఏంటంటే..?**

తన సోదరుడిని హత్య చేసిన కేసులో 1983 నవంబర్లో ఉత్తరప్రదేశ్‌కు చెందిన విజయ్ సింగ్ అరెస్టయ్యాడు. అప్పుడు ఆయన వయసు 28 ఏళ్లు. 1985 కాన్పూర్లోని సెషన్స్ కోర్టు విజయ్ను దోషిగా తేల్చింది. యావజ్జీవ కారాగార శిక్షను విధించింది. ఆ తీర్పును సవాలు చేస్తూ అతడు అలహాబాద్ హైకోర్టును ఆశ్రయించాడు. దాదాపు 41 ఏళ్లపాటు ఆ అప్పీల్ పెండింగ్లోనే ఉండిపోయింది. ఈ ఫిబ్రవరిలో హైకోర్టు అతడి అప్పీల్ను కొట్టివేసింది. ఇప్పుడు ఈ కేసును సుప్రీంకోర్టు విచారిస్తోంది.

మొత్తంగా ఈ 43 ఏళ్ల కాలంలో విజయ్ మూడు నెలలు మాత్రమే కస్టడీలో ఉన్నాడని, తన అప్పీ తీర్పు కోసం ఎదురుచూస్తూ బెయిల్‌పై బయటే ఉన్నాడని ఈ సందర్భంగా ధర్మాసనం గుర్తించింది. ప్రస్తుత విచారణ నేపథ్యంలో బెయిల్ను కొనసాగించాలని నిర్ణయించింది. అలహాబాద్ హైకోర్టులో తరచూ జరుగుతోన్న దీర్ఘకాలిక జాప్యాలపై ఆందోళన వ్యక్తంచేసింది. భారీగా కేసులు పేరుకు పోతుండటంతో, త్వరితగతిన విచారణ జరిపేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ పిటిషనర్లు సుప్రీంకోర్టును ఆశ్రయిస్తున్నారని ఈ సందర్భంగా ప్రస్తావించింది.

# జిల్లా సమగ్ర అభివృద్ధికి అధికారులు సమన్వయంతో కృషి చేయాలి

**ఇండస్ట్రియల్ హబ్‌గా వెలుగొందుతున్న**
**జిల్లా అభివృద్ధిలో మరింత ముందుకు సాగాలి**
**రైతులను క్రాప్ డైవర్షన్, ఆయిల్ పామ్ సాగు వైపు ప్రోత్సహించాలి**
**ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అర్హులందరికీ చేరేలా చర్యలు తీసుకోవాలి**
**జిల్లా ఇన్చార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి**
**గ్రామీణ ప్రాంతాల యువతులను నర్సింగ్ విద్య వైపు ప్రోత్సహించాలి**
**ఆసుపత్రుల్లో అవసరమైన వైద్య మౌలిక వసతులు కల్పించాలి**
**వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ**



సంగారెడ్డి, జూన్ 09 మనం ప్రతినిధిః జిల్లా సమగ్ర అభివృద్ధికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రభుత్వ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని రాష్ట్ర కార్మిక, ఎంప్లాయిమెంట్ శాఖ మరియు జిల్లా ఇన్చార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి సూచించారు. తాగునీరు, వ్యవసాయం, విద్య, వైద్యం, గృహ నిర్మాణం, రవాణా, ఆర్ అండ్ బి, పిసిబి, పి ఆర్, విద్యుత్, డి ఆర్ డి ఏ, సంక్షేమ శాఖలు, ఆర్టీసీ, షుగర్ కేన్, పరిశ్రమలు, తదితర రంగాల పురోగతిపై మంగళవారం నిర్వహించిన జిల్లా సమీక్ష సమావేశంలో ఆయా శాఖల అధికారులు తీసుకోవాల్సిన చర్యలపై మంత్రి దామోదర రాజనర్సింహతో కలిసి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మంత్రి వివేక్ మాట్లాడుతూ, ఇండస్ట్రియల్ హబ్గా వేగంగా అభివృద్ధి చెందుతున్న సంగారెడ్డి జిల్లా మరింత పురోగతి సాధించేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. వ్యవసాయ రంగంలో రైతులను క్రాప్ డైవర్షన్ వైపు ప్రోత్సహిస్తూ, లాభదాయక పంట అయిన ఆయిల్ పామ్ సాగుపై విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలని ఆదేశించారు. వ్యవసాయ, రెవెన్యూ, పోలీసు శాఖలు సమన్వయంతో ఎరువుల దుకాణాలను తనిఖీ చేసి ఎలాంటి అక్రమాలు జరగకుండా చూడాలని, రైతులకు యూరియా, డీఏపీ తదితర ఎరువుల కొరత రాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతులకు సరైన సాంకేతిక మార్గదర్శకత్వం అందించి ఆయిల్ పామ్ సాగు వైపు మళ్లించాలని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం రాష్ట్రవ్యాప్తంగా విజయవంతంగా అమలవుతోందని, గూడు లేని పేదలకు సొంత ఇల్లు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. అలాగే జిల్లాలో గతంలో నిర్మించి కేటాయించని డబుల్ బెడ్రూమ్ ఇండ్లను అర్హులైన లబ్ధిదారులకు కేటాయించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ భూములను ఆక్రమణల నుంచి కాపాడాలని, తాగునీటి సమస్యలు ఎక్కడా తలెత్తకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ మార్గదర్శకాల మేరకు నీటి నిల్వలను నిర్వహించాలని చెప్పారు. జిల్లాలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల పరిస్థితిని సమగ్రంగా పరిశీలించి అవసరమైన మౌలిక వసతులపై నివేదిక సిద్ధం చేసి జిల్లా కలెక్టర్కు అందజేయాలని సూచించారు. విద్యార్థులకు అవసరమైన సదుపాయాల కల్పనకు ప్రభుత్వం తగిన బడ్జెట్ కేటాయించేందుకు సిద్ధంగా ఉందన్నారు. జాతీయ రహదారి-65 పరిధిలో ఉన్న విద్యుత్ స్తంభాల మార్పిడి పనులను వేగవంతం చేయాలని, నిర్మాణ కార్మికుల నమోదు కార్యక్రమాన్ని విస్తృతంగా చేపట్టి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు వారికి అందేలా చూడాలని సూచించారు. జిల్లాలోని ప్రతి గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించే దిశగా కార్యాచరణ రూపొందించాలని, అవసరమైన అదనపు బస్సుల కోసం ప్రతిపాదనలు సమర్పించాలని అధికారులకు సూచించారు. హాస్పిటళ్లు, హోటళ్లు తదితర సంస్థల్లో బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణపై క్రమం తప్పకుండా పర్యవేక్షణ నిర్వహించి కాలుష్య నియంత్రణ చర్యలను పటిష్టం చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ, ప్రజలకు ప్రభుత్వం చేస్తున్న సేవలు ప్రత్యక్షంగా చేరడం ముఖ్యమని అన్నారు. తాగునీటి సమస్యలు ఉన్న ప్రాంతాల్లో అవసరమైన బోర్వెల్స్ కోసం వెంటనే ప్రతిపాదనలు పంపించాలని సూచించారు. జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో అవసరమైన అన్ని డయాగ్నస్టిక్ పరికరాలు, డ్రగ్స్, అవసరమైన ఇక్విమెంట్ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, డయాలసిస్ సేవలకు అవసరమైన చోట అదనపు పడకల ఏర్పాటు కోసం ప్రతిపాదనలు సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాలో నర్సింగ్ కళాశాలను ఈ నెలాఖరులోగా ప్రారంభించనున్నట్లు తెలిపారు. నర్సింగ్ వృత్తికి ప్రస్తుతం దేశవ్యాప్తంగా, అంతర్జాతీయ స్థాయిలో మంచి డిమాండ్ ఉన్నందున గ్రామీణ ప్రాంతాల యువతులను నర్సింగ్ కోర్సులు అభ్యసించేలా ప్రోత్సహించాలని సూచించారు. ప్రతి 35 కిలోమీటర్ల పరిధిలో ఒక ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. అంబులెన్స్ సేవలను మరింత బలోపేతం చేసేందుకు అవసరమైన డ్రైవర్ల నియామకాల కోసం ప్రతిపాదనలు పంపాలని సూచించారు. తెలంగాణ పబ్లిక్ స్కూల్స్, యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మాణ పనులను వేగవంతం చేసి వచ్చే విద్యా సంవత్సరంలోపు ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎంపీలు , ఎమ్మెల్సీ, శాసనసభ్యులు పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఆయా సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఎంపీ సురేష్ శేఖర్ రైతు సమస్యలను పార్టీలకతీతంగా పరిష్కరించాలని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో రైతులకు న్యాయం చేయాలన్నారు. ఎంపీ రఘునందన్ రావు ప్రజలు మోసపోకుండా ఏ సర్వే నంబర్లు ఏ భూమి ఉందో తెలిసేలా వెబ్సైట్లో పెట్టాలన్నారు. ప్రభుత్వ భూముల ఆక్రమణ పై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ సమీక్ష సమావేశంలో ఎంపీలు రఘునందన్ రావు, సురేష్ షెట్కర్, ఎమ్మెల్సీ అంజి రెడ్డి, ఎమ్మెల్యేలు చింతా ప్రభాకర్, మాణిక్రావు, సునీతా లక్ష్మారెడ్డి, సంజీవరెడ్డి, సెట్విన్ చైర్మన్ గిరిధర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, అదనపు కలెక్టర్లు సంగీత, పాండు, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు

## హైదరాబాద్ తరలి వెళ్లిన మహిళలు




తిరుమలగిరి జూన్ 9 (మనం న్యూస్)ః తిరుమలగిరి మండలం నుండి వివిధ గ్రామాలలోని మహిళా సంఘం నాయకులను హైదరాబాదులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మండల మహిళా సమాఖ్యలకు బస్సుల పంపిణీ కార్యక్రమానికి మంగళవారం బస్సులోతరలి వెళ్లారు. వెళ్ళిన వారిలో మహిళా సమాఖ్య అధ్యక్షురాలు టీ.కవిత, కోక సరిత, మంగమ్మ, ఎపి ఎం లక్ష్మి, పీసీ నాగయ్య, వివిధ గ్రామాల వివోల అధ్యక్షురాలు మహిళలు ఉన్నారు.

## వెలిశాలలో బడిబాట




తిరుమలగిరి, జూన్ 09 (మనం న్యూస్)ః తిరుమలగిరి మండలం వెలిశాల గ్రామంలో బడిబాట కార్యక్రమం గ్రామ సర్పంచ్ కుంభం మంజుల సతీష్ గౌడ్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు.ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, ప్రభుత్వం విద్యాభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. ప్రతి బాలబాలికలు పాఠశాలలో చేరి విద్యను అభ్యసించడం ద్వారా వారి భవిష్యత్తు ఉజ్వలంగా మారుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు చేరువ కావడంలో గ్రామ పంచాయతీలు, పాఠశాలలు కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. గ్రామ అభివృద్ధి, విద్యాభివృద్ధి, ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని వివరించారు. ప్రతి బిడ్డ బడికి - ప్రతి కుటుంబం అభివృద్ధికి అనే నినాదంతో గ్రామ ప్రజలు తమ పిల్లలను తప్పనిసరిగా పాఠశాలలో చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కుంభం మంజుల సతీష్ గౌడ్, ఎంఈఓ శాంతయ్య , హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు అశోక్ రెడ్డి, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాములు,పంచాయతీ కార్యదర్శి అరుణ్ ,అంగన్వాడీ టీచర్లు,వైద్య శాఖ సిబ్బంది, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాల విద్యార్థులను మౌలిక వసతులు కల్పించాలి

- **బడిబాటలో 20శాతం అదనపు నమోదు సాధించాలి**
- **జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**



సూర్యాపేట, జూన్ 09 (మనం ప్రతినిధి)ః జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే లక్ష్యంగా విద్యాశాఖ అధికారులు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులతో జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ మంగళవారం వెబెక్స్ ద్వారా సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యా ప్రమాణాల మెరుగుదల, పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనపై అధికారులకు పలు కీలక అంశాలపై చర్చించారు. ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట' కార్యక్రమ నిర్వహణ పురస్కరించుకొని జిల్లాలోని ప్రతి పాఠశాలలో ఈ ఏడాది విద్యార్థుల నమోదును కనీసం 20 శాతం పెంచాలని లక్ష్యంగా నిర్దేశించారు. గతంలో జీరో ఎన్రోల్మెంట్ విద్యార్థులు లేని కారణంగా మూతపడిన పాఠశాలలను గుర్తించి, ఈ విద్యా సంవత్సరం నుండి వాటిని పునర్ ప్రారంభించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాకు నూతనంగా మంజూరైన 91 పూర్వ ప్రాథమిక పాఠశాలల్లో ఇన్స్ట్రక్టర్లను, ఆయాలను త్వరితగతిన నియమించాలన్నారు. విస్తృత ప్రచారం నిర్వహించి ఈ కేంద్రాలలో చిన్నారులను పెద్ద సంఖ్యలో చేర్పించడంతో పాటు, అవసరమైన మౌలిక వసతులను సమకూర్చాలని స్పష్టం చేశారు. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో తప్పనిసరిగా గ్యాస్ కనెక్షన్లు, మరుగుదొడ్ల సౌకర్యం ఉండాలన్నారు. ముఖ్యంగా ప్రత్యేక అవసరాలు గల పిల్లల కోసం ర్యాంపులు, వెస్ట్రన్ టాయిలెట్లను యుద్ధప్రాతిపదికన ఏర్పాటు చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. పాఠశాలలకు ఇప్పటికే మంజూరైన ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్లు, కంప్యూటర్లు నిరంతరం పనిచేసే స్థితిలో ఉండేలా చూసుకోవాలని పేర్కొన్నారు. అదేవిధంగా ఇంటర్నెట్ సౌకర్యం లేని పాఠశాలల వివరాలతో తక్షణమే ప్రతిపాదనలు పంపాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో వసతులను మెరుగుపరిచి, డిజిటల్ బోధన ద్వారా విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే ప్రాధాన్యత అని అధికారులు, ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేసి బడిబాటను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ వెబెక్స్ సమీక్షా సమావేశంలో జిల్లా విద్యాశాఖ సెక్టోరల్ అధికారులు హరికృష్ణ, సూర్యనారాయణ, రేణుక దేవి, పూలన్, వెంకటేశ్వర్లు, మండల విద్యాధికారులు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు మరియు విద్యాశాఖ ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

# ఆదా మరచి అజా జాగ్రత్తగా ఉంటే ఆర్థిక నష్టం

**జిల్లాలో చోరీకి గురై పోగొట్టుకున్న సుమారు 20 లక్షల విలువగల 102 మొబైల్ ఫోన్లు రికవరీ**
**ఆర్థిక పరమైన అంశాలకు మొబైల్ ప్రదాన్యమైనది**
**సంవత్సర కాలంలో 1744 మొబైల్స్ ను బాధితులకు అందజేశాం**
**పిల్లలకు కష్ట పడటం నేర్పి సామాజికంగా ఎదిగేలా చేయాలి**
**విలేకరుల సమావేశంలోజిల్లా ఎస్పీ కె నరసింహ**




సూర్యాపేట, జూన్ 09 (మనం ప్రతినిధి)ః చలవానిల వాడకంలో జాగ్రత్త నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఆర్థిక నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని జిల్లా ఎస్పీ నరసింహ స్పష్టం చేశారు. మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో సెల్ ఫోన్ రికవరీ మేళా ఏర్పాటు చేసి జిల్లాలో ప్రజలు వివిధ రూపాల్లో పోగొట్టుకున్న సుమారు 20 లక్షల రూపాయల విలువ గల 102 ఫోన్ల ను గుర్తించి వాటిని రికవరీ చేయడం జరిగింది. ఇందులో భాగంగా జిల్లా ఎస్పీ నరసింహ చేతుల మీదుగా 13వ సారి సంబంధిత మొబైల్ ఫోన్ల ను పోగొట్టుకుని లేదా చోరీకి గురైన చరవాణి లను యజమానులకు అందజేశారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.... అజాగ్రత్తగా నిర్లక్ష్యంగా ఉంటే నష్టాలు తప్పవు, అప్రమత్తంగా ఉండాలి సురక్షితంగా ఉండాలి అన్నారు, అత్యాశకు పోయి, ఆదమరిచి ఉన్నా సైబర్ మోసగాళ్లు ఆర్థిక నష్టం కలిగిస్తారు అన్నారు. సమాజంలో మంచిని సమర్థించాలి చెడును ప్రశ్నించాలి అప్పుడే మన భావితరాలకు ఆరోగ్యవంతమైన సమాజాన్ని అందించగలుగుతాం, సమాజంలో చెడు ఎక్కడ జరుగుతున్న అసాంఘిక కార్యకలాపాలు ఎక్కడ జరుగుతుంది సమాచారం ఇవ్వాలి పేర్కొన్నారు.పిల్లలకు కష్టపడే తత్వాన్ని నేర్పించండి వృత్తుల పట్ల ప్రజల పట్ల సమాజం పట్ల గౌరవాన్ని సామాజికంగా ఎదగటాన్ని నేర్పించండి అని తల్లిదండ్రులకు సూచించారు. ప్రస్తుత రోజుల్లో మొబైల్ ఫోన్ ప్రతి ఒక్కరికీ నిత్యవసరమైనది, దీనిని కమ్యూనికేషన్ కోసం, ఆన్లైన్ విద్య కోసం, ఆర్థిక పరమైన అంశాలకు వినియోగిస్తున్నాం, మన యొక్క విలువైన సమాచారం బ్యాంక్ అకౌంట్స్, పాస్ వర్డ్స్, సోషల్ మీడియా అకౌంట్స్, వ్యక్తిగత ఫోటోలు మొదలైన వంటివి ఫోన్ లో నిక్షిప్తం చేసుకుంటున్నాము అన్నారు, మొబైల్ చోరికి గురైనా, పోగొట్టుకున్నా అందులో ఉన్న సమాచారం పోతుంది. నేరగాళ్లు మొబైల్ దొంగిలించి, వీక్ పాస్ వర్డ్స్ లను బ్రేక్ చేసి ఫోన్ పే, గూగుల్ పే తదితర మధ్యమాల ద్వారా డబ్బులు కాజేస్తున్నారన్నారు. మొబైల్ ఫోన్ పోగొట్టుకున్న వ్యక్తులు కేవలం మొబైల్ ఫోన్ మాత్రమే కాకుండా తమ వ్యక్తిగత సమాచారంతో సహ డబ్బులను కూడా కోల్పోవడం జరుగుతున్నారు. ఒక్కో మొబైల్ రికవరీ చేయడానికి సైబర్ వారియర్స్ పోలీస్, టెక్నికల్ టీం పోలీసు సిబ్బంది చాలా కృషి చేశారు, ఇతర రాష్ట్రాల వారి నుండి ఈ మొబైల్స్ ను రికవరీ చేశారు. ఎవరైన మొబైల్ పోగొట్టుకున్న లేదా దొంగిలించబడిన వెంటనే సీఈఐ ఆర్. పోర్టల్ ( https://www.ceir.gov.in ) నందు నమోదు చేసుకొని మొబైల్ ను బ్లాక్ చేసి, మీ సేవా ద్వారా ధరఖాస్తు సంభందిత పోలీసు స్టేషన్ లో సమాచారం ఇవ్వాలని సూచించారు. పోలీసు శాఖ కృత నిచ్చయంతో పని చేసి పెద్దమొత్తంలో ఫోన్స్ రికవరీ చేసి భాదితులకు అందించడం జరిగినది ఎస్పీ వెల్లడించారు.

### అత్యాశకు గురికావద్దు

ప్రజలు అత్యాసకు పోయి సైబర్ మోసాల బారిన పడోద్దు తక్కువ వడ్డీకి లోన్స్ ఉన్నాయి, తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించవచ్చు, బహుమతులు వచ్చాయి అంటే నమ్మి అపరిచితులకు డబ్బులు పంపవద్దు, వ్యక్తిగత వివరాలు చెప్పవద్దు, మీ పిల్లలు డ్రగ్స్, అమ్మాయిల రవాణా లాంటి కేసుల్లో చిక్కుకున్నారు డిజిటల్ అరెస్ట్ చేస్తాం అని సిబిఐ. సిఐడి. లాంటి దర్యాప్తు సంస్తల పేర్లు చెప్పి డబ్బులు కడితే కేసు నుండి తప్పిస్తాము అంటారు ఇది నమ్మవద్దు డిజిటల్ అరెస్ట్ అబద్దం అన్నారు. ప్రతి పౌరుడు యూనిఫాం ధరించని పోలీసు మీకోసం ఉన్నారు, ప్రజా భద్రతలో అనుక్షణం కృషి చేస్తున్నాము, మీ ప్రాంతాల్లో జరుగుతున్న అశాంఘిక చర్యలు, అక్రమ రవాణా పై పోలీసుకు సమాచారం ఇవ్వాలి, సమాజంలో జరుగుతున్న అసాంఘిక చర్యలు, అక్రమాలు, అక్రమ రవాణా లాంటి వాటిపై ప్రశ్నించే ప్రతిఒక్కరు యూనిఫాం లేని పోలీసు, వీటిపై మాకు సమాచారం అందజేయాలని సూచించారు.మీ వివరాలు గోప్యంగా ఉంచుతాం ప్రజలు పోలీసులకు మిత్రులుగా ఉంటూ నేరాల నివారణలో భాగస్వామ్యం కావాలి అన్నారు. ఇక్కడికి వచ్చిన ప్రతి ఒక్కరూ సైబర్ వారియర్స్, డ్రగ్స్ నిర్మూల వారియర్స్ లాగా ఉండాలి వీటిపై సమాచారం ఇస్తే మీరు పోలిసుతో భాగస్వామ్యం అయినట్లే, సైబర్ మోసాల గురించి చుట్టుపక్కల వారికి అవగాహన కలిగించాలి.

### పోలీసు శాఖకు బాధితులు కృతజ్ఞతలు

పోయిన మొబైల్ ఫోన్లు మళ్లీ దొరకదనుకున్న బాధితులు జిల్లా పోలీసులు టెక్నాలజీ ఉపయోగించి ఫోన్ రికవరీ చేసి అందించినందుకు సంభందిత బాధితులు జిల్లా ఎస్పీ గారికి, పోలీస్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.జిల్లాలో వివిధ రూపాల్లో వినియోగదారులు పోగొట్టుకున్న మొబైల్ ఫోన్స్ ను ఇఉఐఖ అప్లికేషన్ ద్వారా రికవరీ చేసి బాధితులకు అప్పగించడంలో కృషి చేస్తున్న ఐ.టి కోర్ సిబ్బందిని, పోలీస్ స్టేషన్ సిబ్బందిని ఎస్పీ అభినందించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి, ఐటి. కోర్ ఆర్ఎస్ఐ రాజశేఖర్, ఐటి కోర్ సిబ్బంది, పోలీస్ సైబర్ వారియర్స్, మొబైల్ పోగొట్టుకున్న బాధితులు ఉన్నారు.

## మా శెట్టి అనంతరాములు ఎన్నిక పట్ల హర్షం..



మేళ్లచెరువు జూన్ 9 మనం న్యూస్ః తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ కార్యదర్శిగా మా శెట్టి అనంతరాములు నియమితులైనందుకుగాను మేళ్లచెరువు ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు వరగాని నాగరాజు, ప్రధాన కార్యదర్శి కొప్పురావురి విజయశంకర్, కోశాధికారి విడాల పురుషోత్తం, హర్షం ప్రకటించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ చేతుల మీదుగా మంగళవారం హైదరాబాదులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నియామక పత్రాన్ని అనంతరాములు అందుకున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని నిరుపేద ఆర్యవైశ్యులకు, విద్యాపరంగా, వైద్య పరంగా చేయూతనిచ్చి ఆదుకోవాలని వారు అనంత రాములను కోరారు.

# పచ్చిరొట్ట పంటల సాగుతో భూమి సారవంతం

- **వ్యవసాయ సంచాలకులు బి. గోపి**



హైదరాబాద్, జూన్ 9(మనంన్యూస్)ః వ్యవసాయ భూముల్లో సేంద్రియ కర్బన పదార్థం తగ్గిపోవడం, నేల గట్టిపడటం, నీటి నిల్వ సామర్థ్యం క్షీణించడం, రసాయన ఎరువుల వినియోగం పెరగడం వంటి సమస్యలను అధిగమించేందుకు రైతులు పచ్చిరొట్ట పంటల సాగును విస్తృతంగా చేపట్టాలని వ్యవసాయ శాఖ సంచాలకులు బి. గోపి, ఐఏఎస్ సూచించారు. జనుము, జీలుగు, పిల్లిపెసర వంటి పచ్చిరొట్ట పంటలను ప్రధాన పంటలకు ముందు లేదా రెండు పంటల మధ్యకాలంలో సాగు చేసి, పూత దశలో భూమిలో కలియదున్నడం ద్వారా నేలలో సేంద్రియ కర్బన పదార్థం పెరిగి భూమి సారవంతమవుతుందని తెలిపారు. ఈ పంటలను భూమిలో కలపడం వల్ల నేల ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు ఉపయోగకరమైన సూక్ష్మజీవుల సంఖ్య పెరుగుతుందని పేర్కొన్నారు. దీనివల్ల భూమిలో తేమ ఎక్కువ కాలం నిల్వ ఉండటంతో పాటు కలుపు మొక్కల పెరుగుదల తగ్గి వేర్ల అభివృద్ధి మెరుగుపడుతుందని చెప్పారు. పచ్చిరొట్ట పంటలను పూత దశకు ముందే భూమిలో కలియదున్నడం ద్వారా భూమి ఆరోగ్యం మెరుగుపడి సుస్థిర వ్యవసాయానికి దోహదపడుతుందని పేర్కొన్నారు.

### పచ్చిరొట్ట పంటల వల్ల కలిగే ప్రధాన ప్రయోజనాలు...

సేంద్రియ కర్బన పదార్థం పెరుగుతుంది, భూమిలో తేమ ఎక్కువ కాలం నిల్వ ఉంటుంది, ఉపయోగకరమైన సూక్ష్మజీవుల సంఖ్య పెరుగుతుంది, సహజ నత్రజని లభిస్తుంది, రసాయన ఎరువుల అవసరం తగ్గుతుంది, కలుపు మొక్కల నియంత్రణ జరుగుతుంది, వేర్ల పెరుగుదల మెరుగుపడుతుంది, భూసారం మరియు దిగుబడులు పెరుగుతాయి,ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా జిల్లా, మండల స్థాయి వ్యవసాయ అధికారులు మరియు వ్యవసాయ విస్తరణ అధికారులు రైతులకు పచ్చిరొట్ట పంటల ప్రయోజనాలపై విస్తృతంగా అవగాహన కల్పించాలని వ్యవసాయ సంచాలకులు ఆదేశించారు. రైతులకు ప్రోత్సాహకంగా పచ్చిరొట్ట విత్తనాలను 50 శాతం సబ్సిడీపై అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఈ సంవత్సరం 1,46,330 క్వింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాలను సమకూర్చగా, అవి 11,73,688 ఎకరాలకు సరిపోతాయని పేర్కొన్నారు. ఇందుకోసం రూ.118.88 కోట్ల సబ్సిడీని అందించేందుకు ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. ఇప్పటికే రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో 98,226 క్వింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాలను అందుబాటులో ఉంచగా, రైతులు 53,256 క్వింటాళ్ల విత్తనాలను కొనుగోలు చేసినట్లు వెల్లడించారు. పచ్చిరొట్ట విత్తనాలు అవసరమైన రైతులు సమీప వ్యవసాయ కార్యాలయాన్ని సంప్రదించి పట్టాదారు పాస్పుస్తకం, ఆధార్ వివరాలను సమర్పించి ,పర్మిట్ పొంది ,సబ్సిడీపై విత్తనాలను పొందవచ్చని తెలిపారు. రైతులు పచ్చిరొట్ట పంటలను సాగు చేసి పూత దశలో కలియదున్నడం ద్వారా భూసారాన్ని పెంపొందించి, భూమి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని వ్యవసాయ సంచాలకులు శ్రీ బి. గోపి, ఐఏఎస్ పిలుపునిచ్చారు.

## సర్ ప్రక్రియను ప్రతి ఒక్కరూ ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలి



హైదరాబాద్, జూన్ 9(మనంన్యూస్)ః రాష్ట్రంలో త్వరలో ప్రారంభం కానున్న ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ పై విజయవంతం చేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి, ఐఏఎస్ తెలిపారు. తెలంగాణలో ఈనెల 25.06.2026 నుంచి ఎస్ఐఆర్ ప్రక్రియ ప్రారంభం అవుతుందని, దీనిని ప్రశాంతంగా నిర్వహించేందుకే మంగళవారం నాడు ప్రధాన ఎన్నికల కార్యాలయంలో రాష్ట్రంలోని అన్ని ఎన్నికల నమోదు అధికారులకు ఈ శిక్షణ కార్యక్రమాన్నినిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్ఐఆర్ ప్రక్రియను ప్రతి ఒక్కరూ ప్రతిష్టాత్మకంగా తీసుకొని పని చేయాలని సంబంధిత అధికారులకు ఆయన సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేరును ఓటర్ లిస్టులో చేర్చాలని, అదేవిధంగా అనర్హులైన వారి పేర్లను జాబితా నుంచి తొలగించాలని ఆదేశించారు. ఈ శిక్షణ కార్యక్రమంతో ఎన్నికల అధికారుల సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేయడం, ప్రత్యేకించి ఎస్ఐఆర్కు సంబంధించిన బీఎల్ఓ యాప్తో కూడిన ఈసీఐనెట్ అప్లికేషన్పై వారికి సమగ్ర అవగాహన కల్పించారు. ఎస్ఐఆర్ అమలు సమయంలో ఎదురయ్యే సవాళ్లపై పకడ్బందీ కార్యాచరణతో ముందుకు వెళ్లాలని సిఇఒ సూచించారు. అనంతరం రాష్ట్ర శిక్షణ నోడల్ అధికారి బి. చెన్నయ్య, ఎస్ఐఆర్ ప్రక్రియలోని వివిధ దశలను సవివరంగా వివరించారు. పీఎం-ఐటీ డి. చిరంజీవి, ఈసీఐనెట్ , బీఎల్ఓ యాప్కు సంబంధించిన సాంకేతిక శిక్షణను అందించారు. ఇందులో ఎన్యూమరేషన్ ఫారమ్లను పూరించడం, ఓటర్ల మ్యాపింగ్, సేకరించలేని ఎన్యూమరేషన్ ఫారమ్ల వర్గీకరణ, అలాగే ఇతర అనుబంధ కార్యకలాపాల విధానాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అదనపు ప్రధాన ఎన్నికల అధికారి డా. వాసం వెంకటేశ్వర్ రెడ్డి, ఐఏఎస్, సంయుక్త ప్రధాన ఎన్నికల అధికారి ఎం. సత్యవాణి, ఐఏఎస్, మరియు ఉప ప్రధాన ఎన్నికల అధికారి ఎ.ఎస్. చారిలతో పాటు నోడల్ అధికారులు, సంబంధిత సిబ్బంది కూడా పాల్గొన్నారు.

# బీఆర్ఎస్, బీజేపీలపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆగ్రహం



**పదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని రూ. 8 లక్షల కోట్ల అప్పులపాలు చేశారు**

**డిస్కంలను ముంచేసి, ఇప్పుడు కల్లాల్లోకి వస్తామనడం సిగ్గుచేటు**

**రాష్ట్రం కొంటున్న ధాన్యాన్ని కేంద్రం ఎఫ్సీఐ ద్వారా ఎందుకు కొనడం లేదు?**

**హరీష్ రావు రోజుకో అబద్ధాన్ని సృష్టిస్తూ వార్తల్లో ఉండాలని చూస్తున్నారు**

**నిరంతరం ప్రజల కోసమే పనిచేసే ప్రభుత్వం 'ఇందిరమ్మ రాజ్యం'**

**త్వరలోనే కోటి 15 లక్షల కుటుంబాలకు రూ. 5 లక్షల ఉచిత బీమా**

**రాష్ట్రంలో ఒకే విడతలో రూ. 22 వేల కోట్ల రైతు రుణమాఫీ**

**రూ. 22,500 కోట్లతో 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్ల మంజూరు**

**స్టేషన్ ఘన్పూర్ నియోజకవర్గ అభివృద్ధికి రూ. 60 కోట్లతో విద్యుత్ పనులు**

**బహిరంగ సభలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడి**

**హనుమకొండ జూన్ 09 ( మనం ప్రతినిధి)** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, రాష్ట్రంలోని ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీలు కుమ్మక్కై రైతులను, ప్రజలను వంచిస్తున్నాయని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. జనగామ జిల్లాలోని ఘనపూర్ (స్టేషన్) నియోజకవర్గంలో నూతనంగా ఏర్పాటు చేయనున్న 33/11 కేవీ సబ్ స్టేషన్లకు శంకుస్థాపన, నిర్మాణం పూర్తి చేసుకున్న 33/11 కేవీ సబ్ స్టేషన్లు, 132/33 కేవీ సబ్ స్టేషన్ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని జిల్లాలోని ఘనపూర్ (స్టేషన్) నియోజకవర్గంలోని చిల్పూర్ మండలంలోని పల్లగుట్ట గ్రామంలో అంగరంగవైభవంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి సభాధ్యక్షులు ఘనపూర్ (స్టేషన్) శాసనసభ్యులు కడియం శ్రీహరి, వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు కడియం కావ్య, తెలంగాణ ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ ఛైర్మన్ జంగా రాఘవ రెడ్డి, తెలంగాణ హజ్ కమిటీ ఛైర్మన్ కుసు పాషా, వరంగల్ పశ్చిమ నియోజకవర్గం శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి, పరకాల నియోజకవర్గం శాసనసభ్యులు రేవూరి ప్రకాష్ రెడ్డి, వర్ధన్నపేట నియోజకవర్గం శాసనసభ్యులు కె.ఆర్ నాగరాజు, భూపాలపల్లి నియోజకవర్గం శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణరావు, దొంతి మాధవ రెడ్డి, పాలకుర్తి నియోజకవర్గం శాసనసభ్యులు మామిడాల యశస్విని రెడ్డి, కుడా చైర్మన్, డిసిసి అధ్యక్షులు, హనుమకొండ జిల్లా ఇనుగాల వెంకట్రాం రెడ్డి, డిసిసి అధ్యక్షురాలు, జనగామ జిల్లా లకావత్ ధన్వంతి, జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, జిల్లా కలెక్టర్, హనుమకొండ చాహత్ బాచ్ పాయ్, సియండి ట్రాన్స్కో డి. కృష్ణ భాస్కర్, సియండి టీజీఎన్పిడిసిఎల్, వరంగల్ కర్నాటి వరుణ్ రెడ్డి, కమీషనర్ ఆఫ్ పోలీసు, వరంగల్ సన్ ప్రీత్ సింగ్, హాజరయ్యారు.ముందుగా ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ ఎన్పీడీసీఎల్ ఆధ్వర్యంలో రూ.60.62 కోట్ల వ్యయంతో చేపట్టిన నూతన విద్యుత్ సబ్ స్టేషన్లకు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రారంభోత్సవం, శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా మొత్తం (60,838) మంది వినియోగదారులకు ప్రత్యక్షంగా ప్రయోజనం చేకూర్చే విద్యుత్ మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా 132/33 కేవీ పీచర సబ్ స్టేషన్ - రూ. 43.92 కోట్లు, వేలేరు మండలంలోని పీచరలో 2210/16 ఎంవీఏ సామర్థ్యంతో నిర్మించిన 132/33 కేవీ సబ్ స్టేషన్ను, 33/11 కేవీ కొండాపూర్ సబ్ స్టేషన్ - రూ.2.50 కోట్లు, 33/11 కేవీ సాగరం సబ్ స్టేషన్ - రూ.2.29 కోట్లు, 33/11 కేవీ కుర్చపల్లి సబ్ స్టేషన్ - రూ.2.25 కోట్ల వ్యయంతో చేపట్టిన అభివృద్ధి పనుల శిలాఫలకాలను ఉప ముఖ్యమంత్రి₹ ప్రారంభించారు. అలాగే చిల్పూర్ మండల పరిధిలో రూ. 9.66 కోట్ల వ్యయంతో మూడు నూతన 33/11 కేవీ సబ్ స్టేషన్ల నిర్మాణానికి, పల్లగుట్ట 33/11 కేవీ సబ్ స్టేషన్ - రూ. 3.25 కోట్లు, లింగంపల్లి 33/11 కేవీ సబ్ స్టేషన్ - రూ. 2.81 కోట్లు, నష్కల్ 33/11 కేవీ సబ్ స్టేషన్ - రూ. 3.60 కోట్ల వ్యయంతో నిర్మించనున్న అభివృద్ధి పనుల శిలాఫలకాలకు ₹ఉప ముఖ్యమంత్రి₹ శంకుస్థాపన చేశారు. 'ఇన్ని రోజులు మీరెక్కడికి పోయారు? వర్షానికి తడిసిన ధాన్యాన్ని కూడా మద్దతు ధరకే కొనుగోలు చేసిన చరిత్ర మా కాంగ్రెస్ ప్రభుత్వానిది' అని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ఒకే విడతలో రూ. 22 వేల కోట్ల రైతు రుణమాఫీ చేసిన ఘనత తమదేనని, విమర్శలు మాని దమ్ముంటే కేంద్రం చేత ధాన్యం కొనుగోలు చేయించాలని ప్రతిపక్షాలకు సవాల్ విసిరారు. పేదల గృహనిర్మాణానికి పెద్దపీ గత ప్రభుత్వం 'డబుల్ బెడ్రూమ్' పేరుతో పేదలను వంచించిందని భట్టి విక్రమార్క ధ్వజమెత్తారు. ఇందిరమ్మ ఇళ్లకు ఉన్న డిమాండ్ను దృష్టిలో ఉంచుకుని, తొలి విడతగా రూ. 22,500 కోట్ల వ్యయంతో రాష్ట్రవ్యాప్తంగా 4.50 లక్షల ఇళ్లను మంజూరు చేశామని, ఒక్కో ఇంటికి రూ. 5 లక్షల చొప్పున సాయం అందిస్తున్నామని తెలిపారు. ఈ ఏడాది ప్రతి నియోజకవర్గానికి అదనంగా మరో 2,000 ఇందిరమ్మ ఇళ్లను కేటాయించనున్నట్లు వెల్లడించారు. రాష్ట్రంలో ఇల్లే లేని నిరుపేద కుటుంబం ఉండకూడదన్నదే ప్రభుత్వ సంకల్పమన్నారు. -- మహిళా సాధికారతకు అండ మహిళా సంఘాలకు రెండున్నరేళ్లలోనే రూ. 67 వేల కోట్ల బ్యాంక్ లింకేజ్ రుణాలు ఇప్పించామని, ఐదేళ్లలో ఈ మొత్తాన్ని రూ. 1.25 లక్షల కోట్లకు పెంచుతామని భట్టి విక్రమార్క వెల్లడించారు. మహిళా సంఘాలే స్వయంగా బస్సులు కొనుగోలు చేస్తే, వాటిని ఆర్టీసీలో తిప్పి వారికి స్థిరమైన ఆదాయం కల్పించే వినూత్న కార్యక్రమాన్ని దిగ్విజయంగా అమలు చేస్తున్నామని వివరించారు. స్థానిక సమస్యలపై సానుకూల స్పందన సభలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి కోరిన పలు అభివృద్ధి పనులపై ఉప ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారు. రఘునాథపాలెంలో 232 కేవీ సబ్స్టేషన్ అప్గ్రేడేష్ప తక్షణమే సాధ్యసాధ్యాల (ఊ్బుఱఱఱజీజూఱజ్ఱీడఱఖ్ఱీఱఅ) పరిశీలన జరిపి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అలాగే గ్రామాల్లో ఇళ్లపై ప్రమాదకరంగా ఉన్న కరెంట్ లైన్ల మార్పిడి (ఔఱఱ్ఖ ఖఱఱఱఱజ్ఱ్ఱఱఱజ) పనుల కోసం ప్రత్యేక నిధులు మంజూరు చేస్తానని సభాముఖంగా మాట ఇచ్చారు. గతంలో పక్కనబెట్టిన ఎస్సీ, ఎస్టీ సబ్ప్లాన్ చట్టాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం తూచా తప్పకుండా అమలు చేస్తోందని, ఈ నియోజకవర్గానికి కూడా సబ్ప్లాన్ నిధులు పెద్ద ఎత్తున వస్తాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు కడియం కావ్య మాట్లాడుతూ.. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఉచిత విద్యుత్ పథకాన్ని అమలు చేస్తూ పేదల సంక్షేమానికి కృషి చేస్తోందని తెలిపారు. గృహ జ్యోతి పథకం కింద 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందించడం చారిత్రాత్మక నిర్ణయమని పేర్కొన్నారు. ఘనపూర్ (స్టేషన్) నియోజక వర్గాన్ని రాష్ట్రంలో ఆదర్శంగా నిలుస్తోందని అభిప్రాయపడ్డారు. ఘనపూర్ (స్టేషన్) శాసనసభ్యులు కడియం శ్రీహరి మాట్లాడుతూ.. ఘనపూర్ (స్టేషన్) ప్రాంత అభివృద్ధికి ఈ విద్యుత్ సబ్ స్టేషన్లు కీలకమన్నారు. ఒకప్పుడు వలసలకు కేంద్రంగా ఉన్న ఈ ప్రాంతం దేవాదుల ప్రాజెక్టు, ఉచిత విద్యుత్ వల్ల వ్యవసాయ అభివృద్ధి సాధించిందని తెలిపారు. రైతుల ప్రతి గింజను కొనుగోలు చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని చెప్పారు. రఘునాథపల్లి 132 కేవీ సబ్ స్టేషన్ను అప్గ్రేడ్ చేయాలని, లైన్ షిఫ్టింగ్ పనులకు నిధులు మంజూరు చేయాలని, ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధుల కూడా కేటాయించాలని ఉప ముఖ్యమంత్రిని కోరారు. జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ.. రైతులు, ప్రజలకు నిరంతర, నాణ్యమైన విద్యుత్ అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఇందిరా రైతు సేవా కేంద్రాల మహిళలకు ఈ అభివృద్ధి కార్యక్రమాలు మరింత స్ఫూర్తినిస్తాయని పేర్కొన్నారు. టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి మాట్లాడుతూ.. రూ. 60.62 కోట్ల వ్యయంతో ఘనపూర్ (స్టేషన్) నియోజకవర్గంలో పలు విద్యుత్ సబ్ స్టేషన్లను ప్రారంభించుకోవడం జరిగిందని తెలిపారు. ప్రజలకు నాణ్యమైన, నిరంతర విద్యుత్ సరఫరా అందించేందుకు సంస్థ కట్టుబడి ఉందని పేర్కొన్నారు. లోడ్ మేనేజ్మెంట్ మెరుగుపడటంతో విద్యుత్ సరఫరా మరింత స్థిరంగా ఉంటుందని తెలిపారు. ట్రాన్స్కో సీఎండీ మాట్లాడుతూ.. విద్యుత్ రంగ అభివృద్ధి కార్యక్రమాలకు అభినందనలు తెలిపారు. అధిక లోడ్ సమయంలో సమర్థవంతమైన విద్యుత్ నిర్వహణ ద్వారా సరఫరాలో అంతరాయాలు తగ్గుతాయని, వ్యవస్థ మరింత బలపడుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో డిసిసి అధ్యక్షురాలు, జనగామ జిల్లా లకావత్ ధన్వంతి, జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, జిల్లా కలెక్టర్, హనుమకొండ చాహత్ బాచ్ పాయ్, సియండి ట్రాన్స్కో డి. కృష్ణ భాస్కర్, సియండి టీజీఎన్పిడిసిఎల్, వరంగల్ కర్నాటి వరుణ్ రెడ్డి, కమీషనర్ ఆఫ్ పోలీసు, వరంగల్ సన్ ప్రీత్ సింగ్, డిసిపి జనగామ బి.రాజ మహేంద్ర నాయక్, జిల్లా గ్రంథాలయ సంస్థ, జనగామ, ఛైర్మన్ మారుజోడు రాంబాబు, ఘనపూర్ (స్టేషన్) మునిసిపల్ ఛైర్మన్ తాటికొండ వినయ్ కుమార్, వ్యవసాయ మార్కెట్ కమిటీ, ఘన్పూర్ (స్టేషన్), ఛైర్మన్ లావణ్య శిరీష్ రెడ్డి, చిల్పూర్ గుట్ట దేవస్థానం, ఛైర్మన్ పొట్లపల్లి శ్రీధర్ రావు, పల్లగుట్ట గ్రామం, సర్పంచి, ఎనగందుల నర్సింహా రెడ్డి, సాగరం సర్పంచి, మమత చేతన్, కొండాపూర్ సర్పంచి, గుగులోత్ దేవేందర్, కుర్చపల్లి సర్పంచి, బైకాని రాజు, నష్కల్ సర్పంచి రాజు తదితరులు పాల్గొన్నారు

## ఈనేల 20న 2వ జాతీయ లోక్ అదాలత్

**వరంగల్, జూన్ 09(మనం ప్రతినిధి):** తెలంగాణ రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని కోర్టుల్లో, హైకోర్టుతో సహా 2026 జూన్ 20న 2వ జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద తెలిపారు. లోక్ అదాలత్ ద్వారా వివిధ రకాల సివిల్, రాజీకి అనువైన క్రిమినల్, మోటారు ప్రమాద పరిహారం, బ్యాంకు రుణాలు, కుటుంబ వివాదాలు తదితర కేసులను పరస్పర అంగీకారంతో త్వరితగతిన పరిష్కరించుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ కేసులను లోక్ అదాలత్లో పరిష్కరించుకోవాలని కోరారు. సంబంధిత శాఖలు, అధికారులు మరియు న్యాయ సేవా సంస్థలు విస్తృత ప్రచారం నిర్వహించి ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గరిష్ట సంఖ్యలో ప్రజలు పాల్గొని లోక్ అదాలత్ సేవలను వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ ఒక ప్రకటన ద్వారా తెలిపారు.


## రోడ్డు ప్రమాద భీమా చెక్‌ను అందజేసిన సీపీ



**హనుమకొండ జూన్ 09 (మనం ప్రతినిధి):** రోడ్డు ప్రమాదం మరణించిన కానిస్టేబుల్ కుటుంబానికి వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ చేతుల మీదుగా మంగళవారం ప్రమాద బీమా చెక్ ను అందజేశారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఏ. ఆర్. కానిస్టేబుల్ గా పని చేస్తున్న ఆర్. సతీష్ గత సంవత్సరం మే 15వ తారీకు స్టేషన్ ఘన్ పూర్ మండల కేంద్రంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్ తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మరణించాడు. దీనితో మరణించిన కానిస్టేబుల్ కుటుంబ సభ్యులకు వరంగల్ పోలీస్ కమిషనర్ చేతుల మీదుగా 5లక్షల రూపాయల ప్రమాద బీమా చెక్ అందజేశారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మరణించిన కానిస్టేబుల్ కుటుంబానికి అందాల్సిన బెనిఫిట్స్ త్వరగా అందజేయాలని సీపీ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీలు రవి, సురేష్ కుమార్, సూపరింటెండ్ సంధ్య, సహాయకులు తులసి పాల్గొన్నారు

## బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణలో నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి

- జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



**హనుమకొండ జూన్ 9 (మనం ప్రతినిధి):** ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా అటవీ, పర్యావరణ పరిరక్షణ అంశాలపై అవగాహన కల్పించేందుకు జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆదేశాల మేరకు వరంగల్ ఐఎంఏ హాల్లో బయో మెడికల్ వేస్ట్ మేనేజ్మెంట్ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ ప్రజారోగ్య పరిరక్షణతో పాటు పర్యావరణ సమతుల్యతను కాపాడడంలో బయోమెడికల్ వ్యర్థాల శాస్త్రీయ నిర్వహణ కీలకమని అన్నారు. ఆసుపత్రుల్లో ఉత్పత్తి అయ్యే వ్యర్థాలను మూలస్థాయిలోనే వేరు చేయడం, నిర్దేశిత రంగుల కవర్లు, డబ్బాల్లో నిల్వ చేయడం, సురక్షితంగా తరలించి నిర్వీర్యం చేయడం వంటి అంశాల్లో వైద్య సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు.బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణ నిబంధనలను ప్రతి వైద్య సంస్థ కచ్చితంగా పాటించాలని, ఫ్రంట్లైన్ ఆరోగ్య కార్యకర్తలు వ్యక్తిగత భద్రతా చర్యలను తప్పనిసరిగా అనుసరించాలని కలెక్టర్ తెలిపారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా తగ్గించి, క్లాత్ బ్యాగుల వినియోగాన్ని ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఎన్ఐటీ వరంగల్ ప్రొఫెసర్ డాక్టర్ ఆనంద్ కుమార్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా బయోమెడికల్ వ్యర్థాల వర్గీకరణ, రంగుల వారీగా వ్యర్థాల నిల్వ, సేకరణ, రవాణా, నిల్వ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి నిబంధనల గురించి సవివరంగా వివరించారు. పసుపు, ఎరుపు, నీలం, తెలుపు రంగుల కవర్లు, డబ్బాల్లో వేర్వేరు రకాల వ్యర్థాలను వేరు చేసి నిల్వ చేయాల్సిన విధానం, పదునైన వ్యర్థాల నిర్వహణ, సోడియం హైపోక్లోరైట్ వినియోగం, వ్యర్థాల సురక్షిత నిల్వపై అవగాహన కల్పించారు. ఆసుపత్రుల్లో వ్యర్థాలు ఎక్కువసేపు నిల్వ కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, నిల్వ కేంద్రాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి. సాంబశివరావు, ఎన్ఐటీ వరంగల్ ప్రొఫెసర్ డాక్టర్ ఆనంద్ కుమార్, కాలుష్య నియంత్రణ మండలి అధికారి సునీత, పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ బాలకృష్ణ, జిల్లా అధికారులు, ఐఎంఏ కార్యదర్శి డాక్టర్ నరేష్ కుమార్, డిప్యూటీ డీఎంహెచ్ఓలు, ప్రోగ్రాం అధికారులు, వైద్యాధికారులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల ప్రతినిధులు పాల్గొన్నారు.

## హనుమకొండ ట్రాఫిక్ సీఐ బాధ్యతల స్వీకరణ



**హనుమకొండ జూన్ 09 (మనం ప్రతినిధి):** వరంగల్ పోలీస్ కమిషనర్ ఉత్తర్వుల మేరకు హనుమకొండ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ గా ప్రవీణ్ కుమార్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హనుమకొండ పరిధిలో ట్రాఫిక్ నియంత్రణ కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం ట్రాఫిక్ అధికారులు, సిబ్బంది నూతన ఇన్స్పెక్టర్ కు పుష్పగుచ్ఛాలు అందించి అభినందనలు తెలిపారు

## ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యం



**మహాదేవపూర్ జూన్ 9మనం న్యూస్:** మండలకేంద్రంలోని ఐదవవార్డ్ లో అనారోగ్యం తో బాధపడుతున్నటువంటి పింఛను దారులకు వారి ఇంటి వద్ద నే ఈ కేవైసీచేయించడం జరుగుతుంది పెన్షన్ లబ్ధిదారులు కార్యాలయ చుట్టూ తిరుగుకుండా వారి ఇంటి వద్దనే సేవలు అందేలా చర్యలు చేపట్టారు ఈ సందర్భంగా లబ్ధిదారులు కుటుంబ సభ్యులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకొని ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రయోజనాలను నిరంతరాయంగా అందేలా ఖుషి చేసినట్టు తెలిపారు ప్రజలకు చేరువగా ఉంటూ ముఖ్యంగా వికలాంగులు అనారోగ్యంగా బాధితులకు అవసరమైన సేవలను వారి గడప వద్దకే తీసుకెళ్లడం అభినందనీయం అని గ్రామస్తులు పేర్కొన్నారు సర్పంచ్ హసీనా భాను సేవా దృక్పథాన్ని గ్రామ ప్రజలు ప్రశాంతించారు ఈ కార్యక్రమంలోగ్రామ సర్పంచ్ హసీనా బాను వార్డ్ సభ్యులు పడాల రాజమౌళి గ్రామ పంచాయతీ సిబ్బంది సంతోష్ పాల్గొన్నారు

## ఎనుమాముల ఈవీఎం గోదామును తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్



**హనుమకొండ జూన్ 09(మనం ప్రతినిధి ):** త్రైమాసిక తనిఖీ షెడ్యూల్లో భాగంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మంగళవారం ఎనుమాముల మార్కెట్ యార్డ్లోని ఈవీఎం గోదామును వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గోదాంలో భద్రపరిచిన ఈవీఎంల నిర్వహణ, భద్రతా ఏర్పాట్లు, సీసీటీవీ పర్యవేక్షణ వ్యవస్థ, ప్రవేశ నియంత్రణ చర్యలను పరిశీలించారు.గోదాం వద్ద అమలులో ఉన్న భద్రతా ప్రమాణాలు, రికార్డుల నిర్వహణపై పరిశీలించారు. ఎ తనిఖీలో అదనపు కలెక్టర్ రెవెన్యూ జి సంధ్యారాణి, వరంగల్ తహసిల్దార్ శ్రీకాంత్ మరియు ఎన్నికల విభాగ డిటి రంజిత్, సంబంధిత అధికారులు, సిబ్బంది, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## రాష్ట్రీయ బాల్ పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

**హనుమకొండ , జూన్ 9:( మనం ప్రతినిధి )** దేశ నిర్మాణంలో విశిష్ట ప్రతిభ కనబరిచిన బాలలను గుర్తించి ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం అందించే ప్రధాన్ మంత్రి రాష్ట్రీయ బాల్ పురస్కార్ (PMRBP)-2026 కోసం నామినేషన్లు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద తెలిపారు.ధైర్యసాహసం, సామాజిక సేవ, పర్యావరణ పరిరక్షణ, క్రీడలు, కళలు-సంస్కృతి, విజ్ఞాన శాస్త్రం మరియు సాంకేతిక రంగాలలో అసాధారణ ప్రతిభ కనబరిచిన 18 సంవత్సరాల లోపు బాలలు ఈ పురస్కారానికి అర్హులని పేర్కొన్నారు. అర్హులైన బాలల ప్రతిభను జాతీయ స్థాయిలో గుర్తించి గౌరవించేందుకు ఈ అవార్డులు అందజేయబడతాయని తెలిపారు. నామినేషన్లు రాష్ట్రీయ పురస్కార్ పోర్టల్ ద్వారా ఆన్లైన్లో మాత్రమే స్వీకరించబడతాయని, అర్హులైన బాలల వివరాలను సంబంధిత అధికారులు, విద్యాసంస్థలు, స్వచ్ఛంద సంస్థలు మరియు ప్రజలు గుర్తించి సిఫారసు చేయాలని కోరారు. బాలికలు, ఎస్సీ, ఎస్టీ, బలహీన వర్గాలు, దివ్యాంగులలోని ప్రతిభావంతులను ప్రత్యేకంగా గుర్తించి నామినేషన్లు పంపించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

ప్రధాన్ మంత్రి రాష్ట్రీయ బాల్ పురస్కార్-2026 నామినేషన్లకు జూలై 31, 2026 చివరి తేదీ కాగా, జిల్లా స్థాయిలో పరిశీలన కోసం సంబంధిత వివరాలను జూన్ 30, 2026లోగా కలెక్టర్ కార్యాలయానికి సమర్పించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద తెలిపారు.

## మార్కెట్ యార్డును సందర్శించిన జిల్లా కలెక్టర్



**వరంగల్, జూన్ 9(మనంన్యూస్):** జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మంగళవారం ఎనుమాముల మార్కెట్ యార్డును సందర్శించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎంపికైన మార్కెట్ కమిటీ చైర్పర్సన్ ఎర్ర ప్రియాంక జిల్లా కలెక్టర్కు పూల బొకేతో స్వాగతం పలికారు. అనంతరం మార్కెట్ యార్డులోని పలు అంశాలపై జిల్లా కలెక్టర్ అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మార్కెటింగ్ అధికారి సురేఖ, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు రవీంద్ర రెడ్డి, వైస్ చైర్మన్ జనార్ధన్, మార్క్ఫెడ్ జిల్లా మేనేజర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## భారీ బైక్ ర్యాలీని ప్రారంభించిన ఎంపీ

**హనుమకొండ జూన్ 09 (మనం ప్రతినిధి):** ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క పర్యటన సందర్భంగా పార్టీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలతో కలిసి నిర్వహించిన భారీ బైక్ ర్యాలీని డాక్టర్ కడియం కావ్య పార్టీ జెండా ఊపి ప్రారంభించారు. పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొనడంతో ర్యాలీ ఉత్సాహభరితంగా సాగింది. చిల్పూర్ మండలం పల్లగుట్టలో నిర్వహించిన అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గానికి తొలిసారిగా విచ్చేసిన ఉప ముఖ్యమంత్రి మల్లు బట్టి విక్రమార్క కి వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య పుష్పగుచ్ఛం అందజేసి సాదరంగా ఆహ్వానించి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నాయకులు, అధికారులు, పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## వంగరలో గర్భిణులకు వైద్య పరీక్షలు



**భీమదేవరపల్లి, జూన్ 9 మనం న్యూస్:** మాజీ ప్రధాని పివి స్వగ్రామ వంగరలో గర్భిణీలకు ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించారు. మంగళవారం రోజున వైద్యాధికారి డాక్టర్ రుబీనా ఆధ్వర్యంలోవంగరప్రాథమిక ఉన్నత ఆరోగ్య కేంద్రంలో ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ పదవ వార్షికోత్సవ సందర్భంగా గర్భిణీలకు రక్త పరీక్షలు ,సాధారణ ఆరోగ్య పరీక్షలు, అధిక ప్రమాద గర్భిణులను గుర్తించి, రక్తహీనత ఉన్న గర్భిణులకు ఐరన్ సుప్రోస్ ఇంజక్షన్ ను అందజేయడం జరిగిందని, గర్భధారణ సమయంలో ప్రసూతి పూర్వ పరీక్షలు తో పాటు సమతుల్య పోషకాహారం తీసుకోవడం గర్భాధనలో కల్పించే ప్రమాద సూచనలు వంటి అంశాలపై గర్భిణులకు అవగాహన కల్పించామని తెలిపారు. అనంతరం గర్భిణులకు పండ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ వాణి, నర్సింగ్ సిబ్బంది, ఫీల్ అసిస్టెంట్, ఆశా వర్కర్లు ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు



## హిందీ కంటే సౌత్ సినిమాలే మెరుగ్గా రాణిస్తున్నాయి: కాజల్

వృత్తిపరమైన అంశాల్లో దక్షిణాది చిత్ర పరిశ్రమదే పైచేయి అంటున్నారు హీరోయిన్ కాజల్ అగర్వాల్. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమెకు.. 'నటీ మణులకు ఉత్తరాదిలో మెరుగైన అవకాశాలు లభిస్తున్నాయా? లేక దక్షిణాదిలోనా?' అనే ప్రశ్న ఎదురైంది. దీనికి కాజల్ అగర్వాల్ బదులిస్తూ- ''అవకాశాలైతే రెండు చోట్ల (ఉత్తరాది, దక్షిణాది) ఉన్నాయని నేను నమ్ముతున్నాను. కానీ, వృత్తిపరమైన నైపుణ్యం, నిబద్ధత విషయాల్లో మాత్రం దక్షిణాది ఉన్నతమైనది. అద్భుతమైన దర్శకులు, గొప్ప సాంకేతిక నిపుణులు, కథాంశాలు, సృజనాత్మకత మనకు సౌత్ లోనే కనిపిస్తున్నాయి.

దక్షిణాది సినిమా పరిధి కూడా పెరిగింది. చాలా హిందీ సినిమాల కంటే సౌత్ సినిమాలు మెరుగ్గా రాణిస్తున్నాయి'' అని పేర్కొన్నారు. కాజల్ అగర్వాల్ లీడ్ రోల్ లో నటించిన 'ది ఇండియా స్టోరీ' మూవీ జూలై 24న రిలీజ్ కానుంది. అలాగే బాలకృష్ణ-గోపీచంద్ కాంబినేషన్ లో రూపొందుతోన్న సినిమాలో హీరోయిన్గా, రణ్ బీర్ కపూర్ 'రామాయణ' చిత్రంలో ఓ ప్రధాన పాత్రలో కాజల్ నటిస్తున్నారు.

## ముక్కోణపు వన్డే సిరీస్..
# శ్రీలంకపై భారత్ విజయం

ముక్కోణపు వన్డే సిరీస్ లో భాగంగా దంబుల్లా వేదికగా శ్రీలంక అతో జరిగిన మ్యాచ్ లో టీమ్ఇండియా A విజయం సాధించింది. చివరివరకు ఉత్కంఠ భరితంగా సాగిన మ్యాచ్ లో 8 పరుగుల తేడాతో గెలిచింది. తొలుత భారత్ 277/6 స్కోర్ చేయగా.. లక్ష్య ఛేదనలో శ్రీలంక 269 (48.5 ఓవర్లు) పరుగులకు ఆలౌటైంది. సహన్(74) అర్ధశతకంతో ఆకట్టుకున్నాడు. నిరోషన్(47), అవిష్క(45), సదీరా(46) రాణించినా మిగతా బ్యాటర్లు విఫలమవడంతో శ్రీలంకకు ఓటమి తప్పలేదు. అర్షద్, అనుకుల్, ఆయుష్, విప్రజ్ తలో రెండేసి వికెట్లు తీయగా.. అంశుల్ ఒక వికెట్ పడగొట్టాడు. అర్షద్ వేసిన చివరి ఓవర్లోనే మూడు వికెట్లు పడ్డాయి. షిరాజ్(23) రనౌటయ్యాడు. శతకం బాదిన రుతురాజ్ గైక్వాడ్.. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ గా నిలిచాడు.

### గైక్వాడ్ సెంచరీ.. తిలక్ వర్మ హాఫ్ సెంచరీ

టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన భారత్.. నిర్ణీత 50 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 277 పరుగులు చేసింది. రుతురాజ్ గైక్వాడ్ (101) శతకంతో చెలరేగాడు. కెప్టెన్ తిలక్ వర్మ (60) అర్ధశతకం చేశాడు. చివర్లో షెడ్గే (26*; 14 బంతుల్లో 1x4, 2x6) కీలక ఇన్నింగ్స్ ఆడాడు. వైభవ్ సూర్యవంశీ (14) నిరాశపరిచాడు. శ్రీలంక బౌలర్లలో షిరాజ్ 2 వికెట్లు పడగొట్టగా.. కరుణరత్నే, సంకేత్, వనుజా తలో వికెట్ తీశారు.





## సింధు టైటిల్ ఆశ తీరేనా!

ఈ సీజన్లో అయిదు నెలలు పూర్తయినా భారత బ్యాడ్మింటన్ స్టార్ పి.వి.సింధు ఒక్క టైటిల్ సాధించలేకపోయింది. సింగపూర్, థాయ్ లాండ్ ఓపెన్లలో క్వార్టర్స్ లో ఓడిన సింధు.. ఇండోనేసియా ఓపెన్లో రెండో రౌండ్లో ఇంటిముఖం పట్టింది. ఈ నేపథ్యంలో ఆస్ట్రేలియన్ ఓపెన్లో మరోసారి టైటిల్ కోసం సింధు బరిలో దిగుతోంది. మంగళవారం ఆరంభం కానున్న ఈ టోర్నీలో ఆమె ఎలాంటి ప్రదర్శన చేస్తుందో చూడాలి. మహిళల సింగిల్స్ తొలి రౌండ్లో లూసియా కాస్టిల్లో (పెరూ)తో సింధు తలపడనుంది. మరో తొలి రౌండ్ పోరులో హాన్ గ్జియాన్ (చైనా)తో ఇషారాణి బారువా పోటీపడనుంది. చియాన్ (చైనీస్ తైపీ)తో తన్వి శర్మ.. ఒకుహర (జపాన్)తో అన్మోల్.. వాంగ్ లింగ్ (మలేసియా)తో ఆకర్షి కశ్యప్ పోటీపడనున్నారు. పురుషుల సింగిల్స్ లో మో జాకీ (ఇండోనేసియా)తో ప్రణయ్, జస్టిన్ హో (మలేసియా)తో కిరణ్ జార్జ్ తొలి రౌండ్ మ్యాచ్ లు ఆడతారు. పురుషుల డబుల్స్ లో హరిహరన్-అర్జున్, అచ్యుతాదిత్య రావు-అర్జున్ రెడ్డి, మిక్స్డ్ డబుల్స్ లో ధ్రువ్ కపిల-తనీషా క్రాస్టో జంటలు ఈ టోర్నీలో ఆడుతున్నాయి.

## ఆస్ట్రేలియాపై బంగ్లాదేశ్ సంచలన విజయం

ప్రపంచ ఛాంపియన్ ఆస్ట్రేలియాకు పసికూన బంగ్లాదేశ్ ఊహించని షాకిచ్చింది. స్వదేశంలో మూడు మ్యాచ్ ల వన్డే సిరీస్ లో భాగంగా ఇవాళ (జూన్ 9) జరిగిన తొలి మ్యాచ్ లో 86 పరుగుల తేడాతో సంచలన విజయం (డక్ వర్త్ లూయిస్) సాధించింది. తద్వారా సిరీస్ లో 1-0 ఆధిక్యంలోకి వెళ్లింది.

36 ఏళ్ల చరిత్రలో బంగ్లాదేశ్ ఆస్ట్రేలియాపై వన్డేల్లో విజయం సాధించడం ఇది రెండోసారి మాత్రమే. 2005లో కార్డిఫ్ లో జరిగిన మ్యాచ్ లో తొలిసారి బంగ్లా జట్టు ఆసీస్ కు షాకిచ్చింది.

ఢాకాలోని షేర్-ఏ-బంగ్లా స్టేడియం వేదికగా జరిగిన తాజా మ్యాచ్ లో టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన బంగ్లాదేశ్.. ఆరో నంబర్ ఆటగాడు మొసద్దెక్ హొస్సేన్ (86 నాటౌట్) సంచలన




ఇన్నింగ్స్ ఆడటంతో నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 284 పరుగులు చేసింది.

లక్ష్య ఛేదనలో ఆస్ట్రేలియా బ్యాటర్లు ఘోరంగా విఫలమయ్యారు. బ్యాటింగ్ లో సత్తా చాటిన మొసద్దెక్ (10-1-37-2) బౌలింగ్ లోనూ చెలరేగడంతో ఆస్ట్రేలియా 42.2 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 191 పరుగులు చేసింది. ఈ దశలో వర్షం అంతరాయం కలిగించడంతో డీఎల్ఎస్ పద్ధతిలో బంగ్లాదేశ్ను విజేతగా ప్రకటించారు.

## భారీ స్కామ్‌లో చిక్కుకున్న సన్నీ లియోన్..

బాలీవుడ్ హాట్ బ్యూటీ సన్నీ లియోన్కు తెలుగు, హిందీ సినిమాలతో మెప్పించిన ఈ భామ స్పెషల్ సాంగ్స్ కూడా చేసి ప్రేక్షకుల విశేషంగా ఆకట్టుకుంది. కానీ గత కొద్ది కాలంగా ఈ అమ్మడు ఎక్కువగా బాలీవుడ్ పైనే ఎక్కువ ఫోకస్ చేస్తోంది. అక్కడే వరుస చిత్రాల్లో నటిస్తూ ప్రేక్షకులను అలరిస్తోంది. ఇదిలా ఉంటే.. తాజాగా, సన్నీ లియోన్ వివాదంలో చిక్కుకున్నట్లు సోషల్ మీడియాలో పలు పోస్టులు హాట్ టాపిక్గా మారాయి. కర్ణాటక రాష్ట్రానికి చెందిన శివమ్ అసోసియేట్స్ భారీ కుంభకోణంలో సన్నీ లియోన్ పేరు బయటకు రావడం గమనార్హం. రూ, 2400 కోట్ల భారీ ఫోంజి కుంభకోణంలో ఆమెకు సీఐడీ నోటిసులు జారీ చేసినట్లు సమాచారం. శివం అసోసియేట్స్ అనే సంస్థ కస్టమర్ల నుంచి అక్రమంగా రూ.2400 కోట్ల నగదు డిపాజిట్లను సేకరించిందనే ఆరోపణలు ఉన్న విషయం తెలిసిందే. ఇక ఈ సంస్థ యజమాని శివానంద నీలణ్ణవరపై గతంలోనే కేసులు నమోదయ్యాయి.

అయితే, ఈ అక్రమ సొమ్ముతో గతేడాది డిసెంబరులో నిర్వహించిన 'కన్నడ ఉత్సవం'లో పలువురు సినీ నటులు పాల్గొన్నట్లు సీఐడీ గుర్తించింది. ఈ వేడుకల్లో పాల్గొన్నందుకు గాను నటులకు పెద్ద ఎత్తున నగదు పంపిణీ జరిగిందని అధికారులు అనుమానిస్తున్నారు. ఈ సంస్థ యజమాని 2023లో 'ఛాంపియన్' అనే సినిమా తీశారు. ఇందులో ఒక స్పెషల్ సాంగ్ చేసినందుకు గాను నటి సన్నీ లియోన్కు ఏకంగా రూ. 1 కోటి పారితోషికం ఇచ్చినట్లు రికార్డుల్లో తేలింది. ప్రజల నుంచి వసూలు చేసిన అక్రమ సొమ్మునే ఆమెకు రెమ్యూనరేషన్గా ఇచ్చారా అనే కోణంలో పోలీసులు ఆరా తీస్తున్నారు. దీనిపై వివరణ ఇవ్వాలని కోరుతూ తాజాగా ఆమెకు నోటీసులు కూడా పంపినట్లు వార్తలు వస్తున్నాయి. కేవలం సన్నీ లియోన్ మాత్రమే కాకుండా, గత డిసెంబర్లో ఈ సంస్థ నిర్వహించిన ఒక వేడుకలో పాల్గొన్న కన్నడ నటులు డాలి ధనుంజయ, సప్తమీ గౌడ, వశిష్ఠ సింహ, రాగిణి ద్వివేదిలకు కూడా నోటీసులు ఇచ్చేందుకు సి.ఐ.డి సిద్ధమైందనే వార్తలు సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారాయి.



## మహ్మద్ సిరాజ్ స్థానంలో.. ప్రసిద్ధ్ కృష్ణ ఎంపిక

భారత క్రికెట్ జట్టు త్వరలో ఐర్లాండ్, ఇంగ్లాండ్ పర్యటనకు వెళ్లనుంది. జూన్ 26న ఐర్లాండ్ తో మొదటి టీ20, జూన్ 28న రెండో టీ20 మ్యాచ్ ఆడనుంది. అనంతరం జులై 1 నుంచి ఇంగ్లాండ్ తో తలపడనుంది. ఇందులో భాగంగా అయిదు టీ20లు ఆడనుంది. అయితే ఐర్లాండ్, ఇంగ్లాండ్ తో మ్యాచు ల్లో సిరాజ్ కు విశ్రాంతినిచ్చారు. అతడికి బదులు ప్రసిద్ధ్ కృష్ణకు 15 మంది సభ్యుల బృందంలో స్థానం కల్పించారు. సిరాజ్.. వర్క్ లోడ్ మేనేజ్ మెంట్ లో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు బీసీసీఐ ప్రకటించింది. 'బీసీసీఐ వైద్య బృందం, టీమ్ మేనేజ్ మెంట్ తో చర్చల అనంతరం వర్క్ లోడ్ మేనేజ్ మెంట్ లో భాగంగా సిరాజ్ కు విశ్రాంతి ఇవ్వాలని సూచించారు' అని బీసీసీఐ ఓ ప్రకటనలో తెలిపింది.



## నేను చనిపోయానని ఫొటోలు వేశారు

**– జగపతి బాబు**

సినిమాలో కాకుండా బయట కూడా నటిస్తూ బతకాల్సిన అవసరం తనకు లేదన్నారు నటుడు జగపతి బాబు. అందుకే ఏదైనా ఉన్నది ఉన్నట్లు నిర్మొహమాటంగా మాట్లాడటం నేర్చుకున్నట్లు తెలిపారు. ఇటీవల 'పెద్ది'లో అప్పలసూరి పాత్రతో మెప్పించిన ఆయన.. ఈ సినిమా విడుదల అనంతరం వరుస ఇంటర్వ్యూలు ఇస్తున్నారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో కొన్ని ఆసక్తికర విషయాలు పంచుకున్నారు.



''ఒకప్పుడు ఫ్యామిలీ ఆడియన్స్ వల్లే నాకు ఇంత గుర్తింపు వచ్చింది. ఇప్పుడు నన్ను అందరూ ఆదరిస్తున్నారు. ఎందుకంటే నేను అందరు హీరోలతో కలిసి నటిస్తున్నాను. నా కెరీర్, జీవితంలో ఏ విషయంలోనూ పశ్చాత్తాపం లేదు. కోల్పోయిన దాని గురించి ఎప్పుడూ ఆలోచించను. జీవితంలో ఎదురయ్యే ప్రతి సంఘటన ఏదోఒక పాఠాన్ని నేర్పుతుంది. అబద్ధాలు ఎవరైనా చెబుతారు. 'నేను జీవితంలో అబద్ధం చెప్పలేదు' అని మనకు ఎవరైనా చెప్పారంటే అదే పెద్ద అబద్ధం. నిజం చెప్పి కూడా బతకొచ్చని అర్థమైంది. అప్పటినుంచే నిర్మొహమాటంగా మాట్లాడుతున్నా. అనవసరంగా నిజం దాచడం, ప్రతిదానికి అబద్ధం ఆడుతూ బతకాల్సిన అవసరం ఏముంది. నిజజీవితంలోనూ నటించాల్సిన అవసరం లేదు కదా'' అని అన్నారు.

''నన్ను ట్రోల్ చేయడానికి నెటిజన్ లకు చాలా అవకాశాలే వచ్చాయి. కానీ, మిగతావారితో పోలిస్తే నన్ను చాలా తక్కువ ట్రోల్ చేశారు. గతంలో ఒకసారి నేను చనిపోయానని.. ఎన్టీఆర్ ఏడుస్తోన్న ఫొటోను పక్కన పెట్టి వ్యూస్ కోసం వీడియోలు చేశారు. ఆ తర్వాత అది కూడా మానేశారు. అలాంటి వాటి గురించి నేను అసలు పట్టించుకోను. పనిలేని వాళ్లు చేసే పనులు అవి. అలాంటి వాటికి స్పందించను. నా జీవితాన్ని నాకు నచ్చినట్లు బతుకుతూ ఆస్వాదిస్తున్నాను'' అని జగపతిబాబు చెప్పారు.



## రామ్ చరణ్‌ని చూసి గర్వపడుతున్నా..

**– అల్లు అర్జున్ ప్రశంసలు**

'పెద్ది'లో రామ్ చరణ్ అద్భుతంగా నటించారని ప్రశంసించారు అగ్ర కథానాయకుడు అల్లు అర్జున్. చరణ్ హీరోగా బుచ్చిబాబు దర్శకత్వంలో తెరకెక్కిన 'పెద్ది' ఇటీవల విడుదలై ప్రేక్షకాదరణ సొంతం చేసుకుంటోంది. ఈ నేపథ్యంలో చరణ్ ను చూస్తుంటే ఎంతో గర్వంగా ఉందంటూ అల్లు అర్జున్ పోస్ట్ పెట్టారు.

''పెద్ది చూశాను. రామ్ చరణ్ నటన మైండ్ బ్లోయింగ్ గా ఉంది. సహజమైన నటన, బాడీ ట్రాన్స్ఫర్మేషన్ తో పాటు డ్యాన్స్ మూమెంట్స్ అన్నిట్లో ఉత్తమ ప్రదర్శన ఇచ్చాడు. ప్రతి సన్నివేశంలోనూ అద్భుతంగా చేశాడు. ఒక్క మాటలో చెప్పాలంటే చరణ్ ను చూసి నిజంగా గర్వపడుతున్నా'' అంటూ ప్రశంసలు కురిపించారు. అప్పలసూరి పాత్రలో జగపతిబాబు జీవించేశారని కొనియాడారు. జాన్వీకపూర్ తన నటనతో ఆకట్టుకుందని అభినందించారు. చిత్రం కోసం పనిచేసిన అందరికీ అల్లు అర్జున్ శుభాకాంక్షలు తెలిపారు. దర్శకుడు బుచ్చిబాబును ప్రత్యేకంగా మెచ్చుకున్నారు. అందరి క్యారెక్టర్ లను బాగా చూపించారని చరణ్ ను ఉన్నతస్థాయిలో చూపారని కొనియాడారు. ఈ పోస్ట్ కు బుచ్చిబాబు స్పందిస్తూ.. అల్లు అర్జున్ కు థాంక్స్ చెప్పారు.



## అందుకే నిర్మాతగా మారాను: నాగచైతన్య

కథానాయకుడు నాగచైతన్య 'దూత' సిరీస్ తో ఓటీటీ రంగప్రవేశం చేసి హిట్ ను సొంతం చేసుకున్న విషయం తెలిసిందే. అమెజాన్ ప్రైమ్ వీడియోలో ఈ సిరీస్ విడుదలై ఘన విజయం సాధించింది. మూడేళ్ల తర్వాత దీనికి కొనసాగింపుగా ఇప్పుడు 'దూత 2' పట్టాలెక్కింది. నాగ చైతన్య ఈసారి నిర్మాణ బాధ్యతల్ని కూడా నిర్వర్తించనున్నారు. తాజాగా ఈ సిరీస్ గురించి ఆయన మాట్లాడారు. ఈ ప్రాజెక్ట్ అంటే తనకు ఎంతో ఇష్టమని.. నటనకు మించి ఏదైనా చేయాలని అనిపించిందని చైతన్య చెప్పారు. అందుకే నిర్మాతగా వ్యవహరించాలని నిర్ణయించుకున్నట్లు వెల్లడించారు. ఏదైనా పనిలో పూర్తిగా లీనమైనప్పుడు, దాన్ని మనస్ఫూర్తిగా ఆస్వాదిస్తామని ఆ అభిరుచే తనను 'దూత 2' సిరీస్ కు నిర్మాతగా కూడా తనవంతు సహకారం అందించేలా ప్రోత్సహించిందన్నారు. దర్శకుడు విక్రమ్ కుమార్, నిర్మాత శరత్ మారర్ లతో తనకు మంచి అనుబంధం ఉందన్నారు.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises Plot No:19, IDA Balanagar, Medchal-Malkajgiri Dist, Hyderabad-500037.Telangana state and Published From : Samrat Complex, Block A , Flat No : 8A, Saifabad, OPP : A G Office, Beside: Aranya Bhavan, Hyderabad, Pin : 500004, Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952.